# ప్రజా విముక్తి

భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు), తెలంగాణ రాష్ట్ర కమిటీ అధికార పత్రిక

సంపుటి: 12 సంచిక: 02 మే-సెప్టెంబర్, 2025

విషయ సూచిక


అమరుల వారోత్సవాల సందేశం - 2

బీఆర్ దా అమరత్వం-మన కర్తవ్యం-14

సైద్ధాంతిక వ్యాసం - 21

డాక్టర్ సలహా - 23

అమరుల చరిత్ర – 26

జీవో 49 శాశ్వత రద్దుకై - 40

పోరాట వార్తలు - 41




# 2025 జూలై 28 నుండి ఆగస్టు 3 వరకు అమరుల సంస్మరణ వారాన్ని పోరాటోత్తేజంతో పాటించండి.

## పార్టీని, పీ.ఎల్.జీ.ఏ.ను, ఐక్యసంఘటనను, విప్లవోద్యమాన్ని కాపాడుకుందాం.

## విప్లవ ప్రతిఘాతక 'కగార్' యుద్ధాన్ని విఫలం చేసేందుకు విశాల ప్రజారాశులను వర్గపోరాటంలో, గెరిల్లాయుద్ధంలో సమీకరిద్దాం.

**ప్రియమైన కామ్రేడ్స్, ప్రజలారా,**

బ్రాహ్మణీయ హిందుత్వ ఫాసిస్టు బీజేపీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, దోపిడీ వర్గాల ఇతర పార్టీల రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా గత సంవత్సరంన్నర కాలంగా కొనసాగిస్తున్న విప్లవ ప్రతిఘాతక 'కగార్' యుద్ధం మధ్య ఈసారి మనం జూలై 28 అమరుల సంస్మరణ వారాన్ని జరుపుకుంటున్నాం. కగార్ దాడిలో మనపార్టీ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ బసవరాజు (బీఆర్) సహా నలుగురు కేంద్రకమిటీ సభ్యులను, 15 మంది రాష్ట్రకమిటీ సభ్యులను, ఇతరులను కోల్పోయి తీవ్రమైన నష్టాలు కొనసాగుతున్న సమయంలో ఈ సంస్మరణ వారాన్ని జరుపుకుంటున్నాం. ప్రపంచ సోషలిస్టు విప్లవంలో భాగంగా మన దేశంలో నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని విజయవంతం చేసి, అంతిమంగా ప్రపంచవ్యాప్తంగా సోషలిజాన్ని-కమ్యూనిజాన్ని స్థాపించే లక్ష్యంతో సామ్రాజ్యవాదంతో, దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ, భూస్వామ్య వర్గాలతో పోరాడుతూ నేలకొరిగిన కామ్రేడ్స్ స్మృతిలో (యాదిలో) జరుపుకునే జూలై 28 అమరుల సంస్మరణ వారం సందర్భంగా వారి ఆశయాల సాధనకు పునరంకితమయ్యే విప్లవ సాంప్రదాయాన్ని కొనసాగిస్తున్నాం.

భారత విప్లవ మహానాయకులు, మనపార్టీ సంస్థాపక నాయకులు, ఉపాధ్యాయులు అమరులు కామ్రేడ్ చారుమజుందార్, కామ్రేడ్ కన్హయ్ చటర్జీ రూపొందించిన దీర్ఘకాల ప్రజాయుద్ధ మార్గంలో సాగుతూ మనదేశంలో గత సంవత్సర కాలంలో దాదాపు 357 మంది అమరులయ్యారు. వీరిలో 136 మంది మహిళా కామ్రేడ్స్ వున్నారు. గ్రామీణ ప్రజలు 31 మంది వున్నారు.


అమరులలో బిహార్, ఝార్ఖండ్ రాష్ట్రాలలో 14 మంది, తెలంగాణలో 23 మంది, దండకారణ్యంలో 281 మంది, ఆంధ్ర-ఒడిశా స్పెషల్ జోన్/ఏపీ లో 9 మంది, మహారాష్ట్ర-మధ్యప్రదేశ్-ఛత్తీస్ గఢ్ (ఎంఎంసీ) స్పెషల్ జోన్ లో 8 మంది, ఒడిశాలో 20 మంది, పశ్చిమ కనుమల్లో ఒకరు, పంజాబ్ లో ఒకరు ఉన్నారు. అనారోగ్యాలతో 4, సరైన వైద్యం అందకపోవడంతో 3, దుర్ఘటనలో ఒకరు, బూటకపు ఎన్కౌంటర్లలో 80, చుట్టివేత దాడుల్లో 269 మంది అమరులయ్యారు. అమరులైన వారిలో స్థాయిల వారీగా చూసినపుడు, మనపార్టీ ప్రధాన కార్యదర్శి సహా నలుగురు కేంద్రకమిటీ సభ్యులు, 16 మంది రాష్ట్రకమిటీ స్థాయి కామ్రేడ్స్, 23 మంది జిల్లా కమిటీ స్థాయి కామ్రేడ్స్, 83 మంది ఏసీ/పీపీసీ స్థాయి కామ్రేడ్స్, 138 మంది పార్టీ సభ్యులు, 17 మంది పీ.ఎల్.జీ.ఏ. సభ్యులు, 6 మంది ప్రజా నిర్మాణాల వారు, 34 మంది ప్రజలు ఉన్నారు. మొత్తం 357 మందిలో 36 మంది వివరాలు దొరకలేదు.

అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమంలో ఈ సంవత్సరకాలంలో కొంతమంది కామ్రేడ్స్ అమరులయ్యారు. మనదేశంలో, అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమంలో అమరులైన కామ్రేడ్స్ కందరికీ మన కేంద్రకమిటీ వినమ్రంగా శ్రద్ధాంజలి ఘటిస్తోంది. అమరుల కుటుంబ సభ్యులకు, బంధుమిత్రులకు సంతాపాన్ని, సంవేదనను తెలియజేస్తోంది.

ఈ సందర్భంగా అమరులందరి స్మృతిలో 2025 జూలై 28 నుంచి ఆగస్టు 3 వరకు అమరుల సంస్మరణ వారాన్ని వారి త్యాగాల స్ఫూర్తితో, విప్లవ సంకల్పంతో, పోరాటోత్తేజంతో జరుపుకోవాలనీ, పార్టీని, పీ.ఎల్.జీ.ఏ.ను, ఐక్యసంఘటనను/ప్రజానిర్మాణాలను, విప్లవోద్యమాన్ని కాపాడుకుందామనీ దేశవ్యాప్త విప్లవోద్యమ నిర్మూలన కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొనసాగిస్తున్న విప్లవ ప్రతిఘాతక 'కగార్' యుద్ధాన్ని విఫలం చేసేందుకు విశాల ప్రజారాశులను వర్గపోరాటంలో, గెరిల్లాయుద్ధంలో సమీకరిద్దామని యావత్తు పార్టీ, పీ.ఎల్.జీ.ఏ. బలగాలకు, విప్లవ ప్రజానిర్మాణాలకు, యావత్తు ప్రజానీకానికి సీపీఐ (మావోయిస్టు) కేంద్రకమిటీ పిలుపునిస్తోంది.

గత సంవత్సరకాలంలో అమరులైన కేంద్రకమిటీ, రాష్ట్రకమిటీ స్థాయి కామ్రేడ్స్ ఆదర్శనీయ జీవిత విశేషాలను సంక్షిప్తంగా చూద్దాం –

**కామ్రేడ్ బసవరాజు (నంబాల కేశవరావు) :** ఆయన వయసు 71 సంవత్సరాలు. దండకారణ్యంలోని మాడ్ డివిజన్ లోని గుండెకోట్ ప్రాంతంలో మే 21 నాడు జరిగిన చుట్టివేత దాడిలో ఆయన అమరుడయ్యారు. కామ్రేడ్ బసవరాజు (బీఆర్) 1974 చివర్లో విప్లవ విద్యార్థి సంఘ సభ్యుడిగా చేరారు. 1975లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో రాడికల్ విద్యార్థి సంఘ ఏర్పాటులో కీలకపాత్ర పోషించారు. ఉత్తర తెలంగాణ గెరిల్లా జోన్ పర్ స్పెక్టివ్-దండకారణ్య ఉద్యమ పర్ స్పెక్టివ్ సర్క్యులర్ ప్రకారం ఆనాటి రాష్ట్రకమిటీ దండకారణ్య ప్రాంతానికి 7 దళాలను పంపింది. ఆ సమయంలో తూర్పుగోదావరి-విశాఖపట్నం జిల్లాల్లోకి పంపబడిన దళానికి కామ్రేడ్ గంగన్న పేరుతో కమాండర్ గా ఉన్నారు. 1983లో రెండు దళాలకు నాయకత్వాన్ని అందించే కో-ఆర్డినేటర్ గా బాధ్యతలు చేపట్టి జిల్లాకమిటీ సభ్యుడిగా ఎదిగారు. 1985లో డివిజనల్ (జిల్లా) కమిటీ కార్యదర్శి బాధ్యతలు చేపట్టారు.



1987లో దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ సభ్యుడయ్యారు. 1991లో దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ కార్యదర్శిగా, కేంద్రకమిటీ సభ్యుడిగా బాధ్యతలు చేపట్టారు. 2001లో భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు-లెనినిస్టు) (పీపుల్స్ వార్) కాంగ్రెస్ లో కేంద్రకమిటీ సభ్యుడిగా ఎన్నికయి, పొలిట్ బ్యూరో సభ్యుడిగా, సెంట్రల్ మిలిటరీ కమిషన్ ఇంచార్జ్ గా బాధ్యతలు చేపట్టారు. ఈశాన్య భారతంలో జాతుల విముక్తి కోసం సాయుధ పోరాటం చేస్తున్న కొన్ని సంస్థలతో కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉమ్మడిగా పోరాడడానికి ఒప్పందాలు కుదుర్చుకోవడానికి కృషి చేసారు. 1998లో పీపుల్స్ వార్, పార్టీ యూనిటీల ఐక్యతా కృషిలో పాల్గొన్నారు. 2004లో పీపుల్స్ వార్, ఎంసీసీఐ పార్టీలు కలిసి సీపీఐ (మావోయిస్టు)గా ఏర్పడడానికి కారణమైన ఐక్యతా కృషిలో ఆయన ముఖ్యమైన పాత్ర పోషించారు. 2013లో సీపీఐ (మావోయిస్టు), నక్సల్బరీ పార్టీల ఐక్యతా కృషిలో ముఖ్యమైన పాత్ర పోషించారు. 2007లో ఐక్యతా కాంగ్రెస్-9వ కాంగ్రెస్ లో మరోమారు కేంద్రకమిటీ సభ్యుడిగా, పొలిట్ బ్యూరో సభ్యుడిగా ఎన్నికయ్యారు, మరోమారు సెంట్రల్ మిలిటరీ కమిషన్ ఇంచార్జ్ గా బాధ్యతలు చేపట్టారు. 2017 వరకు అదే బాధ్యతల్లో కొనసాగారు. 2017 నుండి ఇప్పటివరకు గత 8 సంవత్సరాలుగా సీపీఐ (మావోయిస్టు) ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతూ వచ్చారు.

51 సంవత్సరాల తన విప్లవ జీవితంలో కామ్రేడ్ బసవరాజు భారత విప్లవోద్యమానికి గొప్ప సేవలు (కంట్రిబూషన్) అందించారు. 1970వ దశకంలో వరంగల్-హన్మకొండ-కాజీపేట ప్రాంతంలో విప్లవ విద్యార్థి-యువజన ఉద్యమాన్ని నిర్మించారు. 1980వ దశకంలో దండకారణ్య విప్లవోద్యమ నిర్మాతల్లో ఒకరిగా నిలిచారు. 1990వ దశకంలో ఉత్తర తెలంగాణ, దండకారణ్య ఉద్యమాలను గెరిల్లా జోన్ స్థాయి ఉద్యమాలుగా అభివృద్ధి చేయడంలో ప్రత్యక్ష నాయకత్వాన్ని అందించారు. 2000 నుండి 2017 వరకు దండకారణ్యం, బిహార్-ఝార్ఖండ్ గెరిల్లా జోన్లను విముక్తి ప్రాంతాలుగా అభివృద్ధి చేసే లక్ష్యంతో ప్రజావిముక్తి గెరిల్లా సైన్యాన్ని (పీ.ఎల్.జీ.ఏ.ను) ఏర్పాటు చేయడంలో, గెరిల్లాయుద్ధాన్ని/ప్రజాయుద్ధాన్ని ఉన్నత స్థాయికి అభివృద్ధి చేయడంలో, ప్రజారాజ్యాధికార అంగాల (జనతన సర్కార్ల) ఏర్పాటులో కీలకమైన పాత్ర పోషించారు. ఈ మొత్తం కృషిలో సైద్ధాంతిక, రాజకీయ, మిలిటరీ, నిర్మాణ రంగాల్లో గొప్పగా కృషి చేసారు. 1985, 1991లో పార్టీలో తలెత్తిన 'అతివాద', మితవాద పంథాలను ఓడించడంలో, 2001, 2007 కాంగ్రెస్ ల్లో ముందుకు వచ్చిన అతివాద పంథాలను ఓడించడంలో ముందున్నారు. 2016లో 'చైనా సోషల్ సామ్రాజ్యవాదం' డాక్యుమెంట్ ను రూపొందించడంలో, 2021లో 'భారతదేశంలో ఉత్పత్తి సంబంధాల్లో మార్పులు-మన రాజకీయ కార్యక్రమం' డాక్యుమెంట్ రూపకల్పనలో కీలకపాత్ర పోషించారు. 2001 నుండి 2025 వరకు కేంద్రకమిటీ రూపొందించిన అన్ని డాక్యుమెంట్ల, పాలసీ పేపర్లన్నింటిలో కీలకపాత్ర పోషించి భారత విప్లవోద్యమానికి సైద్ధాంతిక, రాజకీయ నాయకత్వాన్ని అందించారు. దారగడ్డ ఆంబుష్ నుండి మొదలుకొని ముకరం ఆంబుష్ (2010) వరకు అనేక సైనిక చర్యల (ఆంబుష్ లు, రెయిడ్లు) పథక రచనలో (ప్లానింగ్), బలగాల మోటివేషన్ లో అగ్రగామి పాత్ర పోషించారు. కొన్ని చర్యల్లో ప్రత్యక్షంగా కమాండర్ గా వ్యవహరించారు. పీ.ఎల్.జీ.ఏ.ను సుశిక్షితమైన ప్రజా సైన్యంగా తీర్చిదిద్దడానికి అవామీ జంగ్ పత్రికకు ప్రధాన సంపాదకుడిగానే కాకుండా, అనేక మిలిటరీ శిక్షణా శిబిరాలను నడిపారు. ప్రధాన కార్యదర్శి బాధ్యతలు చేపట్టినప్పటి నుండి పార్టీ సిద్ధాంత పత్రిక 'పీపుల్స్ వార్' కు ప్రధాన సంపాదకుడిగా ఉంటూ సమర్థవంతంగా నడిపారు.


**కామ్రేడ్ వివేక్ (ప్రయాగ్ మాంఝీ) :** కేంద్రకమిటీ సభ్యుడు. ఆయన వయసు 66 సంవత్సరాలు. ఝార్ఖండ్ రాష్ట్రం, బొకారో జిల్లాలోని ముండాటోలీ-సోసో గ్రామాల సమీపంలో ఏప్రిల్ 21, 2025న జరిగిన చుట్టివేత దాడిలో కేంద్రకమిటీ సభ్యుడు కామ్రేడ్ వివేక్ సహా 8 మంది కామ్రేడ్స్ అమరులయ్యారు. ఆయన 13, 14 సంవత్సరాల వయసులోనే కామ్రేడ్ కన్హయ్ చటర్జీ సంబంధాల్లోకి వచ్చారు. 70ల చివర్లో ఆయన విప్లవోద్యమంలో పూర్తికాలం కార్యకర్తగా అడుగుపెట్టారు. ఆ తర్వాత ఆయన కామ్రేడ్స్ కన్హయ్ చటర్జీ (కేసీ), బరుణ్ దా, కిషన్ దాల నాయకత్వంలో పనిచేస్తూ పార్టీ సభ్యుడిగా, దళ కమాండర్ గా, సబ్ జోన్, జోన్ (జిల్లా), స్పెషల్ ఏరియా స్థాయి నాయకత్వ కామ్రేడ్ గా ఎదిగాడు. గయ-హజారిబాగ్ ప్రాంత విప్లవోద్యమం నిర్మాణంలో, తదనంతరం బిహార్-ఝార్ఖండ్ స్పెషల్ ఏరియా విప్లవోద్యమ నిర్మాణంలో ముఖ్యమైన పాత్ర పోషించారు. 2009లో బిహార్-ఝార్ఖండ్ స్పెషల్ ఏరియా కార్యదర్శి బాధ్యతలు చేపట్టారు. ఆయన కొంతకాలం తూర్పు బిహార్-ఈశాన్య ఝార్ఖండ్ స్పెషల్ ఏరియా కమిటీ కార్యదర్శిగా పనిచేసారు.



కామ్రేడ్ వివేక్ 2007లో జరిగిన ఐక్యతా కాంగ్రెస్-9వ కాంగ్రెస్ నిర్వహణ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించారు. విప్లవ ప్రజాసంఘాలను, విప్లవ ప్రజా కమిటీ (ఆర్.పీ.సీ.)లను, ప్రజాపోరాటాలను-వర్గపోరాటాన్ని అభివృద్ధి చేయడంలో చొరవగా కృషి చేసారు.

విప్లవ ప్రతిఘాతక సేంద్ర, నాగరిక్ సురక్షా సమితి వంటి శ్వేత మిలిషియాలను తిప్పికొట్టడానికి ప్రజలను, ప్రజామిలిషియాను సమీకరించారు. 2012 నుంచి విప్లవోద్యమం గడ్డుస్థితిని ఎదుర్కొన్నప్పటికీ, ఆ తర్వాత 2018 నుంచి తాత్కాలిక వెనకంజ స్థితిలో కొనసాగుతున్నప్పటికీ ఆ ప్రతికూల పరిస్థితుల్లో సైతం కామ్రేడ్ వివేక్ గుండె నిబ్బరంతో దృఢ సంకల్పంతో పనిచేసారు. పార్టీని, పీ.ఎల్.జీ.ఏ.ను, ఐక్యసంఘటనను, విప్లవోద్యమాన్ని కాపాడడానికి కృషి చేసారు.

**కామ్రేడ్ చలపతి (రామచంద్ర రెడ్డి) :** కేంద్రకమిటీ సభ్యుడు. ఆయన వయసు 62 సంవత్సరాలు. జనవరి 20 నాడు ఛత్తీస్ గఢ్ రాష్ట్రంలోని గరియబంద్ జిల్లాలోని కుల్హాడిఘాట్-బాలుడిగ్గీ అటవీ ప్రాంతంలో జరిగిన చుట్టివేత దాడిలో ఆయన అమరుడయ్యారు. 1985 నుండి శ్రీకాకుళం జిల్లాలో విప్లవ కార్యకలాపాల్లో పాల్గొనడం ప్రారంభించారు. 1987లో ఉద్యోగం వదిలిపెట్టి పూర్తికాలం కార్యకర్తగా పార్టీలో చేరి అజ్ఞాతవాసంలోకి వెళ్లారు. ఆయన మొదట ఉత్తరాంధ్రలోని శ్రీకాకుళం జిల్లాలో, ఆ తర్వాత ఆంధ్ర-ఒడిశా సరిహద్దు ప్రాంతంలోని ఈస్ట్ డివిజన్ లో, శ్రీకాకుళం-కొరాపుట్ డివిజన్ లో పనిచేసారు. పార్టీ సభ్యుడి నుండి మొదలుకొని దళ కమాండర్ గా, జిల్లాకమిటీ సభ్యునిగా, ఆ జోన్ ఎస్ఎంసీ ఇంచార్జీగా, ఒడిశా రాష్ట్రకమిటీ కార్యదర్శిగా, సీసీ, సీఎంసీ సభ్యునిగా అంచెలంచెలుగా ఎదిగి విప్లవోద్యమానికి నాయకత్వం వహించారు. పీడిత ప్రజల, కాడర్ల అభిమానాన్ని చూరగొన్నారు. కామ్రేడ్ చలపతి ప్రజా ఉద్యమాల-వర్గపోరాటాల నిర్మాణంలో, గెరిల్లాయుద్ధ నిర్మాణం-అభివృద్ధిలో ముఖ్యమైన పాత్ర నిర్వహించారు. ఆయన తూర్పు గోదావరి-విశాఖపట్నం డివిజన్ లో అటవీ భూముల ఆక్రమణ, కాఫీ ప్లాంటేషన్ల ఆక్రమణ పోరాటాలకు, బాక్సైట్ గనుల తవ్వకానికి వ్యతిరేకంగా జరిగే పోరాటానికి నాయకత్వాన్ని అందించారు. ఆయన అనేక అంబుష్ లకు, రెయిడ్లకు కమాండర్ గా వ్యవహరించి వాటిని సఫలం చేసారు. కామ్రేడ్ చలపతి చాలాకాలంగా తీవ్రమైన మోకాళ్ల నొప్పితో, నడుం నొప్పితో, బీపీతో బాధపడుతుండినారు. నడవలేని స్థితిలో కూడా దేశంలో నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని విజయవంతం చేయడం కోసం తన బాధ్యతలను తుదిశ్వాస వరకు అంకిత భావంతో నిర్వహించారు.



**కామ్రేడ్ ఉదయ్ (గాజర్ల రవీందర్) :** కేంద్రకమిటీ సభ్యుడు. ఆయన వయసు 56 సంవత్సరాలు. ఈ సంవత్సరం జూన్ 18 నాడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అల్లూరి సీతారామరాజు జిల్లాలోని మారెడుమిల్లి అటవీ ప్రాంతంలో జరిగిన చుట్టివేత దాడిలో అమరుడయ్యారు. 1982లో రాడికల్ విద్యార్థి సంఘంలో పనిచేయడం ద్వారా విప్లవోద్యమంలోకి వచ్చారు. 1984లో ప్రొఫెషనల్ రెవెల్యూషనరీ (పీఆర్)గా మారి వరంగల్ లోని మట్టెవాడ ప్రాంతంలో పనిచేసారు. 1991 డిసెంబర్ లో నార్త్ తెలంగాణ ఫారెస్టు డివిజన్ (ఎన్.టీ.ఎఫ్.డీ.)లోని ఏటూరు నాగారం దళంలోకి సభ్యుడిగా పంపబడ్డారు. 1992 మధ్యలో ఏసీఎం గా ప్రమోట్ అయ్యారు. 1993లో మణుగూరు దళానికి డిప్యూటీ కమాండర్ అయ్యారు. 1994లో ఎన్.టీ.ఎఫ్.డీ. సభ్యుడిగా బాధ్యతలు చేపట్టారు. 2000లో జరిగిన ఖమ్మం డివిజన్ కాన్ఫరెన్స్ లో ఆ డివిజన్ కార్యదర్శి బాధ్యతలు చేపట్టారు. 2000 సంవత్సరం చివర్లో జరిగిన ఉత్తరతెలంగాణ కాన్ఫరెన్స్ లో ఎస్.జెడ్.సీ.ఎంగా ఎన్నికయ్యారు. 2004లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో జరిగిన చర్చలకు ఎన్.టీ.ఎస్.జెడ్.సీ. నుండి ప్రాతినిధ్యం వహిస్తూ చర్చల్లో పాల్గొన్నారు. 2007లో జరిగిన ఐక్యతా కాంగ్రెస్–9వ కాంగ్రెస్ ఎన్.టీ.ఎస్.జెడ్.సీ. నుండి ప్రతినిధిగా హాజరయ్యారు. 2008లో ఉత్తరతెలంగాణ నుండి ఏఓబీకి బదిలీ చేయబడ్డారు. 2016లో ఏఓబీ ఎస్.జెడ్.సీ. కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టి అమరుడయ్యే వరకు అదే బాధ్యతల్లో కొనసాగుతూ వచ్చారు. 2017లో కేంద్రకమిటీలోకి కో–ఆప్ట్ చేసుకోబడ్డారు. గత 43 ఏళ్లుగా ఆయన ఉత్తరతెలంగాణ, ఏఓబీ ఉద్యమాల అభివృద్ధి కోసం కృషి చేసారు. వర్గపోరాట, గెరిల్లాయుద్ధ నిర్వహణలో ఆయన అపారమైన అనుభవాన్ని సంపాదించారు.



**కామ్రేడ్ శర్మ (జగ్జీత్ సింగ్ సోహల్) :** భారత విప్లవోద్యమ వెటరన్ నాయకుడు కామ్రేడ్ జగ్జీత్ సింగ్ సోహల్ (కామ్రేడ్ శర్మ) అక్టోబర్ 20, 2024 నాడు తన 96వ యేట అనారోగ్యంతో కన్నుమూసారు. దాదాపు ఏడు దశాబ్దాల పాటు ఆయన భారత కమ్యూనిస్టు ఉద్యమానికి అపారమైన సేవలందించారు. 1970లో జరిగిన పార్టీ 8వ కాంగ్రెస్ లో పంజాబ్ నుండి జగ్జీత్ సింగ్ కేంద్రకమిటీ సభ్యుడిగా ఎన్నికయ్యారు. 1972లో కామ్రేడ్ చారుమజుందార్ అమరుడైన తర్వాత పార్టీలో తలెత్తిన మితవాద, 'అతివాద' పంథాల వల్ల పార్టీ చీలికల పాలయింది. ఈ స్థితిలో పార్టీని సరైన విప్లవ పంథాలో నడపడానికి 1974 జనవరిలో కామ్రేడ్ శర్మ నాయకత్వంలో సెంట్రల్ ఆర్గనైజింగ్ కమిటీ ఏర్పడింది. అయితే భారత విప్లవానికి సరైన ఎత్తుగడలను రూపొందించడంలో విభేదాలు తలెత్తడంతో 1977 మే నుండి అది పనిచేయకుండా పోయింది. అయినప్పటికీ అప్పటినుండి అమరుడయ్యేంత వరకు ఆయన పంజాబ్ రాష్ట్రంలో మనపార్టీ కార్యకలాపాల్లో పాల్గొంటూ వచ్చారు. ఆ రాష్ట్ర పార్టీ కమిటీకి ఆయన కొంతకాలం కార్యదర్శిగా పనిచేసారు. అమరుడయ్యే వరకు ఆయన రాష్ట్ర కమిటీ స్థాయి కామ్రేడ్ గా విప్లవోద్యమంలో పని చేసారు.





**కామ్రేడ్ గౌతం (టెంతు లక్ష్మీనరసింహాచలం) :** రాష్ట్రకమిటీ స్థాయి కామ్రేడ్. సెంట్రల్ రీజినల్ పొలిటికల్ స్కూల్ (రీపోస్) బాధ్యుడు. ఆయన వయసు 66 సంవత్సరాలు. ఈ సంవత్సరం జూన్ 3–8 వరకు నేషనల్ పార్క్ ఏరియాలో జరిగిన చుట్టివేత దాడిలో ఆయన జూన్ 5 నాడు అమరుడయ్యారు. 1980లో విజయవాడలో ఆయుర్వేద మెడికల్ కాలేజీలో చదువుతూ ఆర్.ఎస్.యూ.లో చేరారు. 1981లో పూర్తికాలం కార్యకర్తగా విప్లవోద్యమంలో భాగమయ్యారు. మొదట కృష్ణా, గుంటూరు జిల్లాల్లో విప్లవోద్యమ నిర్మాణానికి కృషి చేసారు. ఆ తర్వాత దక్షిణ కోస్తా ప్రాంతంలో విప్లవోద్యమ నిర్మాణానికి కృషి చేసారు. నల్లమల అటవీ ప్రాంతంలో కొంతకాలం పనిచేసారు. 1997లో రాష్ట్రకమిటీ సభ్యుడిగా ఎదిగారు. 2001లో ఏఓబీ స్పెషల్ జోన్ ఏర్పడ్డపుడు పార్టీ ఆయనను అక్కడికి బదిలీచేసింది. అక్కడ ఆయన సెక్రటేరియట్ సభ్యుడిగా, తదనంతరం ఆ కమిటీ కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టారు. ఏఓబీ ఉద్యమాభివృద్ధిలో ముఖ్యమైన పాత్ర పోషించారు. 2009 నుండి అమరుడయ్యే వరకు ఆయన క్రాంతి పత్రికా సంపాదకుడిగా, రాజకీయ గురువుగా (పొలిటికల్ టీచర్) పనిచేసారు. ఏఓబీ ఉద్యమాభివృద్ధిలో ముఖ్యమైన పాత్ర పోషించారు. వయసు

పైబడడంతో ఏఓబీ టెర్రయిన్ లో తిరగడంలో సమస్యలు ఎదురవడంతో ఆయనను పార్టీ సెంట్రల్ రీజియన్ విద్యా విభాగానికి బాధ్యునిగా బదిలీ చేసింది. గత 16 సంవత్సరాలుగా ఆయన రీసోర్స్ టీచర్ గా తెలంగాణ, ఏఓబీ, డీకేలోని అనేకమంది ఎస్.జెడ్.సీ.ఎంలకు, డీవీసీ/సీవైపీసీఎంలకు రాజకీయ తరగతులు చెప్పారు. అవి ఆయా కామ్రేడ్స్ ఎదుగుదలకు ఉపయోగపడ్డాయి.



**కామ్రేడ్ మధు (సజ్జా వెంకట నాగేశ్వరరావు) :** రాష్ట్రకమిటీ స్థాయి కామ్రేడ్. కేంద్రకమిటీ/కేంద్ర సైనిక కమిషన్ స్టాఫ్ సభ్యుడు. అవామీజంగ్ పత్రికా సంపాదకుడు. ఆయన వయసు 60 సంవత్సరాలు. మే 21 నాడు మాడ్ డివిజన్ లోని గుండెకోట్ అడవుల్లో జరిగిన చుట్టివేత దాడిలో మన పార్టీ ప్రధాన కార్యదర్శి బీఆర్ తో పాటు అమరుడయ్యారు. 1981 నుండి విప్లవ కార్యకలాపాల్లో పాల్గొన్నారు. 1983-84లో వృత్తి విప్లవకారుడిగా మారారు. అప్పటినుండి 1987 వరకు గుంటూరు, ప్రకాశం జిల్లాల్లో విప్లవోద్యమ నిర్మాణానికి కృషిచేసారు. ఆ జిల్లాల్లోని వేర్వేరు దళాల్లో పనిచేసారు. 1998లో అవామీ జంగ్ పత్రిక స్టాఫ్ గా బాధ్యతలు చేపట్టారు. తదనంతర కాలంలో ఆ పత్రిక సంపాదకవర్గ సభ్యుడయ్యారు. 1998 నుండి 2025 వరకు అవామీ జంగ్ పత్రిక సంపాదకుడిగా, సీసీ/సీఎంసీ స్టాఫ్ గా సమర్థవంతంగా, విశ్వసనీయుడిగా పనిచేసారు. 27 సంవత్సరాల పాటు కామ్రేడ్ బసవరాజు, మధులు కలిసి సీసీ/సీఎంసీకి సంబంధించిన అనేక పనుల్ని సమర్థవంతంగా నిర్వహించారు. ఆయన అలుపెరగకుండా అనేక గంటలపాటు కంప్యూటర్ పనులు చేసేవారు. ఆయన మిలిటరీ విషయాలతో పాటు ఆర్థిక, రాజకీయ, సాంకేతిక విషయాలను విస్తృతంగా అధ్యయనం చేసారు. ఆయన విస్తృత అధ్యయనం, అలుపెరగని పనిశైలి ఆయన బాధ్యతల నిర్వహణకు, ఎంతగానో ఉపయోగపడింది. కేంద్రకమిటీ, కేంద్ర సైనిక కమిషన్ సకాలంలో సర్క్యులర్లు, సందేశాలు వగైరా తీసుకరావడానికి సీసీ, సీఎంసీ సభ్యులతో కలిసి ఆయన చేసిన టీమ్ వర్క్ మనందరికీ ఎంతో ఆదర్శం, అనుసరణీయం.

**కామ్రేడ్ రూపేష్ (శ్యాం రావు మడావి) :** డీకే ఎస్.జెడ్.సీ.ఎం. ఆయన వయసు 38 సంవత్సరాలు. 2024, సెప్టెంబర్ 26 నాడు మాడ్ ప్రాంతంలోని కాకూర్ అటవీ ప్రాంతంలో జరిగిన చుట్టివేత దాడిలో ఆయన అమరుడైనారు. కగార్ యుద్ధంలో దండకారణ్యంలో అమరుడైన తొలి ఎస్.జెడ్.సీ.ఎం కామ్రేడ్ రూపేష్. కామ్రేడ్ రూపేష్ 16 ఏళ్ల వయసులో 2002లో పీ.ఎల్.జీ.ఏ.లో భర్తీ అయ్యారు. ఆయన విప్లవోద్యమంలో చేరిన ప్రారంభంలో గఢ్చిరోలీ జిల్లా, అహెరీ ప్రాంతంలో పనిచేసారు. అక్కడ మూడు సంవత్సరాలు పనిచేసారు. 2007 మార్చి నుండి 2008 మార్చి వరకు సీసీ కామ్రేడ్ గార్డ్స్ దళానికి కమాండర్ గా పనిచేసారు. 2008 మార్చిలో ఆయన కంపెనీ-4కు బదిలీ అయ్యారు. 2009లో అక్కడ సీవైపీసీ సభ్యుడిగా ప్రమోట్ అయ్యారు. 2010లో నూతనంగా ఏర్పడిన కంపెనీ-10కి కమాండర్ అయ్యారు. అప్పటినుండి 2020 వరకు ఆ బాధ్యతల్లో వుంటూ 2014లో కంపెనీ పార్టీ కమిటీ కార్యదర్శిగా కూడా బాధ్యతలు చేపట్టారు. 2020 సెప్టెంబర్ లో జరిగిన డీకే ప్లీనంలో ఆయన ఎస్.జెడ్.సీ. సభ్యునిగా ఎన్నికయ్యారు. గఢ్చిరోలీ జిల్లాలో, ఆయన అనేక గెరిల్లాయుద్ధ చర్యల్లో పాల్గొన్నారు, కొన్నింటికి కమాండర్ గా వ్యవహరించారు. గఢ్చిరోలీ జిల్లాలో విప్లవోద్యమం తీవ్రమైన ప్రతికూలతలు ఎదుర్కొంటున్నప్పటికీ వాటిని అధిగమించడానికి ఆయన నిరంతరం రాజకీయ, నిర్మాణ, సైనిక కృషి కొనసాగిస్తూ వచ్చారు.



**కామ్రేడ్ నీతి (పొట్టెం కోపె) :** డీకే ఎస్.జెడ్.సీ.ఎం. ఆమె వయసు 46 సంవత్సరాలు. 2024, అక్టోబర్ 4 నాడు నారాయణపూర్, దంతెవాడ జిల్లాల సరిహ ప్రాంతమైన గవాడీ-తుల్ తులీ అటవీ ప్రాంతంలో జరిగిన చుట్టివేత దాడిలో అమరురాలైంది.



ఆమె 1996లో గెరిల్లా దళంలోకి పూర్తికాలం కార్యకర్తగా భర్తీ అయ్యారు. దానికి ముందు గ్రామంలో క్రాంతికారీ ఆదివాసీ మహిళా సంగఠన్ (కేఏఎంఎస్)లో పనిచేసారు. దళంలో భర్తీ అయిన తర్వాత కొద్దికాలం పాటు పశ్చిమ బస్తర్ లో పనిచేసి, ఆ తర్వాత ఉత్తర బస్తర్ లోని కొండగావ్ దళానికి బదిలీ అయ్యారు. అక్కడ ఆమె ఏసీ సభ్యురాలిగా ఎదిగారు. ఆ తర్వాత డీవీసీఎంగా ఎదిగారు. 2017 చివర్లో ఆమె తూర్పు బస్తర్ డివిజన్ కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టారు. 2020 సెప్టెంబర్ లో జరిగిన ప్లీనంలో ఎస్.జెడ్.సీ. ఆల్టర్నేటివ్ సభ్యురాలిగా ఎన్నికయ్యారు. 2024 సెప్టెంబర్ లో ఆమెను పూర్తికాలం ఎస్.జెడ్.సీ.ఎంగా కమిటీలోకి తీసుకోవడం జరిగింది. ఆమె తూర్పు బస్తర్, ఉత్తర బస్తర్ ప్రాంతంలోని దాదాపు అన్ని ప్రాంతాల్లో పనిచేసారు లేదా అన్ని ప్రాంతాలతో ఆమెకు పరిచయం ఉంది. ఆ రెండు

డివిజన్ల విప్లవోద్యమ అభివృద్ధిలో ఆమె పాత్ర విడదీయలేనిది. అక్కడ జరిగిన ప్రజాపోరాటాలన్నింటిలో ఆమె భాగస్వామ్యం ఉంది, ఆమె వాటికి ఆయా స్థాయిల్లో నాయకత్వాన్ని అందించారు.

**కామ్రేడ్ కార్తీక్ (పృథ్వి మోహన్ రావు) :** ఒడిశా రాష్ట్రకమిటీ సభ్యుడు. ఆయన వయసు 65 సంవత్సరాలు. 2024 డిసెంబర్ 10-13 మధ్య మాడ్ డివిజన్ ఇంద్రావతి ఏరియాలోని కుమ్మం అటవీ ప్రాంతంలో జరిగిన చుట్టివేత దాడిలో శత్రువు ఆయనను, ఆయన సహాయకురాలు (గార్డ్) కామ్రేడ్ రమీలాను పట్టుకుని పట్టుకుని హత్య చేసాడు. 1981-82లో పార్టీలో పూర్తికాలం కార్యకర్తగా భర్తీ అయ్యారు. కామ్రేడ్ కార్తీక్ కోస్తా ఆంధ్రప్రదేశ్ లో పార్టీ కార్యకలాపాల్లో చురుగ్గా పనిచేసారు. 1986లో ఆయనకు వివాహం జరిగింది. కార్తీక్ జంటను పార్టీ కేంద్రకమిటీ రహస్య యంత్రాంగంలోకి తీసుకుంది. 1996లో దండకారణ్యంలో కంప్యూటర్, బేబీ ఆఫ్ సెట్ మిషన్ తో ప్రింటింగ్ ప్రెస్ ను స్థాపించడం ద్వారా దండకారణ్య ప్రెస్ రంగాన్ని అభివృద్ధి చేయడంలో కామ్రేడ్ కార్తీక్ ముఖ్యపాత్ర పోషించారు. తరువాత దస్రు పేరుతో ఉత్తర బస్తర్ డివిజనల్ కమిటీకి బదిలీ అయ్యారు. 2000 సంవత్సరంలో డీకే ఎస్.జడ్.సీ. సభ్యునిగా ప్రమోట్ అయ్యారు. 2004 నుంచి 2006 దాక దర్భ డివిజన్ ను గైడ్ చేసారు. ఎస్.జడ్.సీ. సెక్రటేరియట్ సభ్యునిగా, జోన్ మోపోస్-సుకోమా బాధ్యతలు చేపట్టారు. రాజకీయంగా, సైనికంగా, నిర్మాణపరంగా పార్టీ అప్పగించిన పలు బాధ్యతలు నిర్వహిస్తూ డీకే ఉద్యమాభివృద్ధికి ఎంతగానో శ్రమించారు.



2007 జులై-అగస్టు నుంచి కామ్రేడ్ దస్రు ఒడిశా రాష్ట్రంలోకి ఉద్యమాన్ని విస్తరింపచేయడంలో ముఖ్యమైన పాత్ర పోషించారు. కార్తీక్ పేరుతో ధంతరి-గరియాబంద్ వైపు బదిలీ అయ్యారు. అక్కడ మొదట ఒక పీఎల్, ఆ తరువాత డీవీసీ ఏర్పడింది. ఆయనకు పార్టీ డీవీసీ కార్యదర్శి బాధ్యతలు ఇచ్చింది. 2015 వరకు ఆయన ఆ బాధ్యత నిర్వహించారు. సీతానది-ఉదంతి-సోనాబేడ ప్రాంతాల్లో ప్రజలను సంఘటితం చేసారు. అటవీ ఉత్పత్తుల రేట్ల పెంపు, తునికి ఆకుల రేట్ల పెంపు, మూడు అభయారణ్యాల (సోనాబేడ, ఉదంతి, సీతానది) పథకాలకు వ్యతిరేకంగా, తదితర సమస్యలు తీసుకుని ప్రజా పోరాటాలు నడిపారు. ఆదివాసులకు అటవీ భూములను నరికి సాగు చేసుకునే హక్కు కోసం పోరాటాలకు నాయకత్వం వహించారు. ఇలా కామ్రేడ్ కార్తీక్ ప్రజా నాయకుడిగా ఎదిగారు. శత్రు నిర్బంధాన్ని నిబ్బరంగా ఎదుర్కొంటూ లొంగుబాట్లను అసహ్యించుకుంటూ అమరుల త్యాగాలను ఎత్తిపడుతూ ఉద్యమానికి స్థిరంగా నాయకత్వం అందించారు.

2010లో విస్తరణ కర్తవ్యాలతో డీకే నుండి సుమారు రెండు కంపెనీల బలగాలు ఒడిశా ప్రాంతంలోకి వెళ్లాయి. ఉద్యమం క్రమంగా మూడు డివిజన్ లుగా బలపడింది. 2011 డిసెంబరులో ఛత్తీస్ గఢ్-ఒడిశా బార్డర్ (సీఓబీ) రాష్ట్ర కమిటీ ఏర్పడింది. కామ్రేడ్ కార్తీక్ దీనిలో భాగమయ్యారు. 2013లో ఒడిశా ఎస్ఓసీ, సీఓబీ విలీనమయ్యాయి. 2015లో ఒడిశా రాష్ట్ర మహాసభ జరిగింది. ఆ తర్వాత రాష్ట్రకమిటీ సభ్యుడిగా కామ్రేడ్ కార్తీక్ పశ్చిమ సబ్ జోన్ బ్యూరో బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్ర కమిటీ అధికార ప్రతినిధిగా చక్ర బిసోయి (బ్రిటిష్ వ్యతిరేక తిరుగుబాటుదారుని పేరు) పేరుతో బాధ్యతలు స్వీకరించారు. కామ్రేడ్ కార్తీక్ గెరిల్లా యుద్ధాన్ని అభివృద్ధి చేయడంలో మంచి ఫైటర్ గా వుంటూ, ముందుండి సాహసికంగా నాయకత్వం వహించారు. రిచ్ గామ్ ఆంబుష్ లో పాల్గొన్నారు. సన్ బయల్, శిల్పిగాట్ ఆంబుష్ లకు నాయకత్వం వహించారు. అంతేకాక ఆయన అనేక ఎదురుకాల్పుల్లో శత్రువును ఎదిరించడంలో కామ్రేడ్స్ తో కలిసి దృఢంగా నిలబడ్డారు.

కామ్రేడ్ కార్తీక్ 2023 అక్టోబర్ వరకు ఒడిశా రాష్ట్రకమిటీ సభ్యునిగా కొనసాగారు. వయసు పైబడడంతో ఆయన క్రమంగా అల్జీమర్స్ వ్యాధితో బాధపడుతూ వచ్చారు. దీంతో 2023 అక్టోబర్ తర్వాత ఆయన క్రియాశీలంగా రాజకీయ, నిర్మాణ కృషి నిర్వహించలేని స్థితి ఏర్పడింది.



**కామ్రేడ్ చైతే (గుముడవెల్లి రేణుక) :** డీకేఎస్.జెడ్.సీ.ఎం. ఆమె వయసు 55 సంవత్సరాలు. 2025, మార్చి 31 నాడు మాడ్ డివిజన్, ఇంద్రావతి ఏరియా బేల్ నార్ గ్రామంలో సివిల్ లో నిరాయుధంగా ఉన్న ఆమెను ఛత్తీస్ గఢ్ పోలీసు బలగాలు సజీవంగా పట్టుకుని చిత్రహింసలు పెట్టి హత్యచేసాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని తిరుపతి పట్టణంలో 1992లో ఆమె ఎల్.ఎల్.బీ. చదువుతున్న సమయంలో ఆమెకు విప్లవోద్యమంతో పరిచయమైంది. 1996లో పూర్తికాలం పార్టీ కార్యకర్తగా చేరారు. ప్రారంభంలో తిరుపతి పట్టణంలో మహిళా ఉద్యమ నిర్మాణంలో పనిచేసారు. ఈ క్రమంలో మహిళామార్గం పత్రిక

ఎడిటోరియల్ బోర్డు సభ్యురాలిగా పత్రికను క్రమం తప్పకుండా ప్రచురించడంలో ముఖ్యమైన బాధ్యత పోషించారు. ఆ తర్వాత ఆమె విశాఖపట్నంలో లాయర్ గా ప్రాక్టీస్ కొనసాగిస్తూనే మహిళా సంఘంలో క్రియాశీలంగా పనిచేసారు. 2001 నుండి విశాఖ నగర కమిటీ సభ్యురాలిగా వుంటూ మహిళా ఉద్యమ బాధ్యతలు నిర్వహించారు. 2003లో ఏఓబీ ఉద్యమంలో భాగమయ్యారు. అక్కడ ఆమె తూర్పు గోదావరి, శ్రీకాకుళం, బాసధార డివిజన్లలో పనిచేసారు. 2006లో పార్టీ ఆమెను 'క్రాంతి' పత్రిక సంపాదక వర్గంలోకి తీసుకుంది. దాంతో ఆమె కార్యరంగం ఏఓబీ నుంచి దండకారణ్యానికి మారింది. 2006 నుండి 2012 వరకు ఆమె క్రాంతి పత్రిక సంపాదక మండలి సభ్యురాలిగా సమర్థవంతంగా పనిచేసారు. 2014 నుండి దండకారణ్య స్పెషల్ జోన్ అధికార పత్రిక 'ప్రభాత్' సంపాదక వర్గంలో భాగమయ్యారు. పట్టుదలగా కృషి చేసి హిందీ భాషపై పట్టు సంపాదించారు. తర్వాత పత్రిక సంపాదకురాలిగా ప్రధాన బాధ్యత వహిస్తూ పత్రికను తీసుకొచ్చారు. దండకారణ్య విప్లవోద్యమ నిర్మూలన కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొనసాగించిన/కొనసాగిస్తున్న సల్వాజుడుం నుండి కగార్ యుద్ధం వరకు అనేక విప్లవ ప్రతిఘాతక సైనిక ఆపరేషన్ల హత్యకాండను బహిర్గత పరుస్తూ, కరపత్రాల్ని, పుస్తకాల్ని రాసి ప్రచురించారు. నారాయణపట్నా భూపోరాటంపై పుస్తకం రాసారు. 'మిడ్కో' కలం పేరుతో ఆమె అనేక కథలు రాసారు. 2020 సెప్టెంబర్ లో జరిగిన దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ ప్లీనంలో ఎస్.జెడ్.సీ. సభ్యురాలిగా ఎన్నికయ్యారు. అదే సమయంలో మహిళా సబ్ కమిటీ సభ్యురాలిగా కూడా బాధ్యతలు చేపట్టారు.



**కామ్రేడ్ గుడ్డు (నూపో సన్ను) :** ఒడిశా రాష్ట్రకమిటీ సభ్యుడు. ఆయన వయసు 43 సంవత్సరాలు. ఆయన ఈ సంవత్సరం గరియబంద్ జిల్లా, కుల్హాడిఘాట్-బాలుడిగ్గి అటవీ ప్రాంతంలో జనవరి 19 నుండి 22 వరకు జరిగిన చుట్టివేత దాడిలో అమరుడయ్యారు. ఆయన 2000 సంవత్సరంలో విప్లవోద్యమంలో పూర్తికాలం కార్యకర్తగా చేరారు. మొదట కొద్దిరోజులు దక్షిణ బస్తర్ డివిజన్ లోని జేగురుగుండ ఏరియాలో పనిచేసారు. ఆ తర్వాత ఏరియా, డివిజనల్ చేతనా నాట్యమంచ్ కళా బృందంలో పనిచేసారు. ఆ తర్వాత డీవీసీఎంగా ప్రమోట్ అయ్యారు. 2010లో డీకే నుండి దాదాపు రెండు కంపెనీల బలగాలు ఒడిశాకు విస్తరణకు వెళ్లినపుడు అందులో భాగంగా ఒడిశాకు వెళ్లి నువాపాడ ప్రాంతంలో పనిచేసారు. 2017లో ఎస్.జెడ్.సీ.లోకి కో-ఆప్ట్ అయ్యారు. 2010 నుండి 2025 వరకు మైన్పూర్-నువాపాడ (ధంతరి-గరియాబంద్-నువాపాడ) డివిజన్ లో విప్లవోద్యమ అభివృద్ధికి తీవ్రమైన కృషి చేసారు.




**కామ్రేడ్ సత్యం (సత్యం గావ్డే) :** ఒడిశా రాష్ట్రకమిటీ సభ్యుడు. ఆయన వయసు 42 సంవత్సరాలు. ఆయన ఈ సంవత్సరం జనవరిలో జరిగిన కుల్హాడిఘాట్-బాలుడిగ్గి చుట్టివేత దాడిలో అమరుడయ్యారు. ఆయన 2001లో విప్లవోద్యమంలో పూర్తికాలం కార్యకర్తగా చేరారు. మొదట కొంతకాలం ఉత్తర బస్తర్ డివిజన్ లోని పర్తాపుర్, రావుఘాట్ ఏరియాల్లో పనిచేసారు. 2007లో మైన్పూర్-సోనబేడా ప్రాంతానికి విప్లవోద్యమాన్ని విస్తరించే కర్తవ్యాన్ని పార్టీ చేపట్టినపుడు ఆ కర్తవ్య సాధనకోసం వెళ్లిన మొదటి బ్యాచ్ లో కామ్రేడ్ సత్యం ఏసీఎంగా వెళ్లారు. 2007 ఎండాకాలంలో అరెస్టయి 3 సంవత్సరాలు జైలులో బందించబడ్డారు. జైలు నుండి విడుదలైన వెంటనే తిరిగి మైన్పూర్-సోనబేడా ప్రాంతానికి వెళ్లి ఆ ప్రాంతంలో విప్లవోద్యమ నిర్మాణానికి అహర్నిశలు కృషిచేసారు. ఆ ప్రాంతంలో ప్రజలను కూడగట్టి అభయారణ్యాలకు వ్యతిరేకంగా పోరాటాలు నిర్వహించారు. ప్రజలను స్థానిక నిర్మాణాల్లో సంఘటితం చేసారు. ఆ ప్రాంత ప్రజల అభిమానం చూరగొన్న నాయకుడుగా ఎదిగారు. ఈ క్రమంలో డీవీసీఎంగా ఎదిగారు. 2021 ఆగస్టులో జరిగిన ఒడిశా రాష్ట్ర ప్లీనంలో రాష్ట్రకమిటీ సభ్యునిగా ఎన్నికయ్యారు. అప్పటినుండి ఆయన పశ్చిమ సబ్ జోనల్ కమాండ్ ఇంచార్జిగా, ఒడిశా రాష్ట్ర మిలిటరీ కమిషన్ సభ్యుడుగా పనిచేస్తూ వచ్చారు.



**కామ్రేడ్ అలోక్ (బావురి బంధు సేఠి) :** ఒడిశా రాష్ట్రకమిటీ సభ్యుడు. ఆయన వయసు 38 సంవత్సరాలు. ఈ సంవత్సరం జనవరిలో జరిగిన కుల్హాడిఘాట్-బాలుడిగ్గి చుట్టివేతలో అమరుడయ్యారు. 2000 సంవత్సరం నుండి అమరుడు కామ్రేడ్ బరుణ్ దాద ఒడిశాలో ప్రారంభించిన విప్లవ నిర్మాణ కృషిలో భాగంగా ముందుకు వచ్చిన విప్లవకారుల్లో కామ్రేడ్ అలోక్ ఒకరు. ఆయన 2005లో విప్లవోద్యమంలోకి పూర్తికాలం కార్యకర్తగా వచ్చారు. తదనంతరం కొంతకాలం బర్ గఢ్-బొలంగీర్ ప్రాంతంలో పనిచేసారు. ఆ తర్వాత బాసధార-ఘుంసరా-నాగావళి డివిజన్ లో పని చేస్తూ వచ్చారు. అక్కడే ఆయన ఏసీఎంగా, దళ కమాండర్ గా, డీవీసీఎంగా అభివృద్ధి అవుతూ, ఆ డివిజన్ ఉద్యమాభివృద్ధి కోసం కృషి చేసారు. ఒడిశా రాష్ట్రకమిటీ

కార్యదర్శిగా వుండిన సవ్యసాచి పండా పార్టీలో విచ్ఛిన్నకర, ముఠాకోరు చర్యలకు పాల్పడ్డపుడు స్థానికతత్వానికి గురికాకుండా వాటిని వ్యతిరేకించి విప్లవోద్యమంలో దృఢంగా నిలబడ్డారు. 2021 ఆగస్టులో జరిగిన రాష్ట్ర ప్లీనంలో ఆల్టర్నేటివ్ రాష్ట్రకమిటీ సభ్యుడిగా ఎన్నికయ్యారు. ఒడియా భాషలో పార్టీ పత్రికను నడపడానికి తీవ్రంగా కృషిచేసారు.

**కామ్రేడ్ పాపన్న (కుర్సం మంగు) :** తెలంగాణ రాష్ట్రకమిటీ సభ్యుడు. ఆయన వయసు 41 సంవత్సరాలు. 2024, డిసెంబర్ 1 నాడు అమరుడయ్యారు. తెలంగాణ ములుగు జిల్లాలోని ఏటూరు నాగారం అటవీ ప్రాంతంలో ప్రజల్లో పట్టు సంపాదించుకుని పనిచేస్తున్న మన దళాన్ని అంతమొందించాలనే దుష్ట పథకంతో తెలంగాణ ఎస్ఐబీ-గ్రేహౌండ్స్ బలగాలు కలిసి తమ ఇన్ఫార్మర్ల ద్వారా మన కామ్రేడ్స్ తినే తిండిలో విషం పెట్టి హత్య చేసాయి. 2001లో ఆయన పీ.ఎల్.జీ.ఏ.లో భర్తీ అయ్యారు. కొద్దికాలం పశ్చిమ్ బస్తర్ డివిజన్ లో పనిచేసిన తర్వాత పార్టీ ఆయనను తెలంగాణకు బదిలీచేసింది. అక్కడ ఆయన మొదట రాష్ట్రకమిటీ ప్రొటెక్షన్ దళంలో పనిచేసారు. కొంతకాలం ప్లాటూన్ కమాండర్ గా కూడా పనిచేసారు. ఆ తర్వాత వరంగల్ ఉద్యమంలో భాగమయ్యారు. తెలంగాణ ఉద్యమాన్ని పెంపొందిస్తూ ఆ క్రమంలో తను ఏసీఎంగా, డీవీసీఎంగా ఎదిగారు. 2023లో రాష్ట్రకమిటీ సభ్యుడయ్యారు.



**కామ్రేడ్ మధు (ఏగోలపు మల్లయ్య) :** తెలంగాణ రాష్ట్రకమిటీ సభ్యుడు. ఆయన వయసు 47 సంవత్సరాలు. 2024, డిసెంబర్ 1 నాటి విష ప్రయోగపు దాడిలో అమరుడయ్యారు. 1995లో విప్లవోద్యమంలోకి పూర్తికాలం కార్యకర్తగా వచ్చారు. మొదట కరీంనగర్ జిల్లాలోని దళాల్లో పనిచేసారు. కొంతకాలం ఉత్తర తెలంగాణ ప్లాటూన్ లో సభ్యుడిగా వున్నారు. 2000 సంవత్సరం నుండి డీకే ఉద్యమంలో భాగమయ్యారు. డీకేలో మొదట మాడ్ డివిజన్ లోని ప్లాటూన్ లో, ఆ తర్వాత కంపెనీ-1లో పనిచేసారు. ఆ తర్వాత పార్టీ ఆయనను మాన్పూర్ ప్రాంత విస్తరణకు పంపింది. తనతో వున్న సభ్యులతో, కమిటీ సభ్యులతో కలిసి ఆ ప్రాంతంలో డివిజన్ స్థాయి ఉద్యమాన్ని నిర్మించడంలో విశేష కృషి చేసారు. అక్కడ దీర్ఘకాలం పాటు డీవీసీఎంగా పనిచేసారు. పార్టీ మళ్లీ ఆయనను మాడ్ డివిజన్ కు బదిలీ చేసినపుడు ఇంద్రావతి ఏరియాలో ప్రజా నిర్మాణాల సంఘటితీకరణ, పీ.ఎల్.జీ.ఏ. రిక్రూట్ మెంట్ క్యాంపెయిన్ల సఫలతకు పట్టుదలగా కృషిచేసారు. 2022 చివర్లో ఆయనను పార్టీ తెలంగాణ రాష్ట్రానికి బదిలీచేసింది. 2024 నవంబర్ లో ఆయన రాష్ట్రకమిటీ సభ్యుడయ్యారు.



**కామ్రేడ్ భాస్కర్ (మైలారపు అడేల్లు) :** తెలంగాణ రాష్ట్రకమిటీ సభ్యుడు. వయసు 55 సంవత్సరాలు. ఈ సంవత్సరం జూన్ 3-8 వరకు నేషనల్ పార్క్ ఏరియాలో జరిగిన చుట్టివేత దాడిలో ఆయన జూన్ 6 నాడు అమరుడయ్యారు. 1990లో ఆయన విప్లవోద్యమంలోకి పూర్తికాలం కార్యకర్తగా వచ్చారు. ప్రారంభం నుండి ఇప్పటివరకు 3½ దశాబ్దాల పాటు ఆయన ఆదిలాబాద్ జిల్లా విప్లవోద్యమంలోనే పనిచేస్తూ వచ్చారు. ఆ జిల్లా ఉద్యమంలోని ప్రతి మలుపులో ఆయన పాత్ర ఉంది. ఆ జిల్లా ఉద్యమాభివృద్ధితో పాటే తను దళ కమాండర్ గా, ఏసీ కార్యదర్శిగా, డీవీసీ సభ్యుడిగా, డివిజన్ (జిల్లా) కార్యదర్శిగా ఎదుగుతూ వచ్చారు. 2015లో జరిగిన తెలంగాణ రాష్ట్ర ప్లీనంలో ఎస్.జెడ్.సీ. సభ్యుడిగా ఎన్నికయ్యారు. ఆ జిల్లాలో అనేక ప్రజా ఉద్యమాల్ని నిర్మించడంలో డీవీసీఎంగా, ఎస్.జెడ్.సీ.ఎంగా ముఖ్యమైన పాత్ర పోషించారు. ఆ జిల్లాలో జరిగిన అనేక గెరిల్లాయుద్ధ చర్యల్లో పాల్గొన్నారు.



**కామ్రేడ్ జగన్ (కాకూరి పండన్న) :** ఏఓబీ స్పెషల్ జోనల్ కమిటీ సభ్యుడు. ఆయన వయసు 57 సంవత్సరాలు. ఆయన మే నెల 7 నాడు అల్లూరి సీతారామరాజు జిల్లా, వైరామవరం మండలంలోని దుమ్ముకొండ అటవీ ప్రాంతంలో జరిగిన శతృదాడిలో అమరుడయ్యారు. 1986 సంవత్సరంలో ఆయన విప్లవోద్యమంలోకి పూర్తికాలం కార్యకర్తగా వచ్చారు. మొదట ఆయన తూర్పుగోదావరి-విశాఖపట్నం డివిజన్ లో పనిచేసారు. 1987లో దండకారణ్య ఫారెస్ట్ కమిటీ ఏర్పడి అది ఉద్యమ సమన్వయం కోసం సమన్వయ దళాన్ని ఏర్పాటు చేసింది. కామ్రేడ్ జగన్ 1990లో అందులో సభ్యుడయ్యారు. కొంతకాలం అందులో పనిచేసిన తర్వాత ఆయనను పార్టీ తిరిగి ఏఓబీ ప్రాంతానికి పంపింది. అక్కడ ఆయన ఏసీఎంగా, డీవీసీఎంగా, ఎస్.జెడ్.సీ.ఎంగా అభివృద్ధి అయ్యారు.






**కామ్రేడ్ అరుణ (చైతన్య)** : ఏఓబీ ఎస్.జెడ్.సీ. సభ్యురాలు. ఆమె వయసు 45 సంవత్సరాలు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అల్లూరి సీతారామరాజు జిల్లాలో జూన్ 18న జరిగిన శత్రుదాడిలో ఆమె అమరురాలైంది. 1999లో ఆమె విప్లవోద్యమంలోకి పూర్తికాలం కార్యకర్తగా వచ్చారు. మొదట్లో కొంతకాలం దళాల్లో పనిచేసారు. ఆ తర్వాత 2003 నుండి 2006 వరకు ఆ జోన్ విద్యా విభాగంలో పనిచేసారు. తదనంతరం తూర్పుగోదావరి-విశాఖపట్నం డివిజన్ లో పనిచేస్తూ దళ కమాండర్ గా, డీవీసీఎంగా ఎదిగారు. ఆ తర్వాత శ్రీకాకుళం-కొరాపుట్ డివిజన్ లో పనిచేస్తూ నారాయణపట్నా భూ పోరాటానికి నాయకత్వాన్ని అందించే టీములో భాగస్వామిగా పనిచేసారు. ఆమెను పార్టీ మళ్లీ తూర్పుగోదావరి-విశాఖపట్నం డివిజన్ కు బదిలీ చేసింది. ఈ క్రమంలో 2013లో ఎస్.జెడ్.సీ.ఎంగా ప్రమోట్ అయ్యారు. కొరాపుట్ రెయిడ్, 2018లో ఆంధ్రప్రదేశ్ ఎంఎల్ఏ, మాజీ ఎంఎల్ఏల కాన్వాయ్ పై చేసిన ఆంబుష్ సహ అనేక ఆంబుష్, రెయిడ్లలో ఆమె పాల్గొన్నారు.

**కామ్రేడ్ జయ :** బిహార్-ఝార్ఖండ్ స్పెషల్ ఏరియా కమిటి సభ్యురాలు. ఆమె వయసు 50 సంవత్సరాలు. 1990ల ప్రారంభంలో ఆమె విప్లవోద్యమంలోకి పూర్తికాలం కార్యకర్తగా వచ్చారు. మొదట గిరిడి జిల్లాలో ఆమె పనిచేసారు. తదనంతరం ఉద్యమావసరాల రీత్యా బిహార్-ఝార్ఖండ్ స్పెషల్ ఏరియాలోని అనేక జోన్లలో (జిల్లాల్లో) పనిచేసారు. ప్రత్యేకించి మహిళా ఉద్యమాన్ని నిర్మించి, అభివృద్ధి చేయడానికి విశేష కృషి చేసారు. సీపీఐ (మావోయిస్టు) ఏర్పడిన వెంటనే దేశవ్యాప్త మహిళా ఉద్యమ సమన్వయానికి మన కేంద్రకమిటీ మహిళా సబ్ కమిటీని ఏర్పాటు చేసింది. అందులో కామ్రేడ్ జయ బిహార్-ఝార్ఖండ్ స్పెషల్ ఏరియా తరపున సభ్యురాలిగా ఉన్నారు. 2024 జూలైలో ఆమె క్యాన్సర్ ట్రీట్మెంట్ కోసం ధన్ బాద్ వెళ్లినపుడు పోలీసులు ఆమెను అరెస్టు చేసి జైల్లో పెట్టారు. అయితే ఆమెకు సరైన వైద్య చికిత్స అందకుండా చేసి రాజ్యం ఆమెను హత్యచేసింది. ఆమె 2024 అక్టోబర్ లో అమరురాలైంది.

అమరులైన కేంద్రకమిటీ, రాష్ట్రకమిటీ సభ్యులు 2½ దశాబ్దాల నుండి 5 దశాబ్దాల పాటు విప్లవోద్యమ నిర్మాణ, పురోగమన కృషిలో పాల్గొన్నారు. అమరులు ఒక్కొక్కరు వైవిధ్యభరితమైన పనులు చేసారు, ఆయా రంగాల్లో ప్రత్యేకీకరణ (స్పెషలైజేషన్) చేసారు. వాళ్ల ఆచరణ నుండి ఎన్నో విషయాలను మనం ఆదర్శాలుగా స్వీకరించాల్సింది ఉంది. అయితే వారందరిలోని ఉమ్మడి ఆదర్శాల గురించి సంక్షిప్తంగా చెప్పుకుందాం. 1. అమరులు దశాబ్దాల తరబడి మార్క్సిజం-లెనినిజం-మావోయిజం (మాలెమా) సిద్ధాంతాన్ని, మన మౌలిక పంథాను దృఢంగా విశ్వసించి, ఆచరించారు. ఆచరణ క్రమంలో తలెత్తిన సమస్యల పరిష్కారానికి తిరిగి సైద్ధాంతిక, రాజకీయ, నిర్మాణ, సైనిక కృషి చేసారు. ఆచరణ-అధ్యయనం-అన్వయింపు అనే నిరంతర క్రమం ద్వారా మన పంథాను, పాలసీలను సుసంపన్నం చేసారు. 2. తమ తమ కాలాల్లో పార్టీలో ముందుకు వచ్చిన అతివాద, మితవాద పంథాలను ఓడించారు. 3. 1985 నుండి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొనసాగిస్తూ వస్తున్న అనేక వ్యూహాత్మక దాడి పథకాలను ధైర్యంగా ప్రతిఘటించారు, ఓడించారు, విఫలం చేసారు. 4. విప్లవోద్యమంలో తలెత్తే ఎగుడు-దిగుళ్లలో, మలుపు-మెలికల్లో, పురోగమన-తిరోగమనాల్లో దృఢంగా నిలిచారు. ఎగుడు, మలుపు, పురోగమనాల్లో పొంగిపోలేదు, దిగుడు, మెలిక, తిరోగమనాల్లో కుంగిపోలేదు. విప్లవోద్యమం గడ్డుస్థితిని, తాత్కాలిక వెనకంజను అధిగమించడానికి సైద్ధాంతిక, రాజకీయ, నిర్మాణ, సైనిక కృషి చేసారు. 5. పార్టీ, ప్రజాసైన్యం, ఐక్యసంఘటనల బలోపేతానికి అహర్నిశలు కృషి చేసారు. 6. పోరాట ప్రాంతాన్ని యుద్ధ రంగాన్ని వదిలి పారిపోలేదు. ప్రజలను, పార్టీ శ్రేణులను, పీ.ఎల్.జీ.ఏ బలగాలను అంటిపెట్టుకుని దృఢంగా నిలబడ్డారు. 7. సీదా సాదా జీవనశైలిని, కమ్యూనిస్టు ఆదర్శాలను/జీవన విలువలను ఆచరించారు.

గడిచిన సంవత్సర కాలంలో ప్రజాస్వామిక విప్లవ ప్రజా ఉద్యమ నాయకుడు కామ్రేడ్ సాయిబాబా సహ మరికొంతమంది ప్రజాసంఘాల నాయకులు, కొంతమంది విప్లవోద్యమ సానుభూతిపరులు అమరులయ్యారు.

నక్సల్బరీ, శ్రీకాకుళ పోరాటాల అనంతర కాలంలో ఒక సంవత్సరంలో శత్రుదాడిలో 4గురు కేంద్రకమిటీ సభ్యులు, 16 మంది రాష్ట్రకమిటీ సభ్యులు అమరులు కావడం ఇదే మొదటిసారి. ఈ నష్టాలు భారత విప్లవోద్యమాన్ని సాపేక్షికంగా దీర్ఘకాలం పాటు నకారాత్మకంగా ప్రభావితం చేస్తాయి.

కగార్ యుద్ధ ప్రారంభం నుండి, ముఖ్యంగా గత సంవత్సరం దండకారణ్యంలోని ఉత్తర బస్తర్ డివిజన్ లోని ఏప్రిల్ లో కల్పర్ ఘటన జరిగినప్పటి నుండి కేంద్ర, రాష్ట్ర సాయుధ బలగాలు సగటున 15-20 రోజులకు ఒక పెద్ద దాడి చేస్తున్నాయి. ఈ చుట్టివేత దాడుల్లో 10-15-20-25-30-35 మంది చొప్పున పార్టీ, పీ.ఎల్.జీ.ఏ., స్థానిక నిర్మాణాల కామ్రేడ్స్, ప్రజలు అమరులవుతున్నారు. ఇందులో 16-17 ఏళ్ల వయసున్న నవయువకుల నుండి 96 ఏళ్ల వయసున్న వృద్ధతరం కామ్రేడ్స్ వరకు ఉన్నారు. సాధారణ సభ్యుల

నుండి అత్యున్నత స్థాయి నాయకత్వ కామ్రేడ్స్ వరకు ఉన్నారు. ఈ దాడుల్లో మన స్వీయాత్మక శక్తులు నష్టపోవడం నకారాత్మక అంశమే అయినప్పటికీ ఈ దాడులన్నింటిలో మన పార్టీ, పీ.ఎల్.జీ.ఏ. నాయకులు/కమాండర్లు, బలగాలు అసమాన ధైర్యసాహసాలతో శత్రు సాయుధ బలగాలను ప్రతిఘటిస్తున్నాయి. దాదాపు అన్ని ఘటనల్లో మన బలగాల ప్రతిఘటనలో శత్రు వైపు ఇద్దరు నుండి 10-12 మంది వరకు పోలీసులు నిర్మూలించబడి, 3-20 మంది పోలీసులు గాయపడుతున్నారు. అన్ని ఘటనల్లో మన బలగాలు 1-2 రోజులు శత్రు వలయాల్ని ఛేధించడానికి వీరోచిత ప్రతిఘటన చేస్తూ, శత్రు వలయాల్ని గండికొడ్తున్నాయి. వేలాదిమంది 20 కి.మీ.ల పరిధి వరకు అనేక వలయాలతో మోహరింపులు చేసి చుట్టివేత-వెతకడం-చంపడం (కార్డన్-సర్చ్-కిల్) అనే సైనిక ఆపరేషన్లు సాగిస్తున్నప్పటికీ వాటిని ప్రతిఘటిస్తూ అన్ని ఘటనల్లో కొంతమంది బయట పడ్తున్నారు. ఈ కాలమంతా శత్రు చుట్టివేత, దానికి ప్రతిగా (కౌంటర్ గా) మన బలగాలు వాటిని ప్రతిఘటించడం, గండికొట్టడం రూపంలో మన ఆత్మరక్షణా యుద్ధం సాగుతూ ఉంది. ఇందులో మన బలగాల టీమ్ స్పిరిట్ (సమిష్టి భావన), కమాండింగ్, అసమాన ధైర్యసాహసాలతో శత్రువును నేలకూల్చడం, గండికొట్టడంలో నూతన పద్ధతులు/విన్యాసాలు, టెక్నిక్కులు, గంటల తరబడి, రోజుల తరబడి ఆకలి దప్పులను తట్టుకుని శత్రువుతో తలపడడం, దీర్ఘ ప్రయాణాలు చేయడం లాంటి ఎన్నో అనుభవాలు, ఆదర్శాలు ముందుకు వచ్చాయి. ఈ అనుభవాలను, ఆదర్శాలను సంశ్లేషణ చేసుకుని అభివృద్ధి చేసుకుని వాటిని మనపార్టీ, పీ.ఎల్.జీ.ఏ. యూనిట్లు అన్ని తమ సగటు ఆచరణగా మలుచుకోవాల్సిన అవసరం ఉంది. ఈ ప్రక్రియ ద్వారా మన బలగాల ఆత్మవిశ్వాసాన్ని పెంచుకోవడానికి, మన నష్టాలను తగ్గించుకోవడానికి, శత్రు ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీయడానికి శత్రు నష్టాల్ని పెంచడానికి కృషి చేయాలి.

'కగార్' యుద్ధ ప్రతిఘటనలో మన పార్టీ, పీ.ఎల్.జీ.ఏ. బలగాలు తమ అమూల్యమైన ప్రాణాల్ని తృణప్రాయంగా అర్పించి మహోన్నత ఆదర్శాలను నెలకొల్పుతున్నాయి. మన బలగాలు శత్రు చుట్టివేతలో చిక్కుకున్నపుడు ప్రతిఘటనే, ప్రాణత్యాగమే మా మార్గం అంటూ శత్రుసాయుధ బలగాల్ని ప్రతిఘటిస్తున్నాయి కానీ లొంగిపోవడం లేదు. ఈ మహోన్నత ఆదర్శమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను, శత్రు సాయుధ బలగాలను ఆందోళనకు గురిచేస్తున్నాయి. అందుకే శత్రువు మన బలగాల ప్రతిఘటనలో తమవైపు జరుగుతున్న నష్టాలను ప్రకటించడం లేదు లేదా కొన్నిసార్లు పాక్షికంగా ప్రకటిస్తున్నాడు. అందుకే, ఒక పార్టీ కార్యకర్త/ప్రజా గెరిల్లా వెనక శత్రువు 30 నుండి 100 మంది సాయుధ బలగాల్ని మోహరిస్తున్నాడు. ఇది శత్రు సాయుధ బలగాల బలహీన మోరల్ కు నిదర్శనం. మన బలగాల ఉన్నత మోరల్ కు పునాది మాలెమా సిద్ధాంతాన్ని, మన మౌలిక పంథాను దృఢంగా విశ్వసించడంలో ఉంది, ప్రజల కోసం ప్రాణాలర్పించాలనే చైతన్యంలో ఉంది. ఇది మన వ్యూహాత్మక బలం. ఈ బలమే తాత్కాలిక వెనకంజను అధిగమించడానికి పునాదిగా ఉంటుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యమ ప్రాంతాల్లో లక్షలాది సాయుధ బలగాల్ని మోహరించి, వాటికి ఆధునిక ఆయుధాల్ని, ఆధునిక టెక్నాలజీని అందించినా అవి మన బలగాల సంఖ్యకు సమాన సంఖ్యలో వచ్చి దాడి చేయడానికి సాహసించక పోవడానికి కారణం ఆ బలగాలు కిరాయి బలగాలు కావడమే. ఇది శత్రు బలగాల వ్యూహాత్మక బలహీనత. ఈ బలహీనతే అంతిమంగా శత్రు ఓటమికి దారితీస్తుంది.

**విప్లవ ప్రతిఘాతక 'కగార్' యుద్ధాన్ని విఫలం చేద్దాం, పార్టీని, పీ.ఎల్.జీ.ఏ.ను, ఐక్యసంఘటనను, విప్లవోద్యమాన్ని కాపాడుకుందాం.**

కగార్ యుద్ధ ప్రారంభం నుండి మనపార్టీ, పీ.ఎల్.జీ.ఏ. బలగాలు, ప్రజానిర్మాణ బలగాలు నష్టపోవడానికి కారణం, మన బలగాలు రహస్య పనివిధానాన్ని, గెరిల్లాయుద్ధ నియమాలను, కేంద్రకమిటీ రూపొందించిన ఎత్తుగడలను సరిగా అమలు చేయకపోవడంలో ఉంది. **గెరిల్లాయుద్ధం వెసులుబాటుతో కూడినది. అది 'గాలిలాగా వీచే', 'నీరులా ప్రవహించే' ఎత్తుగడల ప్రకారం సాగుతోంది. గాలిలాగా వీచడం అంటే ఒకచోట స్థిరంగా ఉండకుండా నిరంతరం కదలికలో ఉండడం అని అర్థం, నీరులా ప్రవహించడం అంటే తన మార్గానికి అడ్డుగా నిలిచే కొండలను అధిరోహించకుండా వాటి పక్కల నుండి, వాలు ప్రాంతానికి ప్రవహించే నీరులాగా తన శక్తికి మించిన శత్రువుతో నిర్ణయాత్మక యుద్ధాలకు తలపడకుండా తనశక్తిని కాపాడుకునే ఎత్తుగడలను ఆచరిస్తూ యుద్ధం చేయడమని అర్థం.** అందుకే, వెసులుబాటుతో కూడిన గెరిల్లా యుద్ధ ఎత్తుగడల ప్రకారం మన బలగాలు పనిచేయాలి. మన కేంద్రకమిటీ, పొలిట్ బ్యూరోలు 2024 ఫిబ్రవరి, ఆగస్టుల్లో విడుదల చేసిన సర్క్యులర్లలోని ఎత్తుగడల ప్రకారం నేటి స్థితిలో మన బలగాలు చిన్న ప్రాంతాలకు పరిమితం కాకుండా, విశాల ప్రాంతాల్లో పనిచేయాలి; వికేంద్రీకృత బలగాలుగా ఉండాలి. చట్టబద్ధ-చట్టవ్యతిరేక; బహిరంగ-రహస్య పోరాట, నిర్మాణ రూపాల్ని సమన్వయించి వర్గపోరాటాన్ని నడపాలి. పట్టణ, మైదాన, అటవీ ప్రాంతాల్లో నాలుగు వర్గాల ప్రజలను విప్లవోద్యమంలో సమీకరించాలి. ఇలాంటి మరిన్ని రాజకీయ, సైనిక ఎత్తుగడల్ని మన కేంద్రకమిటీ రూపొందించింది. ఆ ఎత్తుగడల్ని మనం సరిగా ఆచరించని ఫలితంగా తీవ్రంగా నష్టాల పాలవుతున్నాం. ఈ నష్టాలను సమీక్షించుకుని, కేంద్రకమిటీ రూపొందించిన సరైన రాజకీయ, సైనిక ఎత్తుగడలతో వర్గపోరాటాన్ని, గెరిల్లాయుద్ధాన్ని కొనసాగిద్దాం. తద్వారా నష్టాలను తగ్గించుకుందాం.

కేంద్రకమిటీ/పీబీ రూపొందించిన ఎత్తుగడలను ఆచరించి పార్టీని, పీ.ఎల్.జీ.ఏ.ను, ఐక్యసంఘటనను, విప్లవోద్యమాన్ని కాపాడుకోవడం ద్వారా మార్చి 31, 2026కు ముందే విప్లవోద్యమాన్ని నిర్మూలించాలనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దుష్ట పథకాన్ని విఫలం చేద్దాం.

ఈ సంవత్సర కాలంలో కగార్ యుద్ధ తీవ్రతతో మనపార్టీ, పీ.ఎల్.జీ.ఏ. బలగాలు, ప్రజా నిర్మాణాలు నష్టపోవడం కొనసాగుతున్నప్పటికీ దేశవ్యాప్తంగా ఉద్యమ ప్రాంతాలంతటా తరతమ తేడాలతో వర్గపోరాటం, గెరిల్లాయూనిట్లు ఉన్నచోట గెరిల్లాయుద్ధం కొనసాగుతోంది. గెరిల్లాయూనిట్లు ఉన్నచోట అవి కొన్ని చోట్ల పరిమితంగా మరికొన్ని చోట్ల సాపేక్షికంగా భారీ ఎత్తున బూబీట్రాపుల్ని/ఐఈడీల్ని అమర్చి మైన్ ఫీల్డ్ ల్ని ఏర్పాటు చేసి శత్రు సాయుధ బలగాల్ని నష్టపరుస్తున్నాయి. కొన్నిచోట్ల చిన్న, వికేంద్రీకృత చర్యల ద్వారా శత్రు సాయుధ బలగాలపై ఆంబుష్ లు చేస్తున్నాయి. బూబీట్రాప్ లు/ ఐఈడీల యుద్ధతంత్రంతో పాటు శత్రు వలయాల్ని గండి కొట్టడం ద్వారా ఈ సంవత్సర కాలంలో పీ.ఎల్.జీ.ఏ. బలగాలు దాదాపు 75 మంది శత్రు సాయుధ బలగాలను నిర్మూలించి, 130 మందిని గాయపరిచాయి, కొన్ని ఆయుధాలను స్వాధీనం చేసుకున్నాయి.

2024 ఆగస్టు పీబీ సర్క్యులర్ అందినచోట దాని అధ్యయనం, చర్చలు, క్లాసులు కొనసాగుతున్నాయి. పీబీ సర్క్యులర్ లోని ఎత్తుగడలను తమ తమ ఏరియా, జిల్లా, రాష్ట్రాల ఉద్యమ పరిస్థితులకు అన్వయించుకుని పనిచేయడం ప్రారంభించారు.

ఉద్యమ బలాబలాల ఆధారంగా ప్రజల దైనందిన, మౌలిక సమస్యలపై ప్రచారం, ఆందోళన, నిర్దిష్ట చర్యకు (యాక్షన్) పూనుకోవడం లాంటి రూపాల్లో చట్టబద్ధ-చట్టవ్యతిరేక; బహిరంగ-రహస్య పోరాట, నిర్మాణ రూపాలను ఉపయోగించి వర్గపోరాటం కొనసాగుతోంది.

కగార్ యుద్ధాన్ని ఆపివేయాలని, కర్రెగుట్ట ఆపరేషన్ ను ఆపాలని మావోయిస్టులతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు శాంతి చర్చలు జరపాలని, దేశంలో 9-10 రాష్ట్రాల్లో పౌరసమాజం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తెస్తూ ప్రచార, ఆందోళన కార్యక్రమాల్ని నడపడం, ఉభయ తెలుగు రాష్ట్రాల్లో అది ఉద్యమ రూపం తీసుకోవడం ఈ మధ్యకాలపు సకారాత్మక పరిణామం.

పైన పేర్కొన్న రాజకీయ, నిర్మాణ, సైనిక కృషి విప్లవోద్యమాన్ని కాపాడుకోవడానికి, కగార్ యుద్ధాన్ని విఫలం చేయడానికి ఎంతగానో తోడ్పడుతుంది. నిజానికి ఈ భూమ్మీద, ఈ దేశంలో వర్గాలున్నంతకాలం బ్రాహ్మణీయ హిందుత్వ ఫాసిస్టు బీజేపీ కేంద్ర ప్రభుత్వమైన, కగార్ యుద్ధమైన, మరే దోపిడీ ప్రభుత్వమైన, మరో పేరుతో విప్లవ ప్రతిఘాతక యుద్ధాన్ని సాగించినా అవి విప్లవ సిద్ధాంతాన్ని, విప్లవోద్యమాన్ని నిర్మూలించలేవు. ఇది తిరుగులేని చారిత్రక సత్యం. ఎందుకంటే వర్గాలున్నంత కాలం దోపిడీ వర్గాలు, ప్రజలపై అంతులేని దోపిడీ, పీడనలను కొనసాగిస్తాయి. ఆ దోపిడీకి గురయ్యే పీడిత వర్గాలు, పీడిత సాంఘిక సముదాయాలు, పీడిత జాతులు దోపిడీ వర్గాలకు వ్యతిరేకంగా నిరాయుధంగాను, సాయుధంగాను, శాంతియుతంగాను, హింసాయుతంగాను, చట్టబద్ధంగాను, చట్టవ్యతిరేకంగాను, బహిరంగగాను, రహస్యంగాను పోరాడుతూనే వుంటాయి. ఈ పోరాటాల నుండే విప్లవ పార్టీలు పుడతాయి, బలపడతాయి. అందుకే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మార్చి 31, 2026 వరకు భారత విప్లవోద్యమాన్ని నిర్మూలించలేవని చెపుతాం.

**మావోయిస్టు ప్రజాయుద్ధ సిద్ధాంతం, దీర్ఘకాలిక ప్రజాయుద్ధ పంథా ప్రకారం పీడిత ప్రజల తరపున పోరాడే విప్లవ పార్టీ, ప్రజాసైన్యం వర్గపోరాటాల నుండే పుడుతుంది, వర్గపోరాటాల తీవ్రతే ప్రజాయుద్ధానికి దారితీస్తుంది. ఈ క్రమంలో చిన్న శక్తిగా వుండే విప్లవ పార్టీ, ప్రజాసైన్యాలు పెద్దశక్తిగా ఎదుగుతాయి, బలహీనమైనవి బలమైన శక్తిగా మారుతాయి. ఓటమి పాలైన తిరిగి గెలుస్తాయి.** ఒంటరి ప్రాంతాల పోరాటం-ప్రజాయుద్ధం విశాల ప్రాంతాలకు విస్తరిస్తుంది. చిన్న ప్రాంతాల నుండి పెద్ద ప్రాంతాలకు వ్యాపిస్తుంది. కుదించుకుపోయినా తిరిగి విస్తరిస్తుంది. గ్రామీణ ప్రాంతాల నుండి పట్టణాలను చుట్టుముడుతుంది. గెలుపు-ఓటమి-గెలుపు-ఓటమి అంతిమంగా గెలుపు క్రమం గుండా విప్లవం విజయవంతమవుతుంది. నేటి తాత్కాలిక వెనకంజ స్థితిలో మావోయిస్టు ప్రజాయుద్ధ సిద్ధాంతాన్ని, దీర్ఘకాలిక ప్రజాయుద్ధ పంథాను అర్థం చేసుకోవడమంటే వాటిలోని గతితర్కాన్ని అర్థం చేసుకోవడమే. అంటే తాత్కాలిక వెనకంజను, నష్టాలను చూసి అవిశ్వాసానికి గురికావద్దు. వాటిలోని గతితర్కాన్ని అర్థం చేసుకోవడం అంటే మావోయిస్టు ప్రజాయుద్ధ ఎత్తుగడలను సరిగా ఆచరిస్తే తాత్కాలిక వెనకంజ స్థితి నుండి విప్లవోద్యమం పురోగమిస్తుందని, నష్టాలు తగ్గి, తిరిగి స్వీయాత్మక శక్తులు పార్టీ, పీ.ఎల్.జీ.ఏ., ఐక్యసంఘటనలు బలపడతాయని విశ్వసించడం, అందుకోసం సరైన రాజకీయ, మిలిటరీ ఎత్తుగడలతో వర్గపోరాటాన్ని, ప్రజాయుద్ధాన్ని నడపడం. ఈ విషయాన్ని మనపార్టీ, పీ.ఎల్.జీ.ఏ. బలగాల్లో, ప్రజానిర్మాణాల్లో, విప్లవ శిబిరంలో ప్రచారం చేసి మన బలగాలకు, విప్లవ శిబిరానికి విశ్వాసం కల్పించి సరెండర్లను, ద్రోహాలను నివారించాలి.

విప్లవోద్యమాన్ని కాపాడుకోవడానికి, కగార్ యుద్ధాన్ని విఫలం చేయడానికి అంతర్జాతీయంగా, దేశీయంగా విప్లవానికి అనుకూలంగా పెంపొందుతున్న వస్తుగత పరిస్థితిని సద్వినియోగం చేసుకుందాం. అందుకోసం అంతర్జాతీయ, దేశీయ పరిస్థితి గురించి సంక్షిప్తంగా చెప్పుకుందాం.

2008 నాటి ప్రపంచ ఆర్థిక సంక్షోభాన్ని ప్రపంచం ఇప్పటికీ అధిగమించలేదు. దాని పరిష్కారానికి పెట్టుబడి-సామ్రాజ్యవాద దేశాలు, వెనకబడిన దేశాలు అనుసరించిన ఆర్థిక, రాజకీయ, సైనిక, సాంకేతిక విధానాలన్నీ ఘోరంగా విఫలమయ్యాయి. అందుకే అవి ఫాసిజాన్ని, యుద్ధాలను ఆశ్రయిస్తున్నాయి. ప్రస్తుతం అమెరికా 38 ట్రిలియన్ డాలర్ల అప్పులతో ప్రపంచంలోనే అతిపెద్ద రుణగ్రస్థ దేశంగా మారిపోయింది. దాని ఆర్థిక వృద్ధి మందగించింది. ఈ స్థితిలో రెండవసారి అధికారంలోకి వచ్చిన ట్రంప్ అమెరికాను ఆర్థిక సంక్షోభం నుండి బయటపడేయడానికి, కోల్పోయిన తన అగ్రరాజ్య హోదాను తిరిగి నిలబెట్టుకోవడానికి అనుసరిస్తున్న విధానాలన్ని

వికటిస్తున్నాయి. ఆయన ప్రపంచ దేశాలపై విధిస్తున్న సుంకాలతో (టారిఫ్ లతో) ప్రపంచ ఆర్థిక వ్యవస్థ మరింత సంక్షోభం పాలుకానుంది. అమెరికా-చైనాలు రెండూ తాత్కాలికంగా పరస్పరం సుంకాల తగ్గింపు ఒప్పందం చేసుకున్నప్పటికీ అది తాత్కాలికమే. తిరిగి వాటిమధ్య సుంకాల యుద్ధం చెలరేగే అవకాశాలున్నాయి. ట్రంప్ వలసవాద ఆధిపత్య ధోరణిని ప్రదర్శిస్తూ కెనడా, గ్రీన్ ల్యాండ్, పనామా, గాజాలను ఆక్రమించుకుంటామని బహిరంగ ప్రకటనలు చేసాడు. ఈ వలసవాద ఆధిపత్య ధోరణిని వెన్నంటి ఇజ్రాయిల్ ద్వారా గాజానే కాకుండా మొత్తం పాలస్తీనాపై దురాక్రమణ యుద్ధాన్ని తీవ్రంగా కొనసాగింప చేస్తున్నాడు. ఇజ్రాయిల్ ను ముందుంచి ఇరాన్ పై యుద్ధాన్ని కొనసాగిస్తున్నాడు. తాజాగా జూన్ 22 నాడు స్వయంగా అమెరికాయే ఇరాన్ లోని మూడు చోట్ల అణు కేంద్రాలపై బాంబులను కురిపించి పశ్చిమాసాయాలో యుద్ధాన్ని తీవ్రతరం చేసింది. ఇజ్రాయిల్ తో కలిసి ఇరాన్, పాలస్తీనాలపై అమెరికా చేస్తున్న దురాక్రమణ యుద్ధం పశ్చిమాసియా ప్రాంతీయ యుద్ధంగా మారనుంది.

సామ్రాజ్యవాదమంటేనే యుద్ధమని లెనిన్ చేసిన నిర్ధారణ ప్రకారం సామ్రాజ్యవాదం ఉనికిలోకి వచ్చినప్పటి నుండి రెండు ప్రపంచయుద్ధాలు, అనేక ప్రాంతీయ యుద్ధాలు, వందలాది స్థానిక యుద్ధాలు జరిగాయి. గత 3 సంవత్సరాలుగా రష్యా-ఉక్రెయిన్ యుద్ధం కొనసాగుతోంది, గత సంవత్సరంన్నర కాలంగా ఇజ్రాయిల్-పాలస్తీనా యుద్ధం కొనసాగుతోంది. అమెరికా-చైనాల మధ్య తైవాన్ సమస్యపై ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి.

అమెరికా సామ్రాజ్యవాదం, ఇతర సామ్రాజ్యవాద దేశాలు తామే ఏర్పాటు చేసిన ఐక్యరాజ్యసమితి, ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యూటీఓ)ల నియమాలకు తామే (అమెరికా సామ్రాజ్యవాదులు, ఇతర సామ్రాజ్యవాద దేశాలు) ఉల్లంఘిస్తున్నాయి. ఆర్థిక సంక్షోభం నుండి గట్టెక్కడానికి పెట్టుబడిదారీ, సామ్రాజ్యవాద దేశాలు, వెనకబడిన దేశాల్లోని ప్రాంతీయ విస్తరణవాద దేశాలు అన్ని ప్రతి సంవత్సరం రక్షణ బడ్జెట్లను పెంచుతున్నాయి. ప్రాకృతిక వనరుల కోసం, శ్రమశక్తిని చౌకగా కొల్లగొట్టడం కోసం, మార్కెట్ల కోసం సామ్రాజ్యవాద దేశాల మధ్య పోటీ రోజురోజుకు తీవ్రతరమవుతోంది. ప్రస్తుతం ఒకవైపు అమెరికా, మరోవైపు చైనా, రష్యాల మధ్య ఈ పోటీ తీవ్రంగా కొనసాగుతోంది. అమెరికా తన ఆర్థిక సంక్షోభం రీత్యా నాటోకు గతం లాగా నిధులు కేటాయించలేనని, తమ రక్షణ తామే చూసుకోవాలని పశ్చిమ యూరప్ దేశాలకు తెగేసి చెప్పడంతో ఆ దేశాలు తమ రక్షణ బడ్జెట్లను పెంచుతున్నాయి. ఈ స్థితిలో ప్రపంచంలో గత దశాబ్ద కాలంగా కొనసాగుతున్న బహుధృవ ప్రపంచ వ్యవస్థ రోజురోజుకు మరింత అస్థిరతవైపు, అల్లకల్లోలం వైపు, గందరగోళం వైపు నెట్టబడుతోంది. ఇవన్నీ ప్రపంచ ఆర్థిక, రాజకీయ, సామాజిక పరిస్థితులను, అందులో భాగంగా మనదేశాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయి. వీటిని వెన్నంటి మనదేశంలో ప్రముఖ వైరుధ్యాలు తీవ్రతరమవుతున్నాయి.

బ్రాహ్మణీయ హిందుత్వ ఫాసిస్టు ఆర్ఎస్ఎస్-బీజేపీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 2047 నాటికి దేశాన్ని అభివృద్ధి చెందిన (వికసిత్) దేశంగా అభివృద్ధి చేస్తామనే ప్రచార హోరును తీవ్రంగా కొనసాగిస్తున్నాయి. ఈ సంవత్సరం భారతదేశం జపాన్ దేశాన్ని అధిగమించి 4వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అభివృద్ధి చెందిందని ప్రచారం చేస్తున్నాయి. నిజానికి జపాన్ ను అధిగమించాలంటే మరికొన్ని నెలల సమయం పట్టనుంది. దేశ జనాభాలో 1 శాతం కోటీశ్వరుల వద్ద దేశ సంపదలో 40% సంపద కేంద్రీకృతమైంది. ఈ స్థితిలో ప్రస్తుతం 3.9 ట్రిలియన్ డాలర్ల (ఒక ట్రిలియన్ అంటే ఒక లక్ష కోట్లు) దేశ స్థూల దేశీయోత్పత్తిలో 1% సంపన్నుల వాటా 1.56 ట్రిలియన్ డాలర్లు అవుతుంది. మిగతా 99% దేశ ప్రజల చేతుల్లో 2.34 ట్రిలియన్ డాలర్ల సంపద వుంటుంది. దాన్ని 140 కోట్ల జనాభాతో భాగిస్తే తలసరి ఆదాయం 1670 డాలర్లు మాత్రమే అవుతుంది. ఒక డాలరు మారకపు విలువ ప్రస్తుతం 85 రూపాయలు అనుకుంటే దీనిప్రకారం తలసరి ఆదాయం 1,41,950 రూపాయలు మాత్రమే అవుతుంది. ఇది అభివృద్ధి చెందిన దేశాల తలసరి ఆదాయంతో పోలిస్తే చాలా చాలా తక్కువ. మరోవైపు దేశంలో 80 కోట్లమంది ప్రభుత్వ రేషన్ బియ్యంపై ఆధారపడి బతుకులీడ్చే దుస్థితి నెలకొంది. ఈ స్థితిలో దేశం నాలుగవ ఆర్థిక వ్యవస్థగా మారిన, రానున్న రోజుల్లో ఐదవ ఆర్థిక వ్యవస్థగా మారినా, పెరిగిన సంపదను లెక్కించుకుని అభివృద్ధి చెందిన దేశమని దేశ పాలకవర్గాలు ప్రకటించినా పేదల బతుకుల్లో మార్పేమీ ఉండదు. మరోవైపు పెరుగుతున్న ధరలతో, కోల్పోతున్న ఉద్యోగాలతో, ఉద్యోగాలు లేక/నిరుద్యోగులతో మధ్యతరగతి ప్రజల బతుకులు చితికి పోతున్నాయి. అమెరికా నుండి అక్రమ వలసదార్ల పేరుతో భారతీయులను తరిమేయడం, ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ కారణంగా ఉద్యోగవకాశాలు తగ్గిపోవడంతో మధ్యతరగతి సహ దేశ ప్రజల్లో సామాజిక అశాంతి పెరగనుంది. ఈ సామాజిక అశాంతిని పక్కతోవ పట్టించేందుకు బ్రాహ్మణీయ హిందుత్వ ఫాసిస్టు ఆర్ఎస్ఎస్-బీజేపీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల్లో మతపరమైన విభజనను సృష్టించి మతమైనారిటీల మీద ప్రత్యేకించి ముస్లింల మీద అన్నిరంగాల్లో దాడులు చేస్తోంది. అందులో భాగంగా ముస్లిం మత సంస్థల వద్దనున్న భూములను లాక్కొని కార్పొరేట్లకు కట్టబెట్టడానికి కేంద్రప్రభుత్వం వక్ఫ్ సవరణ చట్టాన్ని తీసుకొచ్చింది. బీజేపీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టణాల్లో పేదల, ముస్లింల ఇళ్లను, ఆస్తులను బుల్డోజర్లతో కూల్చివేస్తున్నాయి. వీటన్నింటికి వ్యతిరేకంగా ప్రజలు పోరాడకుండా బీజేపీ కేంద్రప్రభుత్వం కుట్రపూరితంగా పహల్గామ్ ఘటనను సృష్టించి, ఆ పేరుతో పాకిస్తాన్ పై దాడిచేసి ప్రజల్లో పాకిస్తాన్ వ్యతిరేక జాతీయోన్మాదాన్ని రెచ్చగొట్టింది. ఈ స్థితిలో బ్రాహ్మణీయ హిందుత్వ ఫాసిస్టుల కుట్రలను, కుతంత్రాలను బహిర్గతం చేస్తూ ప్రజలను తమ దైనందిన, మౌలిక సమస్యలపై పోరాడేలా సన్నద్ధం చేయాలి. దేశంలో ఆర్థిక, సామాజిక అంతరాలు ఎన్నడూ లేనంతగా పెరుగుతున్న స్థితిలో బ్రాహ్మణీయ హిందుత్వ ఫాసిస్టుల శక్తుల కుట్రలు, కుతంత్రాలు, ఫాసిస్టు అణచివేత చర్యలు ఎంతోకాలం

ప్రజలను అణచివేయలేవు. ఈ అణచివేతకు గురవుతున్న పీడిత వర్గాలు, పీడిత సాంఘిక సముదాయాలు, పీడిత జాతులు వీటిని ప్రతిఘటించి తీరుతాయి. ఆ ప్రతిఘటనను సంఘటిత శక్తిగా మలచడం కోసం కృషి చేద్దాం.

అమరుల ఆదర్శాలను ఎత్తిపట్టడం నేడు మన అందరి కర్తవ్యం. ప్రజా ప్రయోజనాల కోసం ప్రాణాన్ని త్యాగం చేసే సంసిద్ధతను కలిగి ఉండాలి. శత్రువు ప్రకటిస్తున్న లొంగుబాటు-పునరావాస పథకాలను తిరస్కరించాలి. శత్రువు చేస్తున్న మోసకారి మానసిక యుద్ధ ప్రభావానికి లోనుకాకూడదు. అమరుల ఆదర్శాలను దేశవ్యాప్తంగా పట్టణాల్లో, మైదానాల్లో, అటవీ ప్రాంతాల్లో ప్రజలందరిలో, విప్లవ శిబిరంలో విస్తృత ప్రచారం చేసి నూతన తరాన్ని, నవతరాన్ని విప్లవోద్యమంలో సమీకరించాలి. మనిషిని మనిషి దోచుకోవడానికి అవకాశాలు లేని సోషలిస్టు-కమ్యూనిస్టు సమాజ స్థాపన అమరుల ఆశయం. ఆ మహోన్నత ఆశయ సాధన కోసం భారతదేశంలో దోపిడీ వ్యవస్థను నిర్మూలించడం కోసం వర్గపోరాటంలో-ప్రజాయుద్ధంలో భాగస్వాములు కావాల్సిందిగా కార్మికులకు, రైతులకు, మధ్యతరగతికి, జాతీయ పెట్టుబడిదార్లకు, మహిళలకు, దళితులకు, ఆదివాసులకు, మతమైనారిటీలకు, పీడిత జాతులకు పిలుపునిస్తున్నాం.

## అమరుల సంస్మరణవారం కార్యక్రమం

1) దేశవ్యాప్తంగా మన పార్టీ యూనిట్లు, సానుభూతిపరులు వున్న గ్రామాల్లో, పట్టణాల్లో, నగరాల్లో, స్కూలు-కాలేజ్, యూనివర్సిటీల్లో, పారిశ్రామిక, సేవా రంగాల్లోని పని స్థలాలన్నింటిలో పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని విప్లవోద్యమంలో అమరుల త్యాగాలను రహస్యంగా లేదా బహిరంగంగా స్మరించుకుంటూ, వారి అమర త్యాగాన్ని ఎత్తిపడుతూ నివాళులర్పించాల్సిందిగా పార్టీ శ్రేణులకు, పీడిత ప్రజానీకానికి పిలుపునిస్తున్నాం.

2) ఈ సంవత్సరం అమరుల సంస్మరణ వారం కోసం కేంద్రకమిటీ విడుదల చేసిన ఈ సందేశాన్ని పార్టీ యూనిట్లు అన్ని చోట్ల ప్రజలకు అందించాలి. అమరుల సంస్మరణ సభలకు వీలునుబట్టి కుటుంబ సభ్యులను ఆహ్వానించాలి, వేదికపై కూర్చోబెట్టాలి, సభాముఖంగా వారిని ప్రజలకు పరిచయం చేయాలి, వారితో మాట్లాడించాలి.

3) అమరుల కుటుంబ సభ్యులకు సంతాప సందేశాన్ని, వారి జీవితచరిత్రలను, ఫోటోలను, వారి జ్ఞాపక చిహ్నాలను అందించాలి. వారి బాధలలో, దుఃఖంలో పాలుపంచుకుంటూ వివిధ రూపాలలో వారికి అవసరమైన మద్దతునందించాలి. అమరుల స్ఫూర్తితో వారిని విప్లవోద్యమం పక్షాన గట్టిగా నిలబెట్టుకోవాలి.

4) స్పెషల్ ఏరియా/స్పెషల్ జోన్/రాష్ట్రాల వారిగా, జోన్/డివిజన్/జిల్లాల వారిగా, ఏరియాల వారిగా అమరుల జీవితచరిత్రలను ప్రచురించాలి. అమరుల త్యాగాలను ఆదర్శాలను, వారి మంచి అలవాట్లను ఎత్తిపడుతూ కరపత్రాలు, పోస్టర్లు, బ్రోచర్లు, బ్యానర్లు విడుదల చేయడంతో పాటు వారిపై కవితలు, కథలు, నాటకాలు రచించి, ప్రచురించి విస్తృతంగా ప్రచారం చేయాలి. దీని కోసం ప్రింట్, ఎలక్ట్రానిక్, సోషల్ మీడియాను అవసరమైన జాగ్రత్తలతో ఉపయోగించుకోవాలి. అమరుల స్థూపాలను వీలైన అన్ని చోట్ల నిర్మించి ఆవిష్కరించాలి.

5) విప్లవ సాంస్కృతిక సంఘాల ద్వారా అమరుల జీవితచరిత్రలపై, త్యాగాలపై పాటలు, గ్రూప్ సాంగ్స్, గ్రూప్ డాన్స్, నాటికలు మొదలైన వివిధ కళారూపాలను తయారు చేసి ప్రత్యక్షంగా ప్రదర్శనలు ఇవ్వాలి. అలాగే డిజిటల్ మీడియా ద్వారా కూడా ప్రచారం చేయాలి. ఆయా ప్రాంతాల ప్రత్యేకతను దృష్టిలో పెట్టుకుని వివిధ పద్ధతుల్లో, రూపాల్లో పై కార్యక్రమాలను అమలు చేయాలి. గెరిల్లా ప్రాంతాల్లో గతంలో లాగా కాకుండా, ప్రత్యేక తరహాలో, మన బలగాల కదలికలు, కార్యకలాపాలు రహస్య పద్ధతుల్లో త్వరత్వరగా స్థలమార్పిడి చేస్తూ మారుతున్న పరిస్థితులను బట్టి కొనసాగించాలి. జీవించే హక్కును కాలరాచివేస్తూ ప్రజల్ని అత్యంత క్రూరంగా, అమానుషంగా చంపడానికి వ్యతిరేకంగా, మహిళల్ని అత్యాచారం చేసి చంపడానికి వ్యతిరేకంగా, శత్రువుపై వర్గ కసిని పెంచేలా, మన ప్రియమైన అమరుల అత్యున్నత త్యాగాల స్ఫూర్తితో శత్రు విప్లవ ప్రతిఘాతక 'కగార్' యుద్ధాన్ని విఫలం చేయడానికి తోడ్పడేలా, ప్రజలను రాజకీయంగా చైతన్యవంతం చేస్తూ ప్రచారం-ఆందోళనలను చేపట్టే రాజకీయ క్యాంపెయిన్ లాగా అమరుల సంస్మరణ వారాన్ని నిర్వహించాలి.

# మన పార్టీ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ బసవరాజు (నంబాల కేశవరావు) అమరత్వం - మన కర్తవ్యం

**డియర్ కామ్రేడ్స్,**

మే 21 భారత విప్లవోద్యమ చరిత్రలో చీకటిరోజు. ఆరోజు బ్రాహ్మణీయ హిందుత్వ ఫాసిస్టు ఆర్ఎస్ఎస్-బీజేపీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దండకారణ్యంలోని మాడ్ డివిజన్ లోని గుండెకోట్ పరిసరాల్లో నిర్వహించిన ఎన్ సర్కిల్ మెంట్ (చుట్టివేత) దాడిలో మన పార్టీ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ బసవరాజు (బీఆర్)(నంబాల కేశవరావు) సహా 28 మంది కామ్రేడ్స్ అమరులయ్యారు. అమరుల్లో రాష్ట్రకమిటీ స్థాయి సభ్యుడు, సీసీ/సీఎంసీ స్టాఫ్, అవామీ జంగ్ పత్రిక సంపాదకమండలి సభ్యుడు కామ్రేడ్ మధు, 7వ కంపెనీ పార్టీకమిటీ కార్యదర్శి/కంపెనీ కమాండర్ కామ్రేడ్ టిప్పు, ముగ్గురు డీవీసీ స్థాయి కామ్రేడ్స్, ముగ్గురు పీపీసీఎంలు, 19 మంది పార్టీ సభ్యులు అమరులయ్యారు. జూన్ 6, 7 తేదీల్లో దండకారణ్యంలోని నేషనల్ పార్క్ ఏరియాలో జరిగిన ఎన్ సర్కిల్ మెంట్ దాడిలో రాష్ట్రకమిటీ స్థాయి కామ్రేడ్ గౌతం, తెలంగాణ రాష్ట్రకమిటీ సభ్యుడు కామ్రేడ్ భాస్కర్ అమరులయ్యారు. ఈ ఘటనల్లో అమరులైన కామ్రేడ్స్ కందరికీ కేంద్రకమిటీ వినమ్రంగా తలవంచి విప్లవ జోహార్లు అర్పిస్తోంది, వారి ఆశయ సాధన కోసం తుదిశ్వాస వరకు దృఢంగా పోరాడుదామని శపథం చేద్దాం.


1972లో ఆనాటి మన పార్టీ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ చారుమజుందార్ ను పోలీసులు పట్టుకుని హత్య చేసిన తర్వాత, గడిచిన 53 ఏళ్ల తర్వాత పార్టీ ప్రధాన కార్యదర్శి శత్రుదాడిలో అమరుడు కావడం ఇదే మొదటిసారి. నిస్సందేహంగా, ఇది మన పార్టీకి, విప్లవోద్యమానికి భారీ నష్టమే, అతిపెద్ద నష్టమే. ఈ సందర్భంగా, భారత దోపిడీ పాలకవర్గాలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంబరపడడమే కాకుండా మావోయిస్టుల అణచివేతలో చారిత్రాత్మక విజయం సాధించామని, మావోయిస్టు పార్టీ వెన్ను విరిచామని మానసిక యుద్ధాన్ని కూడా కొనసాగిస్తున్నాయి. ఈ స్థితిలో ఈ నష్టాన్ని ఎలా అర్థం చేసుకోవాలి, ప్రస్తుతం మన కర్తవ్యం ఏమిటీ అనే విషయాలను పార్టీ, పీ.ఎల్.జీ.ఏ. సభ్యుల వరకు అర్థం చేయిస్తూ కేంద్రకమిటీ ఈ లెటర్ ను విడుదల చేస్తోంది. మొదట ఈ ఘటన జరగడానికి కారణమైన అంశాలను చూద్దాం.

**ఘటన జరగడానికి దారితీసిన కారణాలు :**

భారతదేశ విప్లవోద్యమాన్ని నిర్మూలించడంలో భాగంగా కేంద్రకమిటీ సభ్యులను, రాష్ట్రకమిటీల సభ్యులను నిర్మూలించడానికి శత్రువు అనేక దశాబ్దాలుగా ప్రయత్నాలు చేస్తున్నాడు. మధ్య-మధ్యలో కొంతమంది నాయకత్వ కామ్రేడ్స్ ను (సీసీ, రాష్ట్రకమిటీ సభ్యులను) శత్రువు హత్య చేయగలిగాడు. 2024 జనవరి నుండి మొదలై కొనసాగుతున్న విప్లవ ప్రతిఘాతక 'కగార్' యుద్ధం ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 2026, మార్చి 31 వరకు భారత విప్లవోద్యమాన్ని నిర్మూలించే దుష్ట పథకాన్ని రూపొందించుకున్నాయి. అందులో భాగంగా కేంద్ర, రాష్ట్ర కమిటీ సభ్యులను నిర్మూలించడానికి శత్రువు ప్రత్యేకంగా శ్రద్ధ పెట్టి సమాచార సేకరణ చేస్తూ దాడులు చేస్తున్నాడు. అందులో భాగంగా జనవరి 19 నాడు ఒడిశా రాష్ట్రంలోని సోనబేడ గుట్టల్లో జరిగిన ఎన్ సర్కిల్ మెంట్ దాడిలో కేంద్రకమిటీ సభ్యుడు, ఒడిశా రాష్ట్రకమిటీ కార్యదర్శి కామ్రేడ్ చలపతిని, ఏప్రిల్ 21 నాడు బొకారో జిల్లాలో జరిగిన ఎన్ సర్కిల్ మెంట్ దాడిలో కేంద్రకమిటీ సభ్యుడు కామ్రేడ్ వివేక్ ను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు హత్య చేసాయి. ఈ దాడుల కొనసాగింపులో భాగంగా మే 21 నాడు మన పార్టీ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ బసవరాజును హత్యచేసాయి. శత్రుదాడికి వెరచి ప్రాణభీతితో పారిపోయి శత్రువుకు సరెండరయి ద్రోహులుగా మారిన 7వ కంపెనీ పార్టీకమిటీ సభ్యుడు మోటు, మరో ఇద్దరు పీపీసీఎంలు కామ్రేడ్ బీఆర్ 7వ కంపెనీలో మాడ్ డివిజన్ లో జాట్లూర్ ప్రాంతంలో ఉంటున్న సమాచారాన్ని శతృవుకు అందించారు. ఆ సమాచారం ఆధారంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మాడ్ డివిజన్ జాట్లూర్ ప్రాంతంలో 17 నుండి 21 వరకు భారీ ఎన్ సర్కిల్ మెంట్ ఆపరేషన్ ను కొనసాగించాయి. ఈ ఆపరేషన్ లో కామ్రేడ్ బీఆర్ సహ 28 మంది 7వ కంపెనీ కామ్రేడ్స్ అమరులయ్యారు.

ఈ ఘటనను మనం విడి ఘటనగా సమీక్షించకూడదు. విప్లవ ప్రతిఘాతక 'కగార్' యుద్ధం ప్రారంభం నుండి జరుగుతున్న నష్టాల కొనసాగింపులో భాగంగానే సమీక్షించుకోవాలి. ఈ ఘటనకు దారితీసిన టెక్నికల్ పొరపాట్ల మేరకే పరిమితమయి ఈ ఘటనను విశ్లేషించకూడదు, కగార్ యుద్ధ ప్రారంభం నుండి జరుగుతున్న నష్టాలకు కారణమవుతున్న మన రాజకీయ, మిలిటరీ బలహీనతలను విశ్లేషించుకోవాలి. గత 3 దశాబ్దాలుగా విప్లవోద్యమ అణచివేత కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొనసాగిస్తున్న బహుముఖ దాడిలో భాగంగా అమలవుతున్న సంస్కరణల ఫలితంగా, శత్రువు కొనసాగిస్తున్న మానసిక యుద్ధం ఫలితంగా, సాంస్కృతిక దాడి ఫలితంగా విప్లవ శిబిరంలో వచ్చిన/వస్తున్న చీలిక నేపథ్యంలో ఈ ఘటనను విశ్లేషించుకోవాలి.

గత కొద్ది సంవత్సరాలుగా పార్టీలో, పీ.ఎల్.జీ.ఏ.లో కొనసాగుతున్న రాజకీయ, సైనిక బలహీనతల్ని సరిదిద్దుకోని ఫలితంగా కగార్ దాడి మొదలైనప్పటి 2024 నుండి మనం తీవ్రంగా నష్టపోతున్నాం. శత్రుదాడికి వెరవకుండా, ప్రాణత్యాగ సంసిద్ధతతో పోరాడుతూ, ప్రజల కోసం ప్రాణాలర్పించాలనే ఉన్నతమైన చైతన్యం కొరవడిన ఒక సెక్షన్ శత్రువుకు సరెండరయి, విప్లవోద్యమ ద్రోహులుగా మారి పార్టీ, పీ.ఎల్.జీ.ఏ.కు సంబంధించిన, నాయకత్వ కామ్రేడ్స్ కదలికలకు సంబంధించిన సమాచారాన్ని శత్రువుకు అందించడమే కాకుండా మనపై జరిగే దాడుల్లో వాళ్లు శత్రువుకు గైడ్స్ గా, స్కౌట్స్ గా ఉంటున్నారు, దాడుల్లో పాల్గొంటున్నారు. కర్రెగుట్ట ఆపరేషన్ లో శత్రువు 24 వేల శత్రు బలగాల్ని మోహరించినప్పటికీ 16 రోజుల పాటు ఆ బలగాలు అడ్వాన్స్ కాలేకపోయాయి. మన బలగాల నుండి మూకల్ అనే వాడు పారిపోయి ద్రోహిగా మారి పోలీసులకు గైడ్ గా వ్యవహరించి మన బలగాలపై దాడి చేయించిన ఫలితంగా 22 మంది కామ్రేడ్స్ అమరులయ్యారు. కర్రెగుట్ట ఆపరేషన్ లో మొత్తం 31 మంది కామ్రేడ్స్ అమరులయ్యారు. 7వ కంపెనీ నుండి పారిపోయిన ద్రోహులు ఇచ్చిన సమాచారంతో మాడ్/జాట్లూర్ ఆపరేషన్ లో మనం ప్రధాన కార్యదర్శిని కోల్పోయాం. మన పార్టీలో, పీ.ఎల్.జీ.ఏ.లో ప్రజల కోసం ప్రాణాలర్పిస్తూ ఉన్నతమైన ఆదర్శాలను నిలబెడుతూ అమరులవుతుండడమే ప్రధాన అంశంగా ఉన్నప్పటికీ ఒక సెక్షన్ ప్రాణభీతితో పారిపోయి ద్రోహులుగా మారుతున్నది కూడా ఉంది. ప్రజల కోసం ప్రాణాలర్పించే, నాయకత్వానికి, తోటివారికి, ప్రజలకు ద్రోహం చేయకూడదనే ఉన్నతమైన విప్లవ చైతన్యాన్ని పెంపొందించడం ద్వారా ఈ రాజకీయ బలహీనతను అధిగమించాలి.




శత్రువు విప్లవోద్యమంపై దాడికోసం అనుసరిస్తున్న ఎత్తుగడల్లో ఒకటి, అనేక మోసకారి విధానాల ద్వారా విప్లవ శిబిరాన్ని చీలదీయడం, వారిలో నుండి ఒక సెక్షన్ ను తన సాయుధ బలగాల్లో భర్తీ చేసుకోవడం, ఒక సెక్షన్ ను ఇంటలిజెన్స్ యంత్రాంగంలో (ఇన్ఫార్మర్లుగా గోపనీయ సైనికులుగా) భర్తీ చేసుకోవడం. ప్రస్తుతం పోలీసు ఇన్ఫార్మర్లకు, గోపనీయ సైనికులకు శత్రువు నెలవారీ జీతాలు చెల్లిస్తున్నాడు. దాడులు సఫలమవుతే అదనపు డబ్బులు కూడా చెల్లిస్తున్నాడు. ప్రస్తుతం పోలీసు ఇన్ఫార్మర్లు, డీ.ఆర్.జీ., బస్తర్ ఫైటర్స్ మన పార్టీ, పీ.ఎల్.జీ.ఏ. బలగాల కదలికల సమాచార సేకరణ కోసం ప్రతిరోజు తీవ్రమైన ప్రయత్నాలు చేస్తున్నారు. పోలీసు ఇన్ఫార్మర్లలో, గోపనీయ సైనికుల్లో కొందరు పోలీసు ఆపరేషన్ల సమయాల్లో శత్రువుకు స్కౌట్స్ గా, గైడ్స్ గా వ్యవహరిస్తున్నారు. ఆపరేషన్లకు ముందు మన డేరాల్ని, మన కదలికల్ని కనిపెట్టడానికి రెక్కీలు చేస్తున్నారు. శత్రు బలగాల అడ్వాన్స్ కోసం రూట్లకు సిగ్నల్స్ పెడుతున్నారు. ఆదివాసుల అస్థిత్వానికే ప్రమాదకారిగా మారిన కార్పొరేటీకరణ–సైనికీకరణలో భాగమవుతున్న పోలీసు ఇన్ఫార్మర్లు, గోపనీయ సైనికులు, డీ.ఆర్.జీ., బస్తర్ ఫైటర్స్ ఆదివాసీ వ్యతిరేకులని/ఆదివాసీ ద్రోహులని, వాళ్లు చేస్తున్నది క్షమించరాని నేరమనే రాజకీయ ప్రచారాన్ని ప్రభావయుతంగా తెరపిలేకుండా కొనసాగించాలి. ప్రచారం ద్వారా, హెచ్చరికల ద్వారా అత్యధికుల్ని నియంత్రిస్తూ, మొండిఘటాలను నిర్మూలిస్తూ ఉండాలి. ఈ రాజకీయ, సైనిక కృషి మనవైపు నుండి నిరంతరం ప్రభావయుతంగా సాగడం లేదు. రకరకాల సంస్కరణల ద్వారా ఒక సెక్షన్ ను, స్థానిక సంస్థల ఎన్నికల ద్వారా ఒక సెక్షన్ ను శత్రువు ఆర్థికవాద, సంస్కరణవాద, చట్టబద్ధవాదంలోకి ఈడ్చగలిగాడు. వీటి ప్రభావంతో ఒక సెక్షన్ విప్లవోద్యమంలో గతంలాగ క్రియాశీలంగా పనిచేయడం లేదు అంటే శత్రువు విప్లవ శిబిరంలో ఒక సెక్షన్ ను తాత్కాలికంగా చీలదీయగలిగాడు. బహిరంగ–చట్టబద్ధ, రహస్య–

చట్టవ్యతిరేక పోరాటాల్లో ప్రజలను కదిలిస్తూ ప్రజల్లో విప్లవ చైతన్యాన్ని కల్పిస్తూ వారిని ఆర్థికవాద, సంస్కరణవాద, చట్టబద్ధవాదపు ప్రభావం నుండి బయటకు తేవాలి.

గత 3 దశాబ్దాలుగా దేశంలో సామ్రాజ్యవాద సాంస్కృతిక దాడి కొనసాగుతోంది. దాంతో యువతలో వ్యక్తివాదం, కెరీరిజం (ఉద్యోగాలు సంపాదించుకోవడం/పదవులు సంపాదించుకోవడం), వస్తు వినిమయతత్వం పెరిగింది. వీటిని వెన్నంటి మార్గం ఏదైనా డబ్బు సంపాదనే ముఖ్యమైందనే భావజాలం వ్యాపించింది. దీంతో యువతలో లంపెనైజేషన్, క్రిమినలైజేషన్ పెరిగింది. సామాజిక సమస్యల పరిష్కారం గురించి ఆలోచించడం తగ్గింది. పోలీసు ఉద్యోగాలు తప్ప ఇతర ప్రభుత్వ ఉద్యోగాలు అందుబాటులో లేని స్థితిలో యువత పోలీసు, పారామిలిటరీ, కమాండో బలగాల్లో చేరటం సాపేక్షికంగా పెరిగింది. సాంస్కృతిక రంగంలో వర్గపోరాటాన్ని కొనసాగిస్తూ సామ్రాజ్యవాద సంస్కృతిపై, బ్రాహ్మణీయ హిందుత్వ ఫాసిస్టు భావజాలంపై ప్రభావయుతంగా దాడి చేయాలి. యువతను గెలుచుకునేలా సాంస్కృతిక-కళారూపాలను ఎంచుకోవాలి. వీటి ద్వారా సామాజిక సమస్యల పరిష్కారంలో యువత భాగస్వామ్యాన్ని పెంచాలి.

విప్లవ ప్రతిఘాతక 'కగార్' యుద్ధ ప్రారంభంతో పార్టీ, పీ.ఎల్.జీ.ఏ. బలగాల నష్టాల తీవ్రత పెరగడానికి కారణం విప్లవోద్యమ నిర్మూలన కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆధునిక సాంకేతికత (మాడర్న్ టెక్నాలజీ)ను, ఆధునిక ఆయుధాలను విస్తృతంగా, తీవ్రంగా ఉపయోగిస్తున్నాయి. ఇవి గతం నుండి ఉన్నప్పటికీ వాటి విస్తృతి, తీవ్రత అనేక రెట్లు పెరిగింది. మన బలగాల ఉనికిని కనుక్కోవడానికి (లొకేట్ చేయడానికి) హ్యూమన్ ఇంటలిజెన్స్ (ఇన్ఫార్మర్లు, కోవర్టులు, గోపనీయ సైనికులు)తో పాటు టెక్నికల్ ఇంటలిజెన్స్ లో భాగంగా వాకీటాకీల ట్రయాంగ్లేషన్, సెల్ ఫోన్ల ట్రయాంగ్లేషన్, కాల్ లాగింగ్, ఇంటర్నెట్ ఆధారంగా మనం చేసే పనులపై నిఘా, రకరకాల డ్రోన్లతో నిరంతర నిఘా (సర్వేలన్స్), సాటిలైట్ల ద్వారా మన బలగాల ఉనికిని కనుక్కోవడం (సాటిలైట్ ఇమేజరి) తీవ్రతరమైంది, మన సివిల్, మిలిటరీ సప్లయిల్లో విస్తృతంగా జీపీఎస్ మాడ్యుల్స్ ను పెట్టి పంపి మన బలగాల్ని లొకేట్ చేయడం విస్తృతమైంది, తీవ్రతరమైంది. ఒక పార్టీ కార్యకర్త/గెరిల్లా వెనక 30 నుండి 100 మంది ప్రభుత్వ సాయుధ బలగాల్ని మోహరించి 20-30 కి.మీ.ల పరిధిని పూర్తిగా ఎన్ సర్కిల్ చేసి (చుట్టివేసి), ఆ పరిధినంతటిని విస్తృతంగా గాలించి, మన బలగాల నిర్మూలనలో యూబీజీఎల్స్, రాకెట్ లాంచర్ల వాడకం తీవ్రతరం కాగా కొత్తగా మల్టీ గ్రానేడ్ లాంఛర్స్ వాడకం మొదలైంది.

వీటికి తోడుగా 81 ఎంఎం మోర్టార్లతో షెల్లింగ్ చేయడం, తేలికపాటి యుద్ధ ట్యాంకుల ద్వారా మన యుద్ధ చర్యలను కౌంటర్ చేయడం మొదలైంది. వీటన్నింటి వల్లా గెరిల్లా యుద్ధ విస్తృతి-తీవ్రత తగ్గింది. గత 5½ దశాబ్దాలుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తూ వచ్చిన విప్లవ ప్రతిఘాతక యుద్ధంలో 'కగార్' యుద్ధం మౌలికమైన మార్పును తీసుకువచ్చింది.

కగార్ దాడి ప్రారంభమైన తర్వాత ఫిబ్రవరి 2024లో కేంద్రకమిటీ ఒక సర్క్యులర్ విడుదల చేసింది. 2012 నుండి దేశవ్యాప్త ఉద్యమం గడ్డుస్థితిలోకి వెళ్లిన స్థితిని సాధారణంగా, 2021 జనవరి నుండి 2024 ఆగస్టు వరకున్న ఉద్యమ స్థితిని ప్రత్యేకించి విశ్లేషిస్తూ 2024 ఆగస్టులో మన పొలిట్ బ్యూరో మరో సర్క్యులర్ ను విడుదల చేసింది. కగార్ యుద్ధంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విప్లవోద్యమ అణచివేతలో మౌలిక మార్పు వచ్చిందనే విషయాన్ని ఈ సర్క్యులర్లు చెపుతూ, విప్లవోద్యమం తాత్కాలిక వెనకంజలో కొనసాగుతున్న స్థితిని తెలియజేస్తూ, ఈ స్థితిలో అనుసరించాల్సిన రాజకీయ, మిలిటరీ ఎత్తుగడల్ని రూపొందించాయి. అందులో భాగంగా, పార్టీని, పీ.ఎల్.జీ.ఏ., ఐక్యసంఘటనలను, విప్లవోద్యమాన్ని కాపాడుకోవాలని, అందుకోసం పట్టణ, మైదాన ఉద్యమాల్ని పునర్నిర్మించాలని, పట్టణ, మైదాన, అటవీ ఉద్యమాలను పరస్పర పూరకాలుగా నడపాలని, నాలుగు వర్గాల ప్రజల్ని విప్లవోద్యమంలో సమీకరించాలని; ఈ కాలంలో బహిరంగ-రహస్య; చట్టబద్ధ-చట్టవ్యతిరేక పోరాట, నిర్మాణ రూపాలను సమన్వయిస్తూ వర్గపోరాటాన్ని నడపాలని, శత్రు ఆధిక్యత ఏర్పడిన స్థితిలో ప్రజల్లోని మధ్యస్థ, వెనకబడిన సెక్షన్లు చట్టవ్యతిరేక, రహస్య పోరాటాల్లో కదలడానికి వెనకాముందాడుతున్న స్థితిలో బహిరంగ, చట్టబద్ధ పోరాట, నిర్మాణ రూపాలను ఉపయోగించి విశాల ప్రజారాశులను విప్లవోద్యమంలో సమీకరించాలని, దేశవ్యాప్తంగా కగార్ దాడి కొనసాగుతున్నప్పటికీ దాని ప్రధాన కేంద్రీకరణ దండకారణ్యంపై ఉన్న స్థితిలో అక్కడి నుండి గణనీయమైన సంఖ్యలో పార్టీ, పీ.ఎల్.జీ.ఏ. బలగాలను ఇతర రాష్ట్రాలకు రిట్రీట్ చేయాలని, అక్కడ (డీకేలో) మాస్ వర్క్ చేయడం కోసం, ప్రతిఘటన కోసం చిన్న ఫార్మేషన్ల రూపంలో (గ్రూపు, సెక్షన్) పనిచేయాలని, చిన్న ప్రాంతాలకు పరిమితం కాకుండా/చిక్కుకుపోకుండా విశాల ప్రాంతాల్లో సంచరిస్తూ పనిచేయాలని, నిరంతరం మొబైల్ లో ఉండాలని ఆ సర్క్యులర్లలో మనం అనుసరించాల్సిన రాజకీయ, సైనిక ఎత్తుగడల గురించి చెప్పాం. అయితే, కేంద్రకమిటీ ఈ ఎత్తుగడలను సకాలంలో రూపొందించలేకపోయింది. ఇవే ఎత్తుగడలను 2-3 సంవత్సరాల ముందే రూపొందించాల్సి ఉండె. ఈ ఆలస్యం ఫలితంగా, ఆలస్యంగానయినా రూపొందించిన ఈ ఎత్తుగడలను సరిగా అమలుచేయని ఫలితంగా మనం 2024 ఏప్రిల్ నుండి తీవ్రంగా నష్టపోతూ వస్తున్నాం. ఇప్పటివరకు దేశవ్యాప్తంగా 540 మంది కామ్రేడ్స్ అమరులవుతే అందులో అత్యధికం డీకేలోనే నష్టపోయాం. ఇది మనలోని అనుభవవాద స్వీయాత్మకత ఫలితమే. ఇప్పటికైనా జరుగుతున్న నష్టాల నుండి నేర్చుకుంటూ కేంద్రకమిటీ, పొలిట్ బ్యూరో రూపొందించిన రాజకీయ, సైనిక ఎత్తుగడల్ని ఆచరించడం ద్వారానే ఈ నష్టాల్ని నివారించుకోగలుగుతాం.

కగార్ దాడి ప్రారంభంతో శత్రుదాడిలో వచ్చిన మౌలిక మార్పును గమనంలో ఉంచుకుని పార్టీ ప్రధాన కార్యదర్శి రక్షణ గురించిన బహుముఖ ఎత్తుగడలతో కూడిన సమగ్రమైన పథకాన్ని పీబీ/సీసీ రూపొందించకపోవడంతో మనం ప్రధాన కార్యదర్శిని కాపాడుకోలేకపోయాం.

**ప్రస్తుతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న మానసిక యుద్ధ ప్రభావానికి గురికాకూడదు :**

సీపీఐ (మావోయిస్టు) ప్రధాన కార్యదర్శిని నిర్మూలించి ఆ పార్టీ వెన్నెముకను విరగొట్టాం, 2026, మార్చి 31కి ముందే ఆ పార్టీని నిర్మూలిస్తాం అని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పదే పదే ప్రచారం చేస్తున్నాయి. సగటున 15 రోజులకు ఒక పెద్ద దాడి చేస్తూ, ఇలాంటి మానసిక యుద్ధం చేయడంతో పార్టీ, పీ.ఎల్.జీ.ఏ., స్థానిక ప్రజా నిర్మాణాల్లోని ఒక సెక్షన్ లో, విప్లవ శిబిరంలో పార్టీ భవిష్యత్తు ఏమిటి? విప్లవోద్యమ భవిష్యత్తు ఏమిటి? ఈ దాడి నుండి పార్టీని, విప్లవోద్యమాన్ని కాపాడుకోవడం ఎలా? అనే ప్రశ్నలు, భయాందోళనలు నెలకొన్నాయి. గత 5 దశాబ్దాలకు మించిన విప్లవోద్యమ చరిత్రలో, పార్టీకి ఎదురైన ఇలాంటి నష్టాలను ఎలా ఎదుర్కొందో చూద్దాం.

1972 జూలైలో ఆనాటి మన పార్టీ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ చారుమజుందార్ ను పశ్చిమ్ బెంగాల్ పోలీసులు అరెస్టు చేసి, హత్య చేసారు. ఆనాడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, దోపిడీ వర్గాలు దేశంలో నక్సలైట్లను, విప్లవోద్యమాన్ని అంతం చేసామని సంబరపడ్డాయి. కానీ 1978 నాటికి ఆంధ్రప్రదేశ్, బిహార్ రాష్ట్రాల్లో విప్లవోద్యమం పొటెత్తింది. ఆనాడు సరైన ఎత్తుగడల్ని అనుసరించి పార్టీ, విప్లవోద్యమం బలపడింది, విస్తరించింది. 1985–88 మధ్య మొదటి ప్రభుత్వ దాడిలో పార్టీ తీవ్రంగా నష్టపోయింది. ఆనాడు సరైన రాజకీయ, మిలిటరీ ఎత్తుగడల్ని చేపట్టి ఉత్తర తెలంగాణ, దండకారణ్య ఉద్యమాలను గెరిల్లా జోన్లుగా అభివృద్ధి చేసాం. 1999లో డిసెంబర్ 2 నాడు ఆంధ్రప్రదేశ్ ఎస్ఐబీ పోలీసులు మన కేంద్రకమిటీ సభ్యులు కామ్రేడ్స్ శ్యాం, మహేష్, మురళిలను హత్యచేసాయి. మరోమారు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, దోపిడీ వర్గాలు సీపీఐ (ఎం–ఎల్) (పీపుల్స్ వార్) పార్టీ వెన్ను విరిచాం అని సంతోషపడ్డాయి. కానీ సంవత్సర కాలంలోనే కామ్రేడ్స్ శ్యాం, మహేష్, మురళిల అమరత్వపు ప్రేరణతో ప్రజావిముక్తి గెరిల్లా సైన్యాన్ని పార్టీ ఏర్పాటు చేసి విప్లవోద్యమాన్ని పురోగమింపచేసింది. మధ్యలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రకమిటీ కార్యదర్శి పులిఅంజన్న, మాధవ్ లను హత్య చేసినపుడు, కొంతమంది కేంద్రకమిటీ సభ్యులను, రాష్ట్రకమిటీ సభ్యులను హత్య చేసినపుడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, దోపిడీ వర్గాలు ఇలాగే ప్రకటించాయి. కానీ ఆ నష్టాలన్నింటిని పార్టీ అధిగమించింది. వీటికి కారణం వస్తుగత స్థితిని, ఉద్యమ స్థితిని (స్వీయాత్మక స్థితిని) సరిగా అంచనా వేసుకుని సరైన రాజకీయ, మిలిటరీ ఎత్తుగడల్ని రూపొందించుకుని వాటిని సరిగా అమలు చేయడమే. నేటి స్థితిలో కూడా మనం ఇదే పద్ధతిని పాటించాలి.

**విప్లవానుకూలంగా మారుతున్న వస్తుగత స్థితిని సద్వినియోగం చేసుకుని తాత్కాలిక వెనకంజలో కొనసాగుతున్న విప్లవోద్యమాన్ని పురోగమింపజేద్దాం :**

అంతర్జాతీయంగా, దేశీయంగా మౌలిక, ప్రముఖ వైరుధ్యాలు తీవ్రతరమవుతున్న ఫలితంగా సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా ప్రపంచవ్యాప్తంగా పీడిత ప్రజల, పీడిత జాతుల పోరాటాలు విస్తృతమవుతున్నాయి, తీవ్రతరమవుతున్నాయి. పెట్టుబడిదారీ–సామ్రాజ్యవాద దేశాల్లో బూర్జువా వర్గానికి వ్యతిరేకంగా కార్మికవర్గ పోరాటాలు క్రమంగా పెరుగుతున్నాయి. ప్రపంచాధిపత్యం కోసం, వనరుల దోపిడీ కోసం సామ్రాజ్యవాదుల మధ్య వైరుధ్యాలు తీవ్రతరమవుతున్నాయి. ప్రస్తుతం ఒకవైపు అమెరికాకు, మరోవైపునున్న చైనా, రష్యాలకు మధ్య వైరుధ్యాలు పెరుగుతున్నాయి. ప్రస్తుతం అమెరికా ప్రపంచంలోనే అతిపెద్ద రుణగ్రస్త దేశంగా మారిపోయింది. ప్రస్తుతం దాని అప్పు 38 ట్రిలియన్ డాలర్లు. ఇంతటి భారీ అప్పుల భారాన్నుండి బయటపడడానికి అది ప్రపంచ దేశాలన్నింటిపై భారీ సుంకాల్ని విధిస్తోంది. దీంతో అమెరికా ఆర్థిక వ్యవస్థతో పాటు ప్రపంచ ఆర్థిక వ్యవస్థ మరింతగా బలహీనపడి, ప్రపంచ ఆర్థిక సంక్షోభం మరింతగా తీవ్రతరం కానుంది.

దేశంలో సామ్రాజ్యవాద, దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ (సీబీబీ) దోపిడి, పీడనలకు వ్యతిరేకంగా రైతాంగం, కార్మికులు, మధ్యతరగతి ప్రజలు పోరాడుతున్నారు. భూస్వామ్య దోపిడి, పీడనలకు వ్యతిరేకంగా ప్రజలు తరతమ మోతాదుల్లో పోరాడుతున్నారు. 'వికసిత్ భారత్' పేరుతో సామ్రాజ్యవాద, దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ, భూస్వామ్య, దోపిడి, పీడనలను సుస్థిరం చేయడానికి 'హిందురాష్ట్ర' ఏర్పాటు కోసం పాటుపడుతున్న బీజేపీ పాలిత బ్రాహ్మణీయ హిందుత్వ ఫాసిస్టు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా, ఇతర పార్టీల ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ప్రజలు తరతమ తేడాలతో పోరాడుతున్నారు. 'హిందురాష్ట్ర' ఏర్పాటులో భాగంగా 'ప్రతిపక్షరహిత భారతాన్ని (విపక్ష్ ముక్త్ భారత్)' ఏర్పాటు చేయడం కోసం బీజేపీ ప్రతిపక్ష పార్టీలపై చేస్తున్న అన్నిరకాల దాడులకు వ్యతిరేకంగా ప్రతిపక్షాలు విడివిడిగా, కొన్ని పార్టీలు కలిసి పార్లమెంటరీ పద్ధతుల్లో పోరాడుతున్నాయి. దేశంలో రోజురోజుకు పేదరికం, నిరుద్యోగం, నిత్యావసర సరుకుల ధరలు పెరుగుతున్నాయి. సామ్రాజ్యవాద, సీబీబీ కార్పొరేట్ల దోపిడి తీవ్రతరం కావడంతో రైతాంగం, ఆదివాసులు తమ భూముల నుండి, అడవుల నుండి పెద్దఎత్తున విస్థాపితులవుతున్నారు. వీటికి వ్యతిరేకంగా రైతాంగం, ఆదివాసులు తరతమ తేడాలతో పోరాడుతున్నారు. దేశవ్యాప్తంగా బ్రాహ్మణీయ హిందుత్వ ఫాసిస్టు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక రంగాల్లో పేదలపై, పీడిత సాంఘిక సముదాయాలపై,

పీడిత జాతులపై దాడులు చేస్తున్నాయి. బుల్డోజర్లతో పేదల, ముస్లింల ఇళ్లను కూలగొడుతున్నారు. దేశవ్యాప్తంగా బ్రాహ్మణీయ హిందుత్వ ఫాసిస్టు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ముస్లింలపై దాడులు చేస్తున్నాయి. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ప్రభుత్వాల దన్నుతో సంఘ్ పరివార్ మూకలు దళితులపై, ఆదివాసులపై, ముస్లింలపై, క్రిష్టియన్లపై దాడులు చేస్తున్నాయి. వీటికి వ్యతిరేకంగా పీడితులు నిరసనలు తెలియజేస్తున్నారు.

ఈ విప్లవానుకూల వస్తుగత స్థితి తాత్కాలిక వెనకంజలోని విప్లవోద్యమాన్ని పురోగమింప చేయడానికి, నష్టపోయిన స్వీయాత్మక శక్తుల్ని పెంచుకోవడానికి ఉపయోగపడుతుంది, ప్రాతిపదిక అవుతుంది.

'కగార్' యుద్ధం కొనసాగుతున్న గత సంవత్సరంన్నర కాలంలో మన పార్టీ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ బీఆర్ ను, సీసీ సభ్యులు కామ్రేడ్స్ చలపతి, వివేక్ లను కోల్పోయినప్పటికీ, రాష్ట్రకమిటీ కామ్రేడ్స్ రూపేష్, కార్తిక్, చైతే (డీకే); సాగర్, భద్రు, మధు (తెలంగాణ); గుడ్డు, సత్యం, అలోక్ (ఒడిశా), జగన్ (ఏఓబీ); బీజే, తూర్పు బిహార్–ఈశాన్య ఝార్ఖండ్ ల్లో ఒకరు–ఇద్దరు రాష్ట్రకమిటీ కామ్రేడ్స్ ను కోల్పోయినప్పటికీ గణనీయమైన సంఖ్యలో డీవీసీ/సీవైపీసీ, ఏసీ/పీపీసీ స్థాయి కామ్రేడ్స్ ను, పార్టీ సభ్యులను, పీ.ఎల్.జీ.ఏ. సభ్యులను కోల్పోయినప్పటికీ మొత్తంగా 540 మంది కామ్రేడ్స్ శత్రుదాడిలో అమరులైనప్పటికీ దేశవ్యాప్త విప్లవోద్యమం తాత్కాలిక వెనకంజలో కొనసాగుతున్నప్పటికీ, నాయకత్వ శక్తుల పరంగా పార్టీ బలహీనపడినప్పటికీ, స్వీయాత్మక శక్తులు తగ్గినప్పటికీ ఇవన్నీ కలిపి మన స్వీయాత్మక శక్తి బలహీనతలను తెలియజేసే ఒక పార్శ్వం మాత్రమే. ఈ బలహీనతలతో పాటు స్వీయాత్మకంగా మనకు బలం కూడా ఉంది. ఇప్పటికీ దేశవ్యాప్తంగా 15 రాష్ట్రాల్లో పార్టీ ఉంది, ప్రజాసంఘాలున్నాయి. మన పార్టీ, ప్రజాసంఘాల నాయకత్వంలో వేర్వేరు రూపాల్లో వేలాదిమంది ప్రజలు విప్లవోద్యమంలో పాల్గొంటున్నారు. ప్రజాసంఘాల్లో వేలాదిమంది సభ్యులున్నారు. మనకు కేంద్రకమిటీ ఉంది, కొన్ని రాష్ట్రాల్లో రాష్ట్రకమిటీలున్నాయి, జిల్లా, ఏరియా కమిటీలున్నాయి. డీకే, బీజే, తూర్పు బిహార్–ఈశాన్య ఝార్ఖండ్, ఒడిశా, ఎంఎంసీ, ఏఓబీ, తెలంగాణల్లో గెరిల్లా దళాలున్నాయి. ఈ స్వీయాత్మక స్థితి నక్సల్బరీ, శ్రీకాకుళ ఓటమి నాటి స్థితితో చూస్తే ఎంతో అనుకూలమైంది. మనందరం కలిసి ప్రస్తుత వస్తుగత, స్వీయాత్మక స్థితిలోని బలాబలాలను సరిగా అర్థం చేసుకుని, ప్రజలను అంటిపెట్టుకుని వర్గపోరాటాన్ని, గెరిల్లాయుద్ధాన్ని నడిపితే మన ప్రజాపునాది పెరిగి, స్వీయాత్మక శక్తులు పెరుగుతాయి, విప్లవోద్యమం పురోగమిస్తుంది. మార్క్సిస్టులుగా మనం ఎపుడైన వస్తుగత స్థితిలోని అనుకూల, ప్రతికూలతలతో పాటు, స్వీయాత్మక స్థితిలోని బలహీనతలను, బలాన్ని కూడా అంచనా వేసుకోవాలి. వీటిలో ఏది ప్రధానమో కూడా అంచనా వేసుకోవాలి. ఆ అంచనా ఆధారంగా వస్తుగత స్థితిని సద్వినియోగం చేసుకునే రాజకీయ, మిలిటరీ ఎత్తుగడల్ని రూపొందించుకోవాలి. వస్తుగత స్థితిలో గానీ, స్వీయాత్మక స్థితిలో గానీ కేవలం అనుకూలతనో, ప్రతికూలతనో ఏకపక్షంగా అతిగా, మితంగా అంచనా వేయకూడదు. అలా చేస్తే మనం సరైన ఎత్తుగడల్ని రూపొందించుకోలేము. మనం సరైన ఎత్తుగడల్ని రూపొందించుకోలేనపుడు విప్లవోద్యమాన్ని సరిగా నడపలేము. దీంతో స్వీయాత్మక శక్తుల్లో గందరగోళం, అవిశ్వాసం, అధైర్యం తలెత్తుతాయి. వస్తుగత, స్వీయాత్మక స్థితిలో ప్రతికూలతలే ప్రధానమైనపుడు కూడా అవి తాత్కాలికమేననే అంచనాతో, ద్వితీయంగా ఉండే అనుకూలతల్ని గుర్తించి వాటి ఆధారంగా సరైన ఎత్తుగడలతో విప్లవోద్యమాన్ని నడపడమే సరైన మార్క్సిస్టు పద్ధతి, విప్లవకర పద్ధతి అవుతుంది. ఇలాంటి కష్ట సమయాల్లోనే మాలెమాను సూక్ష్మదర్శినిగా, దూరదర్శినిగా మరింత మెరుగ్గా ఉపయోగించుకోవాలి. అపుడే ప్రతికూలతలు ప్రధానమైన అవి తాత్కాలికమేననే స్పష్టత చేకూరుతుంది. ప్రతికూలతలు ప్రధానమైనపుడు శత్రువును/దోపిడి వర్గాలను వ్యూహాత్మకంగా, ఎత్తుగడలపరంగా అంచనా వేయాలి. దోపిడి వర్గాలను వ్యూహాత్మకంగా కాగితపు పులిగానే అంచనా వేయాలి. అపుడే ఎత్తుగడలపరంగా ఆధిక్యతలో ఉన్న శత్రువు వ్యూహాత్మకంగా బలహీనుడేనని స్పష్టత చేకూరుతుంది. ఈ స్పష్టతతో మన వస్తుగత, స్వీయాత్మక స్థితిని విశ్లేషించడమే గతితార్కిక విశ్లేషణ అవుతుంది. లేనిచో శత్రువును అతిగా, మితంగా అంచనా వేసే ప్రమాదం వుంటుంది. ప్రతికూలతలు ప్రధానమైనపుడు సాధారణంగా శత్రువును/దోపిడి వర్గాలను అతిగా అంచనా వేసే ప్రమాదం వుంటుంది. దాన్ని వెన్నంటి మితవాద ధోరణి ముందుకు వస్తుంది. శత్రువును తక్కువగా (మితంగా) అంచనా వేస్తే అతివాద ధోరణి ముందుకువస్తుంది. కాబట్టి వస్తుగత, స్వీయాత్మక స్థితి పట్ల మనం ఏకపక్ష, స్వీయాత్మక అంచనాలు వేయకూడదు. అందుకే మనం వస్తుగత స్థితి విప్లవానికి అనుకూలంగా మారుతుందని, స్వీయాత్మక స్థితి బలహీనంగా ఉందని, విప్లవోద్యమం తాత్కాలిక వెనకంజలో ఉందని, ప్రస్తుతం శత్రువు ఆధిక్యతలో ఉన్నాడని అంచనా వేస్తున్నాం. అయితే ఈ స్థితిని తప్పనిసరిగా మార్చగలుగుతాం, మార్చడం కోసం కృషి చేయడం మన కర్తవ్యం. విప్లవోద్యమం తాత్కాలిక వెనకంజలో ఉన్నా, ఓటమి పాలయినా వర్గాలు ఉన్నంత వరకు వర్గపోరాటం కొనసాగుతూనే ఉంటుంది. ఆ వర్గపోరాటాన్ని సరైన ఎత్తుగడలతో నడిపితే విప్లవ పార్టీ తిరిగి బలపడి, విప్లవోద్యమం పురోగమిస్తుంది. అందుకే ఈ స్థితిని మార్చగలుగుతామనీ, మార్చడం కోసం కృషి చేయడం మన కర్తవ్యమని చెపుతాం.

అందుకే ఓటమి గర్భంలో విజయాన్ని వీక్షించేవాడే విప్లవకారుడనీ, చిమ్మని చీకట్లో వినీలాకాశంలో మినుకు మినుకుమనే నక్షత్రాల వెలుగును చూడాలనీ, తుఫానులో చిక్కుకున్న ఓడను గమ్యం దిశగా నడిపే నావికుడిలాగా విప్లవకారులుండాలనే ఉపమానాలు విప్లవోద్యమాల అనుభవాల సారంగా రూపొందాయి.

అందుకే నేటి స్థితిలో, కేవలం శత్రు ఆధిక్యతను, మనకు జరుగుతున్న నష్టాలను మాత్రమే చూసి అవిశ్వాసానికి గురికావద్దు, అధైర్యపడొద్దు, నిష్క్రియపరత్వానికి గురికావద్దు. శత్రు ఆధిక్యతతో పాటు శత్రువుకున్న బలహీనతలనూ, ఉద్యమ ప్రాంతాలంతటా, దేశవ్యాప్తంగా మన పార్టీ తమకు అండగా ఉండాలని కోరుకుంటున్న కోట్లాది ప్రజల ఆకాంక్షల్ని, విప్లవోద్యమంలో వేర్వేరు రూపాల్లో కదులుతున్న వారి భాగస్వామ్యాన్ని, వారి మద్దతును గమనంలో ఉంచుకుని మనం నిండైన విశ్వాసంతో, ధైర్యంగా, క్రియాశీలంగా, చొరవగా పనిచేయాలి. మారిన పరిస్థితికి తగినట్టుగా వర్గపోరాటాన్ని, గెరిల్లాయుద్ధాన్ని నడపాలి.

**మారిన పరిస్థితికి తగినట్టుగా వర్గపోరాటాన్ని, గెరిల్లాయుద్ధాన్ని నడపడమే ప్రస్తుతం మన కర్తవ్యం :**

నక్సల్బరీ, శ్రీకాకుళ పోరాటాల ఓటమి అనంతరం గుండె జారిపోయిన కొందరు విప్లవోద్యమానికి తిలోదకాలిచ్చారు, కొన్ని మార్క్సిస్టు-లెనినిస్టు పార్టీలు మితవాద పంథాను ఎంచుకున్నాయి, మహదేవ్ ముఖర్జీ గ్రూపు అతివాద పంథాను ఎంచుకుంది. కానీ మనం మితవాద, అతివాదాలకు బలవకుండా నక్సల్బరీ, శ్రీకాకుళ పోరాటాల్లోని పాజిటివ్ ను ఎత్తిపట్టాం, నెగెటివ్ ను గుర్తించి వదులుకున్నాం, సరైన రాజకీయ ఎత్తుగడలతో తిరిగి వర్గపోరాటాన్ని ప్రారంభించాం. దాని ఫలితమే ఆంధ్ర, బిహార్ విప్లవోద్యమాల వెల్లువ. అంటే ఓటములు ఎదురైనపుడు దానికి కారణాల్ని గుర్తించి ధైర్యంగా తిరిగి ప్రజల వద్దకు వెళ్లి వర్గపోరాటాన్ని నడపడమే సరైన విప్లవకర పద్ధతి. ప్రస్తుతం కూడా మనం ఇదే పద్ధతిని అనుసరించాలి. 2024 ఆగస్టులోనే మన పొలిట్ బ్యూరో విప్లవోద్యమంలో తాత్కాలిక వెనకంజ స్థితి తలెత్తడానికి దారితీసిన కారణాల్ని లోతుగా విశ్లేషించింది. 2020 నాటి కేంద్ర రాజకీయ, నిర్మాణ సమీక్షలో చెప్పిన అంశాలకు తోడుగా మరిన్ని అంశాలను లోతుగా గుర్తించింది. 2007 ఐక్యతా కాంగ్రెస్ అనంతర కాలపు విప్లవోద్యమంలోని పాజిటివ్స్, నెగెటివ్స్ ను విశ్లేషించి రానున్న 3-5 సంవత్సరాల కాలంలో మనం వర్గపోరాటాన్ని, గెరిల్లాయుద్ధాన్ని నడపడానికి అవసరమైన రాజకీయ, మిలిటరీ ఎత్తుగడల్ని రూపొందించింది. ఇప్పటికీ ఆ సర్క్యులరే మనకు మౌలికంగా గైడెన్స్. దాని ప్రకారమే దేశవ్యాప్తంగా – పట్టణాల్లో, మైదానాల్లో అటవీ ప్రాంతాల్లో మనం పనిచేయాలి. మొదట ప్రస్తుతమున్న నాయకత్వ శక్తులను, పార్టీ, పీ.ఎల్.జీ.ఏ. బలగాలను కాపాడుకోవాలి. పట్టణ, మైదాన ఉద్యమాలను పునర్నిర్మించాలి. నాలుగు వర్గాల ప్రజలను విప్లవోద్యమంలో సమీకరించాలి. నేటి పరిస్థితిలో బహిరంగ, చట్టబద్ధ పోరాట, నిర్మాణ రూపాలకు ప్రాధాన్యతనిస్తూనే రహస్య, చట్టవ్యతిరేక పోరాట, నిర్మాణ రూపాల ద్వారా వర్గపోరాటాన్ని నడపాలి. రహస్య పనివిధానం అమలులో, గెరిల్లాయుద్ధ నియమాల అమలులో కొనసాగుతున్న లోపాలను సరిదిద్దుకోవాలి. దండకారణ్యం నుండి కొన్ని పార్టీ, పీ.ఎల్.జీ.ఏ. బలగాలను ఇతర రాష్ట్రాలకు పంపాలి. గెరిల్లా యూనిట్లు ఉన్నచోట శక్తిమేరకు గెరిల్లాయుద్ధాన్ని కొనసాగించాలి. ఇదే మనకర్తవ్యం.

ఈ కర్తవ్య సాధనకోసం మారిన సామాజిక పరిస్థితుల్లో వర్గపోరాటాన్ని నడపడం కోసం కేంద్ర ఎంఓపీ డాక్యుమెంట్ ను, కుల సమస్య, జాతుల సమస్య డాక్యుమెంట్లను గైడెన్స్ గా తీసుకోవాలి. తాత్కాలిక వెనకంజ కాలంలో, కార్పెట్ సెక్యూరిటీ మధ్య మన గెరిల్లా బలగాలు గ్రూపు, సెక్షన్ స్థాయిలో ఉంటూ చిన్న, వికేంద్రీకృత గెరిల్లా చర్యల ద్వారా గెరిల్లాయుద్ధాన్ని సాగించాలి. మన ప్రధాన, ద్వితీయ బలగాలు ప్రజా మిలిషియాతో కలిసి గెరిల్లాయుద్ధాన్ని సాగించాలి. రాజకీయ, సైనిక కృషి ద్వారా నిరంతరం ఇన్ఫార్మర్లను నియంత్రించే కృషి చేయాలి. రానున్న సంవత్సర కాలంలో దేశవ్యాప్తంగా ఉద్యమ ప్రాంతాల్లో 85 పోలీసు క్యాంపులు రానున్నాయి. ఇందులో అత్యధికం డీకేకే రానున్నాయి. కాబట్టి డీకేతో పాటు ఉద్యమ ప్రాంతాలంతటా బలగాలను కాపాడుకోవడానికి తగిన పద్ధతులను అనుసరించాలి.

ఈ పద్ధతిలో దృఢంగా, ధైర్యంగా వర్గపోరాటాన్ని, గెరిల్లాయుద్ధాన్ని సాగించడం ద్వారానే మనం మన బలగాలను కాపాడుకోగలుగుతాం. క్రమంగానే అయినప్పటికీ స్వీయాత్మక శక్తులను పెంచుకోగలుగుతాం, కొంత సమయం పట్టినప్పటికీ తాత్కాలిక వెనకంజ స్థితిని అధిగమించగలుగుతాం. దీనికి భిన్నంగా శత్రుదాడుల తీవ్రత రీత్యా ఏమీ చేయలేమనే నిష్క్రియపరత్వానికి గురవుతే నేటి స్థితిని అధిగమించలేము. శాంతి చర్చల పట్ల మనం భ్రమలు పెట్టుకోవద్దు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న మావోయిస్టు నిర్మూలన యుద్ధం కార్పొరేట్ల ప్రయోజనాల కోసం సాగుతుందని, కార్పొరేట్ల లూటీ నుండి మన జల్, జంగల్, జమీన్ ను కాపాడుకోవడానికి మనం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా పోరాడాల్సి ఉంటుందనే రాజకీయ చైతన్యాన్ని ప్రజల్లో పెంచే రాజకీయ కృషి చేయాలి. మన ఆత్మరక్షణ కోసం శక్తిమేరకు గెరిల్లాయుద్ధాన్ని సాగించాలి. దీనికి భిన్నంగా ఆలోచించడం, ఆచరించడం విప్లవోద్యమానికి నష్టదాయకం. అందుకే మారిన సామాజిక పరిస్థితికి తగినట్టుగా, తాత్కాలిక వెనకంజ స్థితిని అధిగమించడానికి తోడ్పడేలా వర్గపోరాటాన్ని, గెరిల్లాయుద్ధాన్ని నడపడమే మన కర్తవ్యం. పార్టీ, పీ.ఎల్.జీ.ఏ. బలగాలను, స్థానిక నిర్మాణాలను కాపాడుకుంటూనే ఈ కర్తవ్య సాధనకోసం మొక్కవోని ధైర్య సాహసాలతో కృషి చేద్దాం. భారత విప్లవోద్యమాన్ని పురోగమింపచేద్దాం.

**కేంద్ర కమిటీ,**

**భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)**

**7.6.2025.**

# చుట్టివేత-అణచివేత - దానికి ప్రతిగా కేంపెయిన్లు

# చైనా అంతర్యుద్ధం యొక్క ప్రధాన గమనరీతి

- కామ్రేడ్ మావో

మన గెరిల్లా యుద్ధం ప్రారంభమైన గత పది సంవత్సరాల కాలంలోనూ ప్రతి ఒక్క గెరిల్లా దళం, ప్రతి ఒక్క ఎర్రసైన్యం యూనిట్ ప్రతి ఒక్క విప్లవ స్థావరం శత్రువు నిరంతరమూ అవలంబించుతున్న 'చుట్టివేత-అణచివేత' మిలిటరి చర్యలకు గురవుతూ వచ్చాయి. శత్రు దృష్టిలో మన ఎర్రసైన్యం బ్రహ్మరాక్షసి. అందుకనే ఇది తలఎత్తిన వెంటనే, దానిని అణచివేయుటకు శత్రువు ప్రయత్నించుతూ వున్నాడు. ఎల్లపుడూ శత్రువు ఎర్రసైన్యాన్ని వెంటాడుతూనే వున్నాడు. దానిని చుట్టివేయుటకు ఎల్లప్పుడూ ప్రయత్నించుతూనే వున్నాడు. గత పది సంవత్సరాలలోనూ యుద్ధం యొక్క ఈ ప్రధాన విధానాలలో మార్పు రాలేదు. అంతర్యుద్ధం, జాతీయ యుద్ధంగా మారితే తప్ప. శత్రువు బలహీనపడేదాకా, ఎర్రసైన్యం శత్రువు కంటే బలమైన శక్తిగా తయారయ్యేదాకా యుద్ధం యొక్క ఈ రూపంలో మార్పు వుండదు.

శత్రువు అవలంబించుతున్న ''చుట్టివేత-అణచివేత'' మిలిటరి విధానానికి వ్యతిరేకంగా తీసుకునే మిలిటరి చర్యలే ఎర్రసైన్యం మిలిటరి విధానంగా తయారయింది. మనకు విజయమంటే, ప్రధానంగా శత్రువు అవలంభించే ''చుట్టివేత-అణచివేత'' మిలిటరి విధానాన్ని ఓడించడమన్న మాట. అంటే వ్యూహాత్మక విజయం. ప్రత్యేకంగా తీసుకునే మిలిటరి చర్యల్లో విజయం. శత్రువు యొక్క ''చుట్టివేత-అణచివేత'' విధానాన్ని ఎదిరించే మన మిలిటరి విధానం, అనేక చిన్న, పెద్ద మిలిటరి ఘర్షణల ద్వారా కొనసాగవలసి వుంటుంది. అనేక మిలిటరి ఘర్షణలలో విజయాలు సాధించినప్పటికీ, శత్రువు యొక్క ''చుట్టివేత-అణచివేత'' పథకం పూర్తిగా నిర్మూలించే వరకూ అందులో వ్యూహాత్మక విజయం సాధించినట్లుగా భావించరాదు. ఎర్రసైన్యం యొక్క గత పది సంవత్సరాల యుద్ధ చరిత్ర అంతా శత్రువు యొక్క ''చుట్టివేత-అణచివేత'' మిలిటరి పథకానికి వ్యతిరేకంగా జరిపిన మిలిటరి చర్యల చరిత్ర మాత్రమే.

శత్రువు యొక్క ''చుట్టివేత-అణచివేత'' కాంపెయిన్ లలో గాని లేక, దానికి ప్రతిగా మనం జరిపిన ఎదురు కాంపెయిన్లలో గాని శత్రువుపై దాడి, శత్రువు నుండి ఆత్మరక్షణ అను ఈ రెండు పోరాట రూపాలు అవలంబించబడినవి. ఇందులో పురాతనమైన లేక, ఆదునికమైన చైనాలో గాని యితర దేశాలలో గాని జరిగిన ఏ యుద్ధానికీ దీనికీ తేడా లేదు. అయినా చైనా అంతర్యుద్ధం యొక్క ప్రత్యేక లక్షణం ఏమిటంటే, ఈ రెండు పోరాట రూపాలు అనేక సార్లు మార్చి మార్చి ఉపయోగించబడుతున్నాయి. శత్రువు యొక్క ప్రతీ ''చుట్టివేత-అణచివేత''కాంపెయిన్ లోనూ శత్రువు మనపై దాడిచేస్తే ఎర్రసైన్యం ఆత్మరక్షణ చేసుకుంటుంది. శత్రువు దాడి విధానానికి వ్యతిరేకంగా ఎర్రసైన్యం ఆత్మరక్షణ విధానం అవలంబించుతూ వుంది. శత్రువు ''చుట్టివేత-అణచివేత''కు వ్యతిరేకంగా మనం ప్రతిగా చేసే కాంపెయిన్ యొక్క మొదటి దశ ఇది. తర్వాత ఎర్రసైన్యం ప్రారంభించే ఎదురుదాడి విధానానికి వ్యతిరేకంగా, శత్రువు ఆత్మరక్షణ విధానం అవలంభిస్తాడు. శత్రువు పథకానికి ప్రతిగా మనం జరిపే మన కాంపెయిన్లలో రెండవ దశ ఇది. ప్రతి ''చుట్టివేత-అణచివేత'' లోనూ రెండు దశలూ వుంటాయి. దాడి, ఆత్మరక్షణ దీర్ఘకాలం ఒకదాని తర్వాత మరొకటి ఉపయోగించబడుతూ వుంటుంది.

దీర్ఘకాలం ఈ పోరాట రూపాలు ఒకదాని తర్వాత మరొకటి ఉపయోగించబడుతూ వుంటుందంటే దాని అర్థం, ఈ యుద్ధ విధానం, ఈ పోరాట రూపాలు, పదే పదే ఉపయోగించబడుతూ వుంటాయన్నమాట. ఇది ప్రతి ఒక్కరికి తెలిసిన విషయం. శత్రువు యొక్క ''చుట్టివేత-అణచివేత'' మిలిటరి పథకం — దానికి వ్యతిరేకంగా మన మిలిటరి పథకం — ఈ యుద్ధం యొక్క, ప్రధాన పోరాట విధానం ఇది. ఈ పోరాట యొక్క మొదట దశలో శత్రువు మనపై దాడి సాగిస్తే మనం ఆత్మరక్షణ చేసుకుంటాం. రెండవ దశలో మనం ఎదురు దాడులు సాగిస్తే శత్రువు ఆత్మరక్షణ చేసుకుంటాడు.

ఇందుకు గాను సాగే ప్రతి యొక్క యుద్ధంలో పై రెండు పోరాట రూపాలు పదేపదే ఉపయోగించబడుతూ వున్నప్పటికీ, ప్రతిదఫా కొన్ని తేడాలతో ఈ పోరాట రూపాలు ప్రయోగించబడుతూ వుంటాయి. ఇది కూడా ప్రతి ఒక్కరికీ తెలిసిన విషయమే. ప్రతి శత్రువు మిలిటరి పథకంలోనూ, దానికి ప్రతిగా మనం సాగించే మిలిటరి పథకంలోనూ, యుద్ధం పెద్దదవుతూ పరిస్థితి క్లిష్ట రూపం తీసుకొంటూ వుంది. యుద్ధ తీవ్రత పెరుగుతూ వుంటుంది.

దీనర్థం యుద్ధంలో ఎగుడు దిగుడు లుండవనికాదు. శత్రువు యొక్క ఐదవ ''చుట్టివేత-అణచివేత'' మిలిటరి పథకం తర్వాత ఎర్రసైన్యం పెద్దగా బలహీనపడింది. దక్షిణాన వున్న మన మిలిటరి స్థావరాల నన్నింటిని మనం కోల్పోయాం. మన స్థావరాలన్నీ వాయువ్య మూలకు మార్చుకున్న తర్వాత, దక్షిణాన మనం సాగించగలినట్లుగా, అంతరంగిక శత్రువు యొక్క కీలక స్థావరాలను

ప్రమాద స్థితిలో పెట్టలేకపోతున్నాం. అందువల్ల శత్రువు ''చుట్టివేత-అణచివేత'' మిలిటరి పథకం యొక్క తీవ్రత తగ్గింది. పరిస్థితి క్లిష్టత తగ్గింది. పోరాట తీవ్రత తగ్గింది.

ఎర్రసైన్యానికి ఓటమి అంటే అర్థం ఏమిటి? వ్యూహాత్మకంగా చెప్పాలంటే శత్రువు చుట్టివేత-అణచివేత' మిలిటరి పథకానికి వ్యతిరేకంగా మనం అమలు జరిపూ మిలిటరి పథకం సంపూర్ధంగా ఓడిపోయినపుడే, ఎర్రసైన్యం ఓడిపోయినట్లు అర్థం. అప్పుడు కూడా ఆ ఓటమి పాక్షికమైనది. తాత్కాలికమైనది. ఎర్ర సంపూర్ణంగా ఓడించబడినట్లు అర్థం. అయితే ఇది ఎపుడూ సంభవించలేదు. విస్తృతమైన విప్లవ స్థావరాలు పోగొట్టుకోవడం, ఎర్రసైన్యం స్థావరం మార్చుకోవలసి రావటం, తాత్కాలికమైన, పాక్షికమైన ఓటమి మాత్రమే. ఇది సంపూర్ణమైన ఓటమి ఎంత మాత్రం కాదు. విప్లవ స్థావరాల్లో ఎర్రసైన్యంలో, పార్టీ సభ్యత్వంలో, 90 శాతం పోగొట్టుకున్నప్పటికి, ఆ ఓటమి సంపూర్ణమైన ఓటమి ఎంత మాత్రం కాదు. అది తాత్కాలికమైన, పాక్షికమైన ఓటమి మాత్రమే. ఇలా మార్చుకోవటమనేది మన ఆత్మరక్షణ విధానం యొక్క కొనసాగింపు అంటాం. శత్రువుకు మనను తరుముకురావటం, వాడి దాడి కొనసాగింపు అని పిలుస్తాం. దానర్థం శత్రువు 'చుట్టివేత-అణచివేత' మిలిటరి పథకానికీ, దానికి వ్యతిరేకంగా మనం ప్రయోగించిన మిలిటరి పథకానికీ మధ్య సాగిన యుద్ధంలో, శత్రుదాడి ముందు మన ఆత్మరక్షణ విధానం భగ్నమైంది. మనం ఆత్మరక్షణ స్థితి నుండి, ఎదురుదాడి స్థితికి చేరుకోలేక పోయామన్న మాట. అందువల్ల మనం ఆత్మరక్షణ స్థితినుండి తిరోగమన మార్గం చేపట్టాం. శత్రువు దాడి స్థితి నుండి మనల్ని వెంటాడే స్థాయికి చేరుకొన్నాడు. అయితే ఎర్రసైన్యం తన స్థావరాన్ని నూతన ప్రాంతానికి మార్చుకున్నప్పుడు, ఉదా : కియాంగ్సీ, ఇతర రాష్ట్రాల నుండి షెన్సీ ప్రాంతానికి మార్చుకున్నప్పుడు, శత్రువు ''చుట్టివేత-అణచివేత'' పథకాన్ని తిరిగి ప్రారంభించాడు. అందువల్లే ఎర్రసైన్యం యొక్క వ్యూహాత్మక తిరోగమనం (దీర్ఘయాత్ర) వ్యూహాత్మక ఆత్మరక్షణ విధానం యొక్క కొనసాగింపు మాత్రమేనని, శత్రువు వెంటాడే పథకం యొక్క, వ్యూహాత్మక దాడి యొక్క కొనసాగింపు మాత్రమేనని మనం చెప్పగలుగుతున్నాం.

యుద్ధాలలో, ఆధునిక యుద్ధాలలో గాని, ప్రాచీన యుద్ధాల్లో గాని, చైనాలో గాని, విదేశాల్లో గాని జరిగినట్లుగానే చైనా అంతర్యుద్ధంలో కూడా శత్రువుపై దాడి, శత్రువు నుండి ఆత్మరక్షణ అనే రెండు పోరాట రూపాలు మాత్రమే వున్నాయి. చైనా అంతర్యుద్ధం యొక్క ప్రత్యేక లక్షణమేమంటే, శత్రువు ''చుట్టివేత-అణచివేత'' మిలిటరి పథకం, దానికి వ్యతిరేకంగా మన మిలిటరి పథకం కలిపి దీర్ఘకాలంగా కొనసాగుతూ, దీనితో పాటు శత్రువుపై దాడి, శత్రువు నుండి ఆత్మరక్షణ ఈ రెండు ప్రాథమిక పోరాట రూపాలు, దీర్ఘకాలం పదే పదే మారుతూ వుండటం. పదివేల కిలో మీటర్లకు పైగా కదిలి (దీర్ఘయాత్ర) విప్లవస్థావరం మార్చుకోవటమనేది ఇందులో ఒక భాగంగా జరిగింది. అది వ్యూహాత్మకమైన మార్పు విషయం గుర్తుంచుకోవాలి.

శత్రువు యొక్క ఓటమి అంటే కూడా ఇదే అర్థం. శత్రువు ''చుట్టివేత-అణచివేత'' మిలిటరి పథకం ఓడిపోయినపుడు, మనం ఆత్మరక్షణ విధానం నుండి దాడి చెయ్యగలిగిన స్థితికి వచ్చునపుడు, శత్రువు ఆత్మరక్షణ విధానం చేపట్టవలసిన స్థితి ఏర్పడినపుడు, శత్రువు మరొక ''చుట్టివేత-అణచివేత'' పథకం కొరకు పునర్నిర్మాణం చేసుకోవలసిన స్థితి ఏర్పడినప్పుడు మాత్రమే శత్రువు వ్యూహాత్మకంగా ఓడిపోయినాడని చెప్పగలుగుతాం. మనం చేసినట్లుగా శత్రువు పదివేల కిలోమీటర్లకు పైగా తన స్థానాన్ని మార్చుకోవలసిన అవసరం లేదు. శత్రువు మనకంటే ఎక్కువ బలంగా వుండటం వలన, దేశమంతటా శత్రుపాలన వుండటం వలన శత్రువుకు అలాంటి అవసరం లేదు. అయితే శత్రువు తన బలాలను పాక్షికంగా మాత్రం మార్చుకోవలసి వచ్చింది. కొన్ని సందర్భాలలో విముక్తి ప్రాంతాలలో అక్కడక్కడా మిగిలి వున్న శత్రు స్థావరాలను మన ఎర్రసైన్యం చుట్టివేసినప్పుడు శత్రువు మనపై మరొక దాడికి సిద్ధం కావటానికి తన బలాలను తన పాలన క్రింది ప్రాంతంలోనికి తరలించుకోవలసి వచ్చింది. అంతర్యుద్ధం దీర్ఘకాలంగా సాగితే. ఎర్రసైన్యం విజయ పరంపరలు పెరిగితే, శత్రువుకు ఈలాంటి పరిస్థితి అనేకమార్లు ఏర్పడుతుంది. కాని ఎర్రసైన్యం సాధించిన మంచి ఫలితాలను శత్రుసైన్యం ఎప్పుడూ సాధించలేదు. శత్రు బలాలకు ప్రజాసహకారం లేకపోవటం వల్లనూ, శత్రు సైనికుల, ఆఫీసర్ల మధ్య ఐక్యత లేకపోవటం వల్లనూ, శత్రువు మంచి ఫలితాలు సాధించలేదు. ఎర్రసైన్యంలాగా శత్రువు కూడా దూరప్రాంతానికి తన స్థావరాన్ని మార్చుకుంటే, శత్రు నిర్మూలన తప్పదు.

1930 లో లీ-లీ-సాన్ పంథా అమలు జరిగింది. అపుడు అతడు చైనా అంతర్యుద్ధం యొక్క దీర్ఘకాల స్వభావాన్ని గుర్తించలేకపోయాడు. ఈ యుద్ధ సమయంలో శత్రువు ''చుట్టివేత-అణచివేత'' పథకాలు పదేపదే దీర్ఘకాలం అమలుజరుపుతాడనీ, అవి ఓడతాయనీ గుర్తించలేకపోయాడు. ఈ ఘటనలు హువాన్-కియాంగ్సి సరిహద్దు ప్రభుత్వ ప్రాంతంలో మూడు, ఫుకియేన్ ప్రాంతంలో రెండు జరిగి వున్నాయి. అందువల్ల స్వల్పకాలంలో విప్లవ విజయం సాధించాలనే ఆశతో బాల్యావస్థలో వున్న ఎర్రసైన్యానికి వ్యూహాన్ పట్టణాన్ని అక్రమించాలని, దానితో పాటు దేశ వ్యాపిత సాయుధ తిరుగుబాటు చేయాలని పిలుపిచ్చాడు — ఆ విధంగా ''అతివాద'' అవకాశవాద తప్పుడు పంథా అతడు చేపట్టాడు.

అదేవిధంగా 1931-34 లోని అతివాద అవకాశవాదులు కూడా శత్రువు ''చుట్టివేత-అణచివేత'' మిలిటరి పథకం పదే పదే ప్రయోగించబడుతుందనే సూత్రం గుర్తించలేదు. హుపే-హునాన్-అన్వీ సరిహద్దు వెంటవున్న విప్లవ స్థావరంలోని కొంతమంది బాధ్యత

కలిగిన కామ్రేడ్స్ ''సహాయక శక్తి సిద్ధాంతాన్ని'' ముందుకు తెచ్చారు. మూడవ ''చుట్టివేత-అణచివేత'' ఓడించబడిన తర్వాత కొమింగ్టాంగ్ సైన్యం కేవలం సహాయక శక్తిగా మాత్రమే మిగిలిపోయిందనీ, ఇక సామ్రాజ్యవాదులే స్వయంగా రంగం మీదకు వచ్చి ప్రధాన శక్తిగా ఎర్రసైన్యం మీద దాడి చెయ్యవలసి వుంటుందని వీరు భావించారు. ఈ అంచనాపూ ఆధారపడే ఎర్రసైన్యం వూహాన్ పట్టణంపై దాడి చేసే వ్యూహం పన్నారు. సూత్రానికి సంబంధించినంత వరకు వీరి అభిప్రాయాలు నాచాంగ్ పట్టణంపై ఎర్రసైన్యం దాడి చెయ్యాలని పిలుపిచ్చిన కియాంగ్సిలోని కామ్రేడ్స్ అభిప్రాయాలతో ఏకీభవించాయి. వీరు విప్లవ స్థావరాలను ఒకదానితో మరొకటి కలపాలనే పద్ధతికి వ్యతిరేకులు. విప్లవ స్థావరాలలోనికి శత్రువును ఆకర్షించాలనే ఎత్తుగడలను వీరు వ్యతిరేకించారు. ఒక రాష్ట్రంలోని ముఖ్యపట్టణాన్ని, ఇతర కీలక పట్టణాలను పట్టుకుంటే రాష్ట్రంలో విజయానికి నాంది ప్రస్తావన జరిగినట్లుగానే వీరు భావించారు. శత్రువు 5వ ''చుట్టివేత-అణచివేత'' మిలిటరి పథకానికి వ్యతిరేకంగా సాగిన మన పోరాటం, విప్లవానికి వలస వ్యవస్థకు మధ్య జరిగే నిర్ణయాత్మకమైన పోరాటంగా వీరు భావించారు. హుపే-హూనాన్-అన్వీ విప్లవ స్థావరంపై జరిగిన శత్రువు నాల్గవ ''చుట్టివేత-అణచివేత'' కు వ్యతిరేకంగానూ, కియాంగ్సి లోని కేంద్రప్రాంత విప్లవ స్థావరంపై జరిగిన శత్రువు 5వ ''చుట్టివేత-అణచివేత''కు వ్యతిరేకంగానూ మనం అమలు జరిపిన మిలటరి పథకాల తప్పుడు ఎత్తుగడలకు ఈ 'అతివాద' అవకాశవాద పంథాయే మూలం. ఇది భయంకరమైన శత్రు దాడుల వల్ల ఎర్రసైన్యాన్ని నిస్సహాయులుగా చేసింది. చైనా విప్లవానికి తీవ్రమైన నష్టాలను తెచ్చి పెట్టింది.

ఎర్రసైన్యం ఎలాంటి పరిస్థితుల్లో కూడా ఆత్మరక్షణ మిలిటరి పథకం అవలంబించకూడదనే వాదన, ఈ అతివాద అవకాశవాదం నుండి ఉద్భవించేనదే. ఇది శత్రువు ''చుట్టివేత-అణచివేత'' మిలిటరి పథకం పదే పదే ఉపయోగించబడుతుందనే విషయాన్ని తిరస్కరించింది. ఈ అభిప్రాయం కూడా సంపూర్ణంగా తప్పు.

ఒక విప్లవ కాని, విప్లవ యుద్ధంగాని ప్రధానంగా దాడి స్వభావం కలదనేది సరైనదే. విప్లవం గాని, విప్లవ యుద్ధంకాని పుట్టి, చిన్న శక్తి నుండి, పెద్ద శక్తిగా రూపొందవలసి వుంది. రాజకీయాధికారం లేని పరిస్థితి నుండి, రాకీయాధికారం చేపట్టాల్సిన వుంది. ఎర్రసైన్యం లేని పరిస్థితి నుండి ఎర్రసైన్యం సృష్టించుకోవలసి వుంది. విప్లవ స్థావరం లేని పరిస్థితి నుండి విప్లవ స్థావరం స్థాపించుకోవలసి వుంది. ఈ పరిస్థితి శత్రువుపై దాడి చేయడం ద్వారానే ఏర్పడుతుంది తప్ప వెనుకపట్టు పట్టే విధానం ద్వారా మాత్రం కాదు. అలాంటి వెనుకపట్టు పట్టే విధానాన్ని మనం వ్యతిరేకించాలి.

కనుక విప్లవం కాని, విప్లవ యుద్ధం కాని శత్రువుపై దాడి చేసే యుద్ధం. ఈ సూత్రం ఒక్కటే సంపూర్ణంగా సరైనది. అయితే అలాంటి యుద్ధంలో కూడా ఆత్మరక్షణ విధానం, తిరోగమన విధానాలు తప్పకుండా మిళితమై వుంటాయి. దాడి చేయటం కొరకు ఆత్మరక్షణ చేసుకోవాలి. పురోగమించుట కొరకు తిరోగమించాలి. ఎదురుగా శత్రువుపై దాడి చేయటానికి, శత్రువు పక్కలపై దాడి చేయాలి. సూటియైన బాటకు రావటం కొరకు చుట్టుబాటల ద్వారా రావాలి. ఇవన్నీ అనేక సందర్భాలలో ముఖ్యంగా మిలిటరి ఎత్తుగడలలో విధిగా అవలంభించవలసి వుంటుంది.

పైన చెప్పిన రెండు సూత్రాల విషయంలోనూ రాజకీయ రంగంలో మొదటిది సరైంది కావచ్చు. కాని ఆ సూత్రాన్నే మిలిటరి రంగానికి అన్వయించడం తప్పవుతుంది. రాజకీయ రంగంలో కూడా ఒక పరిస్థితిలో మాత్రమే (విప్లవం పురోగమించుతున్న సమయంలో) అది సరైంది. అయితే, మరొక పరిస్థితిలో అది తప్పవుతుంది: అంటే, విప్లవంలో తిరోగమించుతున్న సమయంలో (1906 రష్యా విప్లవం సాధారణ తిరోగమనంలో వున్నప్పుడు, 1927లో చైనాలో, లేక 1918 బ్రెస్ట్ విటోవస్కీ సంధి సమయంలో రష్యా విప్లవం తిరోగమనంలో వున్నప్పుడు) రెండవ సూత్రం మాత్రమే సంపూర్ణంగా సరైనది. వాస్తవమైనది. 1931-34 ''అతివాద'' అవకాశవాదం యాంత్రికంగా మిలిటరి రంగంలో ఆత్మరక్షణ విధానాలను వ్యతిరేకించింది. ఇదా బాత్యారిష్టంతో కూడిన ఆలోచన తప్ప మరొకటి కాదు.

శత్రువు ''చుట్టివేత-అణచివేత'' మిలిటరి పథకాల విధానం ఎప్పుడు ఆగిపోతుంది? నా అభిప్రాయం ప్రకారం, అంతర్యుద్ధం దీర్ఘకాలం కొనసాగితే, శత్రువు యొక్క, మన యొక్క బలాలలో ప్రాథమికమైన మార్పు వచ్చినప్పుడు, ఇది ఆగిపోతుంది. శత్రుసైన్యం కంటే మన ఎర్రసైన్యం బలమైనదిగా తయారవుతుంది, ఆగిపోతుంది. అపుడు మనం శత్రువు పైన ''చుట్టివేత-అణచివేత'' మిలిటరి పథకాలు అమలు జరుపుతూ వుంటాం, శత్రువు వీటి నుండి తట్టుకునే విధానాలు అవలంభించుతూ వుంటాడు. కాని, రాజకీయ, మిలిటరి కారణాల వల్ల ఈ లాంటి ఎత్తుగడల ద్వారా ఎర్రసైన్యం సాధించిన మంచి ఫలితాలు శత్రువు సాధించలేదు. ఆ స్థితికి వచ్చేటప్పటికి ''చుట్టివేత-అణచివేత'' మిలిటరి పథకాల ప్రయోగం పూర్తిగా కాకపోయినా, దాదాపు ఆగిపోతుందని ఖచ్చితంగా చెప్పవచ్చు.

**(నోట్ : ఈ వ్యాసం మావో రచనలు, మొదటి సంపుటిలోని అధ్యయనం నాలుగు లోనిది.)**

# కండరాల నొప్పి

**కండరాల నొప్పి, వాపు, అవయవాన్ని కదిలించలేకపోవడం.. దెబ్బతిన్న కండరం యొక్క ప్రధాన లక్షణాలు.**

ప్రతి క్షణం మన శరీరంలో ఏదో ఒక కండరం పని చేస్తూనే ఉంటుంది. మన శరీర కదలికలన్నీ కండరాల మీదే ఆధారపడి ఉంటాయి. కాబట్టి అవి మొండికేసినా, దెబ్బతిన్నా, క్షీణించినా నొప్పులు, అసౌకర్యాలు తప్పవు. కాబట్టి కండరాల మీద ఓ కన్నేసి ఉంచాలి.

మనకు తెలియకుండానే మనమెన్నో మార్గాల్లో కండరాలను ఇబ్బంది పెడుతూ వుంటాం. తప్పుడు కోణంలో చేతులను, కాళ్ళను వంచుతాం. అవసరానికి మించి కే అవయవ కండరాలను ఒత్తిడికి లోను చేస్తాం. అంతేకాదు, కండరాలను బలపరిచే ఆహారాన్ని నిర్లక్ష్యం చేస్తూ, కండరాల బలహీనత బారిన పడుతూ వుంటారు. ఫలితంగా నొప్పులు వేధించినా అవి స్వీయ తప్పదాలనే విషయాన్ని గ్రహించకుండా, అవే పొరపాట్లు మళ్లీ మళ్లీ చేస్తూ, అంతిమంగా వైద్యులను కలిసే పరిస్థితిలోకి నెట్టివేయబడతారు.

**కండరాల బలహీనతకు కారణం :**

సాధారణంగా 60 ఏళ్ల వయసులో కీళ్ల నొప్పులు మొదలవుతాయి. కానీ నేడు 40 ఏళ్లకే కీళ్ల నొప్పులు వేధిస్తున్నాయి. మెట్లు ఎక్కినా, కొద్ది దూరం నిడిచినా మోకాళ్లు నొప్పి పెడుతూ వుంటాయి. ఇందుకు కారణం మోకాళ్లలోని కండరాలు బలహీనపడడానికి అధిక బరువు, కండర బలహీనత, ఇండియన్ టాయలెట్స్ వాడకం ప్రధాన కారణాలు. సమస్య ఏ కారణంతో ముడిపడి వున్నప్పటికీ కండరాల నొప్పులు దరి చేరకుండా వుండాలంటే ఎత్తుకు తగిన బరువును కలిగి వుండాలి. భారతీయ మహిళలు సగటున 158 సెంటీ మీటర్ల ఎత్తు వుంటారు. కాబట్టి 58 నుంచి 60 కిలోల బరువు వుంటే సరిపోతుంది. పురుషులు 178 సెంటీమీటర్ల ఎత్తు వుంటారు కాబట్టి బరువు 72 కిలోలు వుంటే సరిపోతుంది. కానీ మన దేశంలో సగటున ప్రతి ఒక్కరూ ఐదారు కిలోలు అధిక బరువు కలిగి వుంటున్నారు.

**అధిక బరువు :** మన శరీరంలో ఒక కిలో ఎక్కువ బరువు పెరిగితే, శరీరం మీద రెండు కిలోల భారం పడుతుంది. కాబట్టి తప్పనిసరిగా ఎత్తుకు తగిన బరువు వుండేలా చూసుకోవాలి.

**వ్యాయామం :** రోజుకు కనీసం అరగంట పాటైనా వ్యాయామం చేయాలి. లేదంటే వారంలో నాలుగు రోజుల పాటు అరగంట బొప్పున వారం మొత్తంలో 150 నిమిషాలకు తగ్గకుండా చూసుకోవాలి.

**మెడనొప్పి వెనుక గల కారణాలు :**

విటమిన్ డి3 లోపం సర్వసాధారణమైపోయింది. దీంతో తలెత్తే ప్రధాన ఇబ్బంది మెడ నొప్పి. ప్రతి వందమందిలో 80 మందికి విటమిన్ డి3, 30 కంటే తక్కువగా వుంటోంది. విటమిన్ డి సమృద్ధిగా దొరికే పాల ఉత్పత్తులు, ఆకుకూరలు సరిపడా తీసుకోకపోవడం, సూర్యరశ్మికి బహిర్గతం అవకపోవడం వల్ల ఈ విటమిన్ లోపం ఎక్కువమందిని వేధిస్తూ వుంటుంది. ఇలాంటి వాళ్ళలో మెడ నొప్పితో పాటు, వీపు నొప్పి కూడా వుంటుంది. సమస్యను పరిష్కరించడం కోసం విటమిన్ డి3 సప్లిమెంట్లు తీసుకోవడంతో పాటు సూర్యరశ్మికి కూడా బహిర్గతమవుతూ వుండాలి. అలాగే ఆకుకూరలు, పాల ఉత్పత్తులు సరిపడా తీసుకోవాలి.

**డైటింగ్ తో... కండర నష్టం**

బరువు తగ్గడం కోసం పలురకాల డైట్స్ను అనుసరించడంలో భాగంగా తీసుకునే ఆహారంలో కోత విధిస్తే, కొవ్వుతో పాటు కండర నష్టం కూడా జరుగుతుంది. డైట్ చేశాం కాబట్టి బరువు తగ్గినట్టు భావిస్తూ వుంటారు. కానీ సరిపడా పోషకాలు అందక, కండరాలు కూడా నష్టపోతున్నామనే విషయాన్ని చాలా మంది గ్రహించరు. కండరాలు దృఢంగా వుండాలంటే సరిపడా పిండిపదార్థాలు, మాంసకృత్తులు, కొవ్వులు అవసరం. బరువు తగ్గే క్రమంలో కండరాలు వదులుగా మారి, సాగిపోతున్నట్టు తయారైతే, దాన్ని కండర నష్టంగానే పరిగణించాలి. సరిపడా పోషకాలు అందేలా ఆహార పరిమాణఆన్ని తగ్గించుకోగలిగితే, బరువు తగ్గడంతో పాటు కండర నష్టం జరగకుండా నియంత్రించుకోవచ్చు. అలాగే డైట్ చేస్తున్న వాళ్లు కండరాలు దృఢంగా వుండడం కోసం తప్పనిసరిగా వ్యాయామం చేయాలి.

**కండరాలు చిరిగితే?**

ముఖ్యంగా జిమ్ లో ప్రత్యేకించి భుజానికి సంబంధించిన వ్యాయామాలు చేసే వారిలో రొటేటర్ కఫ్ కండరం ఒత్తిడికి లోనవుతుంది. వ్యాయామం చేసే క్రమంలో తప్పుడు కోణంలో భుజాలను కదిలించినప్పుడు ఈ కండరం కందిపోవడం మొదలుపెడుతుంది. దాంతో విపరీతమైన నొప్పితో పాటు, భుజాన్ని పైకి లేపలేని పరిస్థితి తలెత్తుతుంది. కొన్ని సార్లు ఈ కండరం పాక్షికంగా లేదా పూర్తిగా చిరిగిపోతుంది. ఇలాంటి సందర్భాల్లో ఆలస్యం చేయకుండా వైద్యులను సంప్రతించాలి. ఎక్స్రే, ఎమ్మారైలతో ఈ చిరుగును వైద్యులు సులువుగా గుర్తించగలుగుతారు. సమస్య పాక్షికంగా వుంటే, విశ్రాంతితో సమస్య పరిష్కారమవుతుంది. ఒకవేళ చిరుగు ఎక్కువగా వుంటే, కీహోల్ సర్జరీ చేయవలసి వుంటుంది. ఈ సర్జరీతో సమస్య పూర్తిగా సర్దుకుంటుంది. వ్యాయామం మూలంగా

కండరాలు చిరిగిపోకుండా వుండాలంటే ఒకేసారి అధిక బరువులతో వ్యాయామం చేయకుండా బరువులను క్రమేపీ పెంచుకుంటూ పోవాలి. ఎక్కువ బరువులను బలవంతంగా వ్యాయామాలు చేయడానికి బదులు తక్కువ బరువులతో ఎక్కువ రిపిటీషన్స్ చేయాలి. ఇలాంటి వ్యాయామాలతో కండరాలు పెరుగుతాయి. దృఢంగా పెరుగుతాయి.

**కండరాలు ఆరోగ్యంగా వుండాలంటే...**

కండరాలు ఆరోగ్యంగా వుండాలంటే సరిపడా మాంసకృత్తులు తీసుకోవాలి. గుడ్డు తెల్లసొన, డ్రైఫ్రూట్స్, సలాడ్స్, మొలకలు క్రమం తప్పకుండా తింటూ వుండాలి. శాకాహారులు ప్రొటీన్ కోసం సోయా ఉత్పత్తులను ఎంచుకోవచ్చు. అలాగే విటమిన్ డి3, క్యాల్షియం శరీరానికి అవసరమైన ఖనిజలవణాలు కూడా సరిపడా అందేలా చూసుకుంటూ వుండాలి. మరీ ముఖ్యంగా ప్రొటీన్ ఎక్కువగా వుండే ఆహారానికి ప్రాధాన్యం ఇవ్వాలి. పరిమితంగా చేపలు తీసుకోవాలి. రెడ్ మీట్, మటన్ తగ్గించాలి. సోయా, పాల ఉత్పత్తులతో పాటు ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా నువ్వుల లడ్డు తింటూ వుండాలి. వీటితో సరిపడా క్యాల్షియం దక్కుతుంది. అలాగే మధ్యాహ్న భోజనంలో సలాడ్ తప్పనిసరిగా తినాలి. ఉదయం లేదా సాయంత్రం సెనగలు, పెసలు, బొబ్బర్లు... వీటిలో ఏదో ఒక మొలకలు తినాలి. వారంలో కనీసం నాలుగు సార్లు, 30 నుంచి 35 నిమిషాల పాటు లేదా వారం మొత్తంలో 150 నిమిషాలకు తగ్గకుండా వ్యాయామం చేయాలి.

క్యాల్షియం ఏఏ ఆహార పదార్థాల్లో దొరుకుతుందో తెలిసినా, వాటిని ఎంత పరిమాణంలో తింటే ఎంత క్యాల్షియం దక్కుతుందనే అవగాహన అందరికీ వుండదు. ఒక కప్పు పరిమాణంలోని భిన్నమైన పదార్థాల్లో ఎంత క్యాల్షియం వుంటుందో తెలుసుకుందాం.

| | |
|---|---|
| **రాగి** | **: 344 మిల్లీ గ్రాములు** |
| **మినుములు** | **: 124 మిల్లీ గ్రాములు** |
| **తోటకూర** | **: 500 మిల్లీ గ్రాములు** |
| **కరివేపాకు** | **: 830 మిల్లీ గ్రాములు** |
| **బాదం** | **: 230 మిల్లీ గ్రాములు** |
| **మునగాకు** | **: 440 మిల్లీ గ్రాములు** |
| **నువ్వులు** | **: 1450 మిల్లీ గ్రాములు** |
| **పెరుగు** | **: 150 మిల్లీ గ్రాములు** |
| **అటుకులు** | **: 238 మిల్లీ గ్రాములు** |

కండరాలు శ్రమకు, ఒత్తిడికీ లోనైనప్పుడు అసౌకర్యం, నొప్పులు మొదలవుతాయి. ఆయా కండరాలకు 72 గంటల పాటు విశ్రాంతిని ఇచ్చినప్పుడు అవి పూర్తిగా కోలుకుంటాయి. కానీ చాలా మంది ఉపశమనం కోసం నూనెలతో మర్దనలు మొదలు పెట్టేస్తారు. ఇలా చేయడం వల్ల కండరం మరింత ఒత్తిడికి లోనవుతుంది. కాబట్టి విశ్రాంతి, చల్లనీటి కాపడం, అవయవాన్ని ఎత్తులో వుంచడం లాంటివి చేయాలి. వీటితో అలసిన కండరాలు స్వాంతన పొందుతాయి. ఒకవేళ అప్పటికీ నొప్పి అదుపులోకి రాకపోతే వైద్యులను కలవాలి.





**2025, సెప్టెంబర్ 11న ఛత్తీస్ ఘడ్ రాష్ట్రం, గరియాబంద్ జిల్లాలో జరిగిన శత్రువు దాడిలో అమరులైన కామ్రేడ్ మోడెం బాలకృష్ణ (మనోజ్) , ప్రమోద్, జాడి వెంకట్ లతో పాటు 10 మంది కామ్రేడ్స్ అమరులైనారు. అమరులకు జోహార్లు అర్పిద్దాం. వారి కలలను నిజం చేద్దాం.**

# పార్టీ కేంద్ర పత్రిక, రాజకీయ పాఠశాలల బాధ్యుడు, ఆంధ్రప్రదేశ్, ఏఓబీ ఉద్యమాల నాయకుడు కామ్రేడ్ గౌతంకు ఎర్రెర్ర జోహార్లు!

కామ్రేడ్ గౌతం 2025 జూనే 2వ తేదీ నుంచి 7వ తేదీ వరకు దండకారణ్యం స్పెషల్ జోన్ పశ్చిమ బస్తర్ డివిజన్ నేషనల్ పార్క్ ఏరియాలో జరిగిన ప్రభుత్వ సాయుధ బలగాల ఆపరేషన్ లో అమరులయ్యారు. ఆయనతో పాటు మరో ఐదుగురు పీఎల్ జీఏ కామ్రేడ్స్ అమరులయ్యారు. కామ్రేడ్ గౌతం గడచిన 43 సంవత్సరాలుగా విప్లవోద్యమంలో వివిధ రాష్ట్రాలు, స్పెషల్ జోన్ లలో, పార్టీ రాజకీయ బోధనా విభాగంలో, వివిధ రంగాలలో సేవలు అందించారు. కామ్రేడ్ గౌతం మధ్య రీజనల్ బ్యూరో క్రాంతి పత్రిక, రాజకీయ పాఠశాల రీపోస్ లకు బాధ్యులు.



కామ్రేడ్ గౌతం 1957 జూలై 4వ తేదీన ఆంధ్రప్రదేశ్ ఏలూరు జిల్లా పెదపాడు మండలం, సత్యవోలు గ్రామంలో మధ్య తరగతి కుటుంబంలో జన్మించారు. తల్లిదండ్రులకు ఆరుగురు సంతానంలో చివరివారు. ఆయన పేరు తెంటు లక్ష్మి నరసింహాచలం. ప్రాథమిక, సెకండరీ విద్య తరువాత బి.ఎస్సీ చేసారు. ఆ తరువాత పొరుగున ఉన్న కృష్ణా జిల్లా విజయవాడలో బీఏఎమ్ఎస్, ఆయుర్వేద వైద్యంలో డిగ్రీ కోర్సు చదివారు.

కామ్రేడ్ చారు మజుందార్ అమరత్వం తరువాత పార్టీ చీలికలకు గురి అయ్యి, 1977లో ఆత్మవిమర్శనా సమీక్ష చేసుకుని, కమ్యూనిస్టు విప్లవకారులు ఉద్యమాన్ని పునర్నిర్మిస్తున్న కాలం అది. నక్సల్బరీ, దాని వెన్నంటి శ్రీకాకుళం, ముషాహరి, బీర్ భూం, లఖింపూర్-ఖేరీలలో రైతాంగ పోరాట జ్వాలలు ఎగిసి, మార్క్సిజం-లెనినిజం-మావోయిజం రాజకీయాల శక్తిని నిరూపించాయి. ఈ పోరాటల ప్రభావం దేశవ్యాప్తంగా విద్యార్థి యువజనుల మీద చెరిగిపోకుండా ఉన్నది. చదువుకుంటున్న రోజులలో సాహిత్యంపై మక్కువ పెంచుకున్న కామ్రేడ్ చలం క్రమంగా ఈ రాజకీయల గురించి తెలుసుకోనారంభించారు. దేశం గురించి, ప్రజల విముక్తి గురించి ఆలోచించసాగారు. అదే సమయంలో ఉవ్వెత్తున ఎగిసిన సిరిసిల్లా-జగిత్యాల రైతాంగ పోరాటం పాలక వర్గాన్ని వణికిస్తే, విప్లవ ఆలోచనలు కలిగిన వారిలో విశ్వాసం కలిగించింది.

అటువంటి రాజకీయ వాతావరణం నెలకొని ఉన్న తరుణంలో, 1978లో డిగ్రీ చదువు ఆఖరు సమయంలో తాను చదువుతున్న కాలేజీలో జరిగిన సమ్మెలో ఆయనకు రాడికల్ విద్యార్థి సంఘం (ఆర్ఎస్ యూ) పరిచయం అయింది. కామ్రేడ్ చలం ఆలోచనలు స్పష్టమైన రూపం తీసుకోనారంభించాయి. ఆనాటి నుంచి ఆర్ఎస్ యూలో పని చేస్తూ వచ్చారు. ఆర్ఎస్ యూ చేపట్టిన వివిధ ప్రచార, ఆందోళనా కార్యక్రమాలలో పాలు పంచుకున్నారు. మార్క్సిజం-లెనినిజం-మావోయిజం రాజకీయాల కార్యాచరణను అర్థం చేసుకున్నారు. విప్లవ పార్టీ లేకుండా దేశ పీడిత ప్రజలను, జాతులను విముక్తి చేయజాలమని గ్రహించారు. పార్టీ రాజకీయాలను అధ్యయనం చేసారు. పార్టీ బాధ్యులతో చర్చించారు. ఈ క్రమంలో 1980లో పార్టీ సభ్యులయ్యారు. కామ్రేడ్ చలం రాజకీయ చైతన్యం ఆయనను సాధారణ జీవితానికి పరిమితం కానివ్వలేదు. ఒక ఆయుర్వేద డాక్టర్ గా జీవితం ప్రారంభించగలిగిన ఆయన విప్లవ మార్గాన్ని ఎంచుకున్నారు. 1982లో వృత్తి విప్లవకారునిగా రూపొందారు.

ఆనాటి భాకపా (మాలె)(పీపుల్స్ వార్) విద్యార్థి, యువజన సంఘాలను నిర్మించి, ప్రజలను పోరాటాలలో సమీకరించే కృషి చేస్తున్నది. రైతు కూలి సంఘం స్థాపనకు ఉపక్రమిస్తున్నది. కృష్ణా జిల్లాలో ఉద్యమాన్ని ముందుకు తీసుకువెళ్లడం కోసం పార్టీ కామ్రేడ్ చలంకు విజయవాడ సెంటర్ గా బాధ్యతలు అప్పగించింది. 1983లో విజయవాడ సీఓగా ఆనంద్ పేరుతో కామ్రేడ్ చలం తన పూర్తి కాల రాజకీయ కార్యాచరణ ప్రారంభించారు. విజయవాడలో సీపీఐ, సీపీఎంల ప్రభావం ఎక్కువగా ఉండేది. ఉమ్మడి పార్టీ సీపీఐ విజయవాడలో భూ ఆక్రమణ వంటి వివిధ పోరాటాలు చేపట్టి ఉన్నది. వివిధ కార్మిక రంగాలలో యూనియన్ లు స్థాపించి ఉన్నది. ఆ

పార్టీల రివిజనిజానికి వ్యతిరేకంగా సైద్ధాంతిక పోరాటం చేయకుండా ఆ ప్రాంతంలో కమ్యూనిస్టు విప్లవ రాజకీయాలను ముందుకు తీసుకువెళ్లడం అసాధ్యం. అందువల్ల పార్టీ ఈ సైద్ధాంతిక పోరాటం కొనసాగిస్తూనే, ప్రజలను సరైన రాజకీయాల వైపు నడిపించే కృషి చేసింది.

పార్టీ నాయకత్వంలో కామ్రేడ్ చలం విద్యార్థి, యువజన, గుడిసెవాసులను సంఘటితం చేసారు. 1980లో విజయవాడలో గుడిసెలలో జీవించే పేద ప్రజలకు ఇళ్ల కోసం పోరాటం నడిపించారు. 1983లో కృష్ణా జిల్లాలో లంకభూముల పోరాటానికి మార్గదర్శకత్వం అందించారు. విజయవాడ పట్టణంలో విప్లవ రాజకీయాలకు పరిచయం అయిన విద్యార్థి యువజనులను ఈ పోరాటంలో భాగం చేసి, వారు పునాది వర్గాల సామాజిక స్థితిని తెలుసుకునేందుకు, తద్వారా తమ రాజకీయ అవగాహనను పెంపొందించుకునేందుకు కృషి చేసారు. 1986లో జిల్లా ఆర్గనైజర్ గా బాధ్యతలు స్వీకరించారు. అదే సంవత్సరంలో మైలవరం గ్రామంలో మామిడితోట ఆక్రమణ పోరాటానికి మార్గదర్శకత్వం అందించారు. దాంతో పాటుగా సాహిత్య, కళా రంగాలలో కృషి చేసారు. ఈ క్రమంలో జిల్లా కమిటీ సభ్యునిగా ఎదిగారు. 1987లో ఆంధ్రప్రదేశ రాష్ట్ర మహాసభ మొదలుకుని అన్ని మహాసభల్లోనూ ప్రతినిధిగా పాలు పంచుకున్నారు. 1986లో కామ్రేడ్ బద్రిని వివాహం చేసుకున్నారు.

ఉద్యమం గుంటూరు, ప్రకాశం జిల్లాల బలపడింది. ఈ జిల్లాల ఉద్యమాలను సమన్వయంతో నడిపి ఈ ప్రాంత ఉద్యమ నిర్మాణాన్ని బలోపేతం చేసే లక్ష్యంతో పార్టీ రీజనల్ కమిటీ ఏర్పరచింది. సైద్ధాంతిక, రాజకీయ అవగాహనతో వివిధ రంగాలకు, ప్రజా సంఘాలకు, పోరాటాలకు మార్గదర్శకత్వం అందిస్తూ కామ్రేడ్ గౌతం 1989 నాటికి ఈ రీజనల్ కమిటీలో భాగమయ్యారు. గుంటూరు జిల్లాలో దేవుడు మాన్యం భూముల పోరాటం, గిట్టుబాటు ధరల కోసం పోరాటాలకు మార్గదర్శకత్వం వహించారు. నల్లమలలో వెదురు కూలి రేట్ల పెంపు కోసం పోరాటం నిర్వహించారు. 1992లో నల్లమల డివిజన్ కార్యదర్శి బాధ్యతలు చేపట్టారు.

ఈ కాలంలో 1994లో అరెస్టయ్యారు. రెండు సంవత్సరాల పాటు రాజమండ్రి, నెల్లూరు సెంట్రల్ జైళ్లలో ఉన్నారు. 1994-95 సంవత్సరాలలో ఆంధ్రప్రదేశ్ లో చారిత్రాత్మక జైలు పోరాటం జరిగింది. ఈ పోరాటంలో భాగంగా 12 రోజుల పాటు జరిగిన అమరణ నిరాహార దీక్షలో పాల్గొన్నారు. జైలు సమన్వయంలో భాగంగా ఉన్నారు. బెయిలుపై విడుదల అయిన తరువాత తిరిగి రహస్య జీవితానికి వెళ్లారు. 1996 చివరి నుంచి నల్లమలలో 6 నెలలు ఉన్నారు.

1997లో జాయింట్ రీజనల్ కమిటీ (జేఆర్ సీ) సభ్యునిగా గుంటూరు జిల్లా బాధ్యతలు నిర్వహించారు. అదే కాలంలో ఏర్పడిన సౌత్ కోస్టల్ బెల్ట్ కమిటీ (ఎస్ సీబీసీ) బాధ్యతలు, కొన్ని ప్రజా సంఘాల బాధ్యతలు చేపట్టారు. 2000లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మహాసభలో ప్రతినిధిగా పాలు పంచుకున్నారు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నిర్బంధం తీవ్రతరం అయింది. ఈ క్రమంలో 1991లో నల్లమలలోను, 1992లో వెలుగొండలోను, 1993లో భైరవకోనలలో ఎదురుకాల్పులు జరిగినప్పుడు కామ్రేడ్ ఆనంద్ శత్రువుతో పోరాడుతూ తప్పుకున్నారు. ఆంధ్రప్రదేశ్ లో పని చేస్తున్న కాలంలో ఒక మనీ ఏక్షన్ లో కరువు దాడులలో, భూస్వాములపై చేసిన దాడులలో పాలు పంచుకున్నారు.

2001లో జరిగిన భాకపా (మాలె)(పీపుల్స్ వార్) 9వ కాంగ్రెస్ లో ప్రతినిధిగా పాలు పంచుకున్నారు. ఈ మహాసభ తరువాత పార్టీ ఆయనను నూతనంగా ఏర్పడిన ఆంధ్ర-ఒడిశా స్పెషల్ గెరిల్లా జోన్ కు బదిలీ చేసింది. ఆనాటి నుంచి ఏఓబీ జోన్ లో ప్రజా సంఘాల, ప్రజా రాజ్యాధికార అంగాల నిర్మాణంలో, సైనిక చర్యలలో పథక రచనలోను, నిర్వహణలోనూ భాగమయ్యారు. 2005లో కోరుకొండలో ఎదురుకాల్పుల నుంచి తప్పించుకున్నారు. 2006లో విజయనగరం జిల్లాలో మిత్రులను కలిసేందుకు వెళ్లినప్పుడు, సమాచారం తెలుసుకుని శత్రువు ఆయనను ప్రాణాలతో పట్టుకునేందుకు ప్రయత్నించాడు. హఠాత్తుగా చుట్టుముడుతున్న శత్రు బలగాలను గమనించి, ఒక్క ఉదుటున లేచి, తన తుపాకిని పట్టుకోబోతున్న పోలీసులతో పోరాడి, కాల్పులు జరుపుతూ తప్పించుకున్నారు.

2008 వరకు కామ్రేడ్ సుధాకర్ పేరుతో ఏఓబీలో పని చేసారు. ఈ సమయంలో 2004లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వంతో పార్టీ జరిపిన చర్చలలో అమరుడు కామ్రేడ్ రామకృష్ణ (సాకేత్) నాయకత్వంలో ఏర్పడిన బృందంలో ఏఓబీ ప్రతినిధిగా పాలు పంచుకున్నారు.

ఉద్యమ అవసరాల రీత్యా పార్టీ కామ్రేడ్ సుధాకర్ ను 2008లో సీఆర్ బీ పత్రిక క్రాంతి బాధ్యతలలోకి బదిలీ చేసింది. 2009 నుంచి రీపోస్ బాధ్యతలు కూడా అప్పజెప్పింది. 2013 వరకు ఏఓబీ, దండకారణ్యంలలో విస్తృతంగా పర్యటిస్తూ సీఆర్ బీ మార్గదర్శకత్వంలో ఈ బాధ్యతలు నిర్వహించారు. క్రాంతి పత్రికను క్రమం తప్పకుండా నడిపారు. కేడర్ లకు రాజకీయ తరగతులు బోధించారు. గౌతందాగా కేడర్ లకు సన్నిహితం అయ్యారు. అమరులయ్యే వరకు కామ్రేడ్ గౌతం క్రాంతి, రీపోస్ బాధ్యతలలో కొనసాగారు. ఆపరేషన్ కగార్ లో కష్టనష్టాలకు వెరవకుండా ఈ బాధ్యతలను కొనసాగించారు. కామ్రేడ్ గౌతం దృఢ సంకల్పం, రాజకీయ అవగాహనా ఆయన అమరత్వం అనంతరం కూడా కేడర్ లకు రాజకీయాలు బోధిస్తూనే ఉంటాయి, ఆదర్శంగా నిలుస్తాయి.

ఇదే ఆపరేషన్ లో మరో ఘటనలో తెలంగాణా రాష్ట్ర కమిటీ సభ్యులు కామ్రేడ్ భాస్కర్ ఆయనతో పాటు ఒక పీఎల్ జీఏ సభ్యుడు అమరులయ్యారు.

కామ్రేడ్ గౌతందాకు విప్లవ జోహార్లు!

కామ్రేడ్ గౌతందా ఆశయాలను కొనసాగిద్దాం!

# తెలంగాణ ప్రాంత ఉద్యమ నాయకుడు,

# తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యుడు కామ్రేడ్ భాస్కర్ కు విప్లవ జోహార్లు.

భారతీయ జనతా పార్టీ హిందుత్వ ఫాసిస్టు ప్రభుత్వం 2026 మార్చి నాటికి సీ.పీ.ఐ. (మావోయిస్టు) పార్టీని నిర్మూలిస్తానని 2024 జనవరి నుండి ఆపరేషన్ కగార్ పేరుతో దేశంలోని మావోయిస్టు ప్రాంతాలన్నింటిలో తీవ్ర నిర్బంధాన్ని కొనసాగిస్తూ నరసంహరాలను కావిస్తున్నది. అటవీ సంపదలను, ఖనిజ సంపదలను కార్పొరేట్ శక్తులకు అప్పగించే ఏకైక లక్ష్యంతో అటవీ ప్రాంతంలోని ఆదివాసీలకు అండగా వుండే మావోయిస్టు పార్టీపై వరుసగా దాడులు చేస్తూ 550 మందికి పైగా హత్యలు చేసింది. మే 21 నాడు మాడ్ ప్రాంతంలో మావోయిస్టు పార్టీ జనరల్ సెక్రటరీ కామ్రేడ్ నంబాల కేసవరావుతో సహ 28 మంది కామ్రేడ్స్ ను పొట్టన పెట్టుకున్నది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జూన్ 3వ నుండి 9వ తేదీ వరకు బీజాపూర్ జిల్లా నేషనల్ పార్క్ లో మరొక చుట్టివేత దాడిని ఏరియా డామినేషన్ చేస్తూ వేల సంఖ్యలో బలగాలు దాడి పథకంతో నిర్వహించిన అభియాన్ లో హోరాహోరిగా పోరాడుతూ కామ్రేడ్ భాస్కర్ తో పాటు ఈ పోలీసు ఆపరేషన్ లో కామ్రేడ్ గౌతం, కామ్రేడ్ రైనీ, కామ్రేడ్ సంతోష్ (భాస్కర్ గార్డు), కామ్రేడ్ రజిని, కామ్రేడ్ లాల్సు, కుడియం మహేష్ (ఇర్పగుట్ట గ్రామస్తుడు) లు అమరులయినారు. కామ్రేడ్ భాస్కర్ గెరిల్లా దళ సభ్యునిగా, దళ కమాండర్ గా, పీ.ఎల్ కమాండర్ గా, జిల్లా కమిటీ సభ్యునిగా, జిల్లా కమిటీ కార్యదర్శిగా, తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యునిగా 35 సంవత్సరాల కాలం విప్లవోద్యమ బాధ్యతలు నిర్వహిస్తూ అమరుడు అయినాడు. కామ్రేడ్ భాస్కర్ కు విప్లవ నివాళ్లు అర్పిద్దాం. అమరుల ఆశయ సాధనకై తెగించి పోరాడుదాం.



**కామ్రేడ్ మైలారపు అడెల్లు కుటుంబ నేపథ్యం :**

కామ్రేడ్ భాస్కర్ (మైలారపు అడెల్లు) 55 సంవత్సరాల క్రితం ఆదిలాబాద్ జిల్లా, బోథ్ మండలం, పొచ్చెర గ్రామంలో పేద దళిత కుటుంబంలో పుట్టాడు. తల్లి పోషవ్వ, తండ్రి పోతన్నలకు నాలుగురు సంతానంలో కామ్రేడ్ భాస్కర్ చిన్నవాడు. పొచ్చెర గ్రామంలో అన్ని రకాల కులాల వాళ్లు వున్నారు. గ్రామంలో రెడ్డి భూస్వాముల ప్రాబల్యం ఎక్కువ. కామ్రేడ్ అడెల్లు బోథ్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి వరకు చదుకున్నాడు. గ్రామంలో చిన్నప్పటీ నుండి అంటరానితనాన్ని చూస్తూ పెరిగాడు. పేద దళిత కుటుంబం నేపథ్యం నుండి పెరుగుతూ గ్రామంలో వ్యవసాయ కూలి పనులు చేస్తూ విద్యను అభ్యసించాడు.

బోథ్ ప్రాంతంలో కొనసాగుతున్న భూస్వామ్య వ్యతిరేక భూ పోరాటాలు కామ్రేడ్ మైలారపు అడెల్లును చైతన్యవంతంగా ఆలోచించేలా పురిగొల్పాయి. నిర్మల్ జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ పూర్తి చేశాడు. నిర్మల్ లో డిగ్రీ చదువుతున్న క్రమంలో రాజకీయ సిద్ధాంతాలను అర్థం చేసుకొని రాడికల్ స్టూడెంట్ యూనియన్ (ఆర్.ఎస్.యు) లో చేరాడు. ఆర్.ఎస్.యు లో చురుగ్గా పని చేశాడు. వర్గ పోరాటాల ప్రభావంతో ఉత్తేజం పొందిన కామ్రేడ్ అడెల్లు 1989 నుండి గ్రామ రైతుకూలి సంఘం, యువజన సంఘాలతో సంబంధాలను కొనసాగించాడు. గ్రామ ఆర్.వై.ఎల్. లో సభ్యుడుగా పని చేస్తూ 1990లో పూర్తికాలం కార్యకర్తగా పార్టీలోకి భర్తీ అయ్యాడు. కామ్రేడ్ క్రాంతి పేరు పెట్టుకున్నాడు. అమరుడు కామ్రేడ్

సూర్యం (డీవీసీ సెక్రటరి)తో దగ్గరి సంబంధాలను కలిగి వున్నాడు. 1990 ఎన్.టీ. రామారావు (టీ.డీ.పీ) ఓడిపోయి చెన్నారెడ్డి (కాంగ్రెస్) ప్రభుత్వం అధికారంలోకి వచ్చి, చర్చల వాతావరణం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో ఏర్పడింది. ఆదిలాబాద్ జిల్లాలో 1990-91 మధ్య భూస్వాముల పట్టా భూములు అక్రమణ పోరాటాలు పెద్ద ఎత్తున జరిగాయి. బోథ్, ఆదిలాబాద్, ఇచ్చోడ, వాంకిడి, అసిఫాబాద్, సిర్పూర్, చెన్నూర్ ప్రాంతాలలో 100 గ్రామాలలో 200 మందికి పైగా భూస్వాముల నుంచి 9,250 ఎకరాల భూములను వేలాది మంది ఆదివాసీ, గైరాదివాసీ ప్రజలు పార్టీ నాయకత్వంలో ఉవ్వెత్తున కదిలి ఎక్కడికక్కడ అక్రమించుకొని పంపిణీ చేసుకున్నారు. కామ్రేడ్ మైలారపు అడెల్లు (క్రాంతి, భాస్కర్) గ్రామంలో కడెం నారాయణ రెడ్డి, ఇతర భూస్వాముల భూములను ప్రజలు అక్రమిచుంకున్నారు. ఈ క్రమంలో పోలీసులు వచ్చి అక్రమించుకున్న గ్రామ ప్రజలపై లాఠీ చార్జి చేసి బాష్పవాయు గోళాలను విడిచిపెట్టారు. ఈ ప్రాంతంలో ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది. ఈ పోరాటంలో కామ్రేడ్ అడెల్లు ప్రత్యేక్షంగా పాల్గొన్నాడు. నిర్బంధం పెరిగిన క్రమంలో పూర్తికాలం కార్యకర్తగా కామ్రేడ్ క్రాంతి పేరుతో పని చేయపూనుకున్నాడు.

**రాడికల్ విద్యార్థి సంఘం నుండి ఆదివాసీ రైతాంగ యోధుడిగా :**

60, 70 దశకాల్లో వర్గపోరాట ప్రకంపనలు భారతదేశ సమాజంలో పుట్టి దేశంలోని యువత, విద్యార్థులపై తీవ్రమైన విప్లవ ప్రభావాన్ని వేసాయి. నక్సల్బరీ, శ్రీకాకుళ ఉద్యమాలు సెట్ బ్యాక్ తరువాత తెలంగాణ ప్రాంతంలోని కరీంనగర్, ఆదిలాబాద్ రైతాంగ ఉద్యమాలు ముందుకు వచ్చాయి. జగిత్యాల, ఇంద్రవెల్లి పోరాటాల ప్రభావం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లోని విద్యార్థి, యువజనుల మీద తీవ్ర ప్రభావం పడింది. 80, 90వ దశకంలో యువకులు, విద్యార్థులు విప్లవోద్యమంలో చేరడం వెల్లువలా సాగింది. 1990 చెన్నారెడ్డి ప్రభుత్వం-చర్చల కాలంలో పెద్ద ఎత్తున వందలాది మంది యువతీ, యువకులు విప్లవోద్యమంలోకి వచ్చారు. బోథ్ ప్రాంతం నుండి కామ్రేడ్ అడెల్లు (క్రాంతి)ను చూసి అనేక మంది యువకులు అనుసరించేవారు. ఎలాంటి శషబిషలు లేకుండా ఇల్లు, చదువు విడిచిపెట్టి అమరుడు సూర్యం (పండరి)ను ఆదర్శంగా తీసుకొని విప్లవోద్యమంలో పూర్తికాలం పని చేయడానికి ముందుకు వచ్చాడు. 1990 నుండి రైతాంగ ఉద్యమంలో పాల్గొంటూ గత 35 సంవత్సరాలుగా విప్లవోద్యమాన్ని విడనాడకుండ దళ సభ్యుడు నుండి తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యుడు వరకు విప్లవోద్యమంలో తన వంతు కృషి చేశాడు.

**వర్గ పోరాట కొలిమిలో రాటు దేలిన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఉద్యమనేత :**

1990 ప్రారంభం నుండి కామ్రేడ్ అడేల్లు క్రాంతి పేరుతో బోథ్, సారంగాపూర్ ప్రాంతంలో పీఆర్ వెంబడి వుంటూ పని చేసాడు. ధనోరా, సారంగాపూర్, పట్నాపూర్, తేజాపూర్, అజ్జర లోజ్జర, దేడ్రా గ్రామాలలో తిరుగుతూ ప్రజలతో దగ్గరి సంబంధాలను కొనసాగించాడు. అక్రమించిన భూములను సాగు చేయించడానికి తీవ్ర కృషి చేసాడు. ప్రజల మధ్య వచ్చే సమస్యలను సామరస్యంగా పరిష్కరిస్తూ క్రమంగా అభివృద్ధి అయ్యాడు. ఈ క్రమంలోనే గోండి భాషను నేర్చుకున్నాడు. 1991లో పార్టీ సభ్యత్వం పొందాడు.

కామ్రేడ్ క్రాంతి క్రమశిక్షణ, పట్టుదలను చూసి జిల్లా కమిటీ 1992లో బోథ్ దళంకు బదిలీ చేసింది. ఆ ప్రాంతంలో ఉన్న ఆదివాసీ ప్రజలను అధ్యయనం చేస్తూ వాళ్ల భాషను నేర్చుకుంటూ వారి సమస్యలను లోతుగా అర్థం చేసుకోవడానికి ప్రయత్నం చేసాడు. కొండలు, గుట్టలు ఎక్కడం, ప్రజల ఆహారమైన జొన్నగట్క, రొట్టెలు తినడం అలవాటు చేసుకున్నాడు. దళ సభ్యులతో, ప్రజలతో కలిసిపోయి వాళ్లకు చదువు నేర్పడం, వైద్యం అందించడం చేస్తూ వారి యొక్క అభిమానాన్ని చురగొన్నాడు. ప్రజలకు వచ్చే జబ్బులకు వైద్యం అందిస్తూ ప్రజల డాక్టర్ గా పేరు తెచ్చుకున్నాడు.

ఈ క్రమంలో ఉద్యమ అవసరాల రిత్యా 1993 ప్రాంతంలో ఇంద్రవెల్లి ఏరియాకు, 1995లో చెన్నూర్ ప్రాంతానికి ఆదిలాబాద్ జిల్లా కమిటీ బదిలీ చేసింది. 1995 లోనే ఏసీ మెంబర్ గా ప్రమోట్ అయినాడు. చెన్నూర్, సింగరేణి బార్డర్ లో పని చేయడానికి ఆ ప్రాంత ప్రజలతో సంబంధాలను కొనసాగిస్తూ వర్గ పోరాటాన్ని ముందుకు తీసుకుపోవడానికి కృషి చేసాడు. ఈ క్రమంలోనే మందమర్రి మండలం, మామిడి గట్టు గ్రామంలో షెల్టర్ లో ఉన్నప్పుడు (1997 చివర) పోలీసులు అరెస్టు చేసారు.

**జైలు-జీవితం :**

1997 నుండి 1998 చివరి వరకు వరంగల్ జైలులో వున్నాడు. కొద్ది రోజులు అసిఫాబాద్ జైలులో వున్నాడు. జైలు జీవితంలో దొరికిన సమయాన్ని మార్క్సిస్టు సిద్దాంత అధ్యయనాన్ని కొనసాగించాడు. పార్టీ డాక్యుమెంట్స్ ను అధ్యయనం చేస్తూ నక్సల్ బ్యారక్ లో వున్న కామ్రేడ్స కు రాజకీయ తరగతులు బోధించారు. బ్యారక్ లో ఉన్న కామ్రేడ్స్ తో జైలు కమ్యూన్ కొనసాగిస్తూ నాయకత్వం వహించాడు. ఈ కాలంలో జైలు-ఖైదీల హక్కుల కోసం పోరాడినారు. జైల్లో వున్న కామ్రేడ్స్ కు ధైర్యం చెబుతూ నిలబెట్టాడు. శత్రువు దిగ్బందంలో వున్నపటికీ భయపడకుండా సైద్ధాంతిక, రాజకీయ జ్ఞానం అభివృద్ధి చేసుకోవడానికి జైలు జీవిత కాలాన్ని ఉపయోగించుకున్నాడు. 1998 చివర విడుదలైన వెంటనే విప్లవోద్యమంలోకి వచ్చాడు. ఈ క్రమంలో పీ.ఎల్. కమాండర్ గా 2000 జిల్లా కమిటీ నియమించింది. జిల్లా కమిటీ సభ్యుడుగా ప్రమోట్ అయ్యాడు. ఈ పీ.ఎల్. ప్రధానంగా ఇంద్రవెల్లి-మంగి ప్రాంతంలో ప్రధానంగా కేంద్రీకరించి పని చేసింది.

**శత్రువు నిర్బంధం మధ్యనే ప్రజా ఉద్యమాలకు ఊపిరిలూదిన కామ్రేడ్ భాస్కర్ :**

అడవులు, గుట్టలు, అణగారిన బతుకుల అనేక బాధలు గల ఆదివాసులలో పని చేస్తూ 1990 నుండి దళ సభ్యుడిగా రహస్య విప్లవ జీవితాన్ని ప్రారంభించి 2025 వరకు వివిధ స్థాయిలోకి ఎదిగి ఆదిలాబాద్ జిల్లా విప్లవోద్యమాన్ని బలోపేతం చేయడంలో ప్రముఖ పాత్రను నిర్వర్తించాడు.

ఆదివాసీ గూడాలలో గట్క తింటూ, అంబలి తాగుతూ దొరికినప్పుడు ఇప్పపూలు తింటూ, ఆ మాత్రం తిండి కూడా లభించని నాడు ఆకలితోనైనా వుంటూ ఆకలి సమస్య, అనారోగ్య సమస్య, ప్రకృతి సమస్యలు, భాష సమస్య తదితర సకల సమస్యలతో పాటు పోలీసు నిర్బంధాలను సైతం తట్టుకుంటూ ఎన్ని బాధలు వున్నప్పటికీ ఆదిలాబాద్ జిల్లాను వదలకుండా ఆదివాసుల గూడాల్లో జల్-జంగల్-జమీన్ కొరకు తుడుంలను మ్రోగింప చేస్తూ రగల్ జెండా పట్టిస్తూ పోరాటాన్ని అందిచ్చాడు. ఆదివాసుల బ్రతుకుల్ని, బాధల్ని

అర్థం చేసుకుంటూ, సంస్కృతిని అధ్యయనం చేస్తూ, భాష నేర్చుకుంటూ ఆదివాసుల్లో కలిసిపోతూ ఆడుతూ పాడుతూ కామ్రేడ్ భాస్కర్ ఆదివాసుల అభిమాన పాత్రుడయ్యాడు. ఆదివాసుల్ని చైతన్య పరుస్తూ, సంఘటిత పరుస్తూ పోరాట పథంలో నిలబెడుతూ, దళ, పార్టీ క్రమశిక్షణకు కట్టుబడి వుంటూ వివిధ కర్తవ్యాల్ని నిర్వర్తించడంలో ఓపిక, పట్టుదల, దృఢసంకల్పం, త్యాగనిరతితో కృషి చేస్తూ క్రమంగా ఎదిగాడు.

కరువు కాటకాలు, ఆకలి బాధలు, అనారోగ్య సమస్యలతో సతమతమవుతూ కనీసం కడుపునిండ తాగేందుకు నీళ్ళు సైతం కరువై ప్రభుత్వాల ద్వారా ఎలాంటి సహాయక చర్యలు అందని ఆదివాసీ ప్రాంతాలు వున్నాయి. కొమ్మ కొట్టినా, చెట్టు కొట్టినా, భూమి దున్నినా, బువ్వ అడిగినా ప్రభుత్వం (టీ.డీ.పీ.,కాంగ్రెస్, బీ.ఆర్.ఎస్. ప్రభుత్వాలు), పోలీసులు, ఫారెస్టు అధికార్ల ద్వారా తీవ్రంగా అణచివేయటం నేటికి కొనసాగుతుంది. ఈ పరిస్థితుల్లో ఫారెస్టు అధికారుల దోపిడి, దౌర్జన్యాల్ని, పోలీసుల అణచివేతల్ని, షావుకార్ల దోపిడిని ఎదిరించి అరికట్టే విధంగా ఆదివాసుల్ని ఆర్గనైజు చేశాడు. ఆదిలాబాద్ జిల్లాలో అటవీ భూములను నరికి సాగు చేసుకోవడం, భూస్వాముల భూములను ఆక్రమించుకొని పంటలు పండించడం ద్వారా తినడానికి ధాన్యం సంపదించుకునేలా భూ ఆక్రమణ పోరాటాలలో కామ్రేడ్ భాస్కర్ ఆదివాసుల్ని కదిలించాడు. అటవీ ఉత్పత్తులకు, సరైనా రేటు చెల్లించాలంటూ షావుకార్లకు, బొంగు (వెదురు) కాంట్రాక్టర్లకు, పేపర్ మిల్లు యాజమాన్యానికి వ్యతిరేకంగా పోరాటాలు సాగిస్తూ కూలీ రేట్లు పెంచుకునే విధంగా ఆదివాసుల్ని కదిలిస్తూ రావడం జరిగింది. ఆదివాసుల్ని వివిధ పోరాటాల్లోకి కదిలిస్తూ రాజకీయంగా చైతన్యపరుస్తూ ఆదివాసీ ప్రాంతాలకు స్వయం ప్రతిపత్తి కల్పించాలి. పెసా చట్టాన్ని, 5వ, 6వ షెడ్యూల్ ను, 1/70 చట్టాన్ని, జీ.నెం. 3 అమలు చేయాలి. ఆదివాసులు సాగు చేసుకుంటున్న పోడు భూములకు పట్టాలు ఇవ్వాలి. 2006 అటవీ హక్కుల చట్టంను అమలు చేయాలని వివిధ కవర్ సంఘాల ద్వారా ప్రజలను సంఘటితపరుస్తూ, పార్టీ నిర్మాణాన్ని పటిష్టపరుస్తూ దోపిడీ వర్గాల గుండెల్లో దడపుట్టే విధంగా ఆదిలాబాద్ జిల్లాలో కామ్రేడ్ భాస్కర్ విప్లవోద్యమాన్ని బలోపేతం చేయడానికి కృషి చేస్తూ పని చేశాడు.

కేసీఆర్ ప్రభుత్వం హరితహారం పేరుతో పోడు భూముల్లో మొక్కలు నాటుతూ ఆదివాసులు సాగు చేసుకుంటున్న భూముల నుండి బేదాఖల్ చేసింది. కేసులు పెట్టి జైలుకు పంపింది. ఆదిలాబాద్ జిల్లాలో తీవ్రతరమవుతున్న ఈ సమస్య పరిష్కారానికై వివిధ ఆదివాసీ సంఘాల ద్వారా ఆదివాసీ ప్రజలను కదిలించడానికి కృషి చేసాడు. బోరుసాయి పేట, అల్లంపల్లి, మైసంపేట, గండిగోపాల్ పూర్, నారాయణపేట, బోమజిపేట, దేద్ర, మండి, మధుర, టొక్కిగూడం, మోవాడ, గోంది తదితర గ్రామాలలో ప్రజలు తిరగబడి సాగు చేసుకున్నారు. ఈ పోరాటానికి కామ్రేడ్ భాస్కర్ నాయకత్వం అందించాడు.

కవ్వాల టైగర్ జోన్ పేరుతో ఇంద్రవెల్లి, మంగి, సిర్పూర్ ప్రాంతాలలో వున్న వందలాది గ్రామాలను ఎత్తివేయడానికి కేసీఆర్ ప్రభుత్వం ప్రయత్నం చేసింది. ఈ ఎత్తివేతకు వ్యతిరేకంగా ఆదివాసీ సంఘాల ద్వారా జిల్లాలో ప్రజా ఉద్యమాన్ని నడిపించాడు.

సింగరేణి ఓపెన్ కాస్టు బొగ్గు బావులకు వ్యతిరేకంగా మొవాడ, ఉల్లిపిట్ట, దుర్లీ, మధుర, సిర్రగుంది, తదితర గ్రామాల ప్రజలను కదిలించడానికి పోరాట కమిటీని నిర్మించాడు. ఆ పోరాటాలలో ప్రజలను కదిలించడానికి కామ్రేడ్ భాస్కర్ క్రియాశీలంగా పని చేశాడు. దుర్లి ప్రాంతంలో వున్న 2 కోట్ల రూపాయల సింగరేణి ఆస్తులను ప్రజలు ధ్వంసం చేసాడు.

విద్యార్థి రంగ సమస్యల పరిష్కారంకై వేలాది మంది ఆదివాసీ విద్యార్థులను (ఐ.టీ.డీ.ఏ.) ఉట్నూర్ కు కదిలించిన పోరాటంలో కామ్రేడ్ భాస్కర్ పాత్ర వుంది. 2021 ఆదిలాబాద్ జిల్లాలో ఎస్.టీ. జాబితా నుండి వలస లంబాడీలను తొలగించాలని పెద్ద ఉద్యమం వచ్చింది. ఈ సందర్భంగా ఒకరిపై ఒకరు దాడులు చేసుకున్నారు. ఉద్యమ పరిస్థితి ఏర్పడింది. ఈ సమస్యను పరిష్కరించడానికి పార్టీ పూనుకున్నది. ఆదివాసీ ప్రాంతాల్లోకి 1976 తర్వాత వలస వచ్చిన లంబాడీలకు రిజర్వేషన్ హక్కును తొలగించాలని వైఖరి తీసుకొని వివిధ తెగల మధ్య వున్న సమస్యను పరిష్కరించింది. ఈ సమస్య మిత్ర వైరుధ్యంగా పరిష్కరించుకోవాలని రాజకీయ కృషిని కొనసాగించింది. కామ్రేడ్ భాస్కర్ ఆదిలాబాద్ జిల్లాలో ఈ సమస్యను పరిష్కరించడానికి తీవ్రంగా కొనసాగించాడు.

1996 నుండి కొనసాగుతున్న ప్రజాస్వామిక తెలంగాణ ఉద్యమానికి ఆదిలాబాద్ జిల్లా వివిధ వర్గాల ప్రజలను కదిలించడానికి కృషి చేసాడు. ఈ కాలంలో రాజకీయంగా, నిర్మాణపరంగా సంఘటితం చేసే ప్రయత్నం చేసాడు. ముఖ్యంగా ఆదివాసీ ప్రజలను కదిలించడానికి అహర్నిషలు కృషిని కొనసాగించాడు. ఆపరేషన్ గ్రీన్ హౌంట్, సమాధాన్, కగార్ దాడుల మధ్య కూడా వివిధ కవర్ సంఘాల నిర్మాణం, రహస్య పనికి ప్రాధాన్యతనిస్తూ పోరాటాలను నడిపించాడు.

2004లో వై.ఎస్.ఆర్. రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. మావోయిస్టు పార్టీతో చర్చలు కొనసాగించింది. ఈ కాలంలో ఆదిలాబాద్ జిల్లాలో ప్రజల సమస్యల మీద కదిలించడానికి కామ్రేడ్ భాస్కర్ కృషిని కొనసాగించాడు. ఈ పరిస్థితిలో అమర వీరుల స్థూపాలను జిల్లాలో నిర్మించారు. 2004 అక్టోబర్ నెలలో జిల్లా అమర వీరుల స్థూపాన్ని మొవాడ గ్రామంలో కామ్రేడ్ భాస్కర్ నాయకత్వంలో పెద్ద స్థూపాన్ని నిర్మించడం జరిగింది. స్థూపవిష్కరణ సభకు వేలాది మంది ప్రజలను కదిలించడంలో కామ్రేడ్ భాస్కర్ కృషి చేసారు. ఈ సభకు అమరవీరుల కుటుంబాలు హజరైనారు. వీరందరితో కలిసి మాట్లాడి ధైర్యం చెప్పారు.

**సాహస గెరిల్లా యోధుడు కామ్రేడ్ భాస్కర్ :**

1996 నవంబర్ లో సిర్పూర్ పోలీస్ స్టేషన్ పై పార్టీ నాయకత్వంలో గెరిల్లా దళాలు దాడి చేసాయి. ఆ దాడిలో కామ్రేడ్ భాస్కర్ సభ్యుడుగా పాల్గొన్నాడు. ఆ దాడి విజయవంతం అయ్యి 16 మంది పోలీసులు చనిపోగా, ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటన రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం కలిగించింది. ప్రజలలో పాజిటివ్ ప్రభావాన్ని వేసింది. శత్రువులో భయం కల్పించింది. కామ్రేడ్ భాస్కర్ క్రమంగా మిలిటరీ రంగంపై దృష్టి పెట్టాడు. గోలేటి, ఇందారం సీ.ఐ.ఎస్.ఎఫ్ క్యాంపులపై దాడులు, బెల్లంపల్లి రైల్వే స్టేషన్ పై జరిగిన తదితర దాడులలో సభ్యుడుగా పాల్గొన్నాడు. వీటన్నింటి మూలంగా మిలిటరీ రంగంలో కొంత అనుభవం సంపాదించాడు. ఈ విధంగా జిల్లా కేడర్ యొక్క విశ్వాసాన్ని చురగొన్నాడు. జిల్లాలో వున్న పీఎల్ కు 2000 సంవత్సరంలో కమాండర్ అయినాడు. ఈ క్రమంలో పశ్చిమ మిలిటరీ కమాండ్ సభ్యుడుగా నియమించబడ్డాడు.

పార్టీ నిర్వహించిన మిలిటరీ క్యాంపుల్లో హజరై మిలటరీ స్కిల్స్ నేర్చుకోవడమే కాకుండా మిలటరీ ఇన్ స్ట్రక్టర్ గా క్రింది క్యాడర్ కు మిలిటరీ విద్యను ట్రైనింగ్ ఇస్తూ మిలిటరీ రంగంలో వారిని అభివృద్ధి చేయడానికి కృషి చేసాడు.

2000 నుండి ఉత్తర తెలంగాణ ఉద్యమంపై ప్రభుత్వ దాడి మరింత తీవ్రతరం అయింది. ప్రభుత్వ గ్రేహౌండ్స్ దళాలు పక్కా సమాచారంతో గెరిల్లా బలగాలపై దాడులు చేయడం ప్రారంభించాయి. కామ్రేడ్ భాస్కర్ ఇలాంటి దాడులను ఎదుర్కొనే అనుభవం సంపాదించాడు. 2000 నుండి 2025 వరకు ఆదిలాబాద్ జిల్లాలో అనేక ఎన్కౌంటర్స్ నుండి కాల్పులు చేస్తూ సురక్షితంగా రిట్రీట్ అయిన ఘటనలు అనేకం వున్నాయి. రిట్రీట్ లో భాగంగా వచ్చిన గడ్చిరోలి జిల్లాలోని, అహిరి ప్రాంతంలో, బీజీపూర్ జిల్లా, నేషనల్ పార్క్ ఏరియాలో వివిధ ఘటనలలో క్షేమంగా తప్పుకున్నాడు.

2001 చివర ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ మండలం, దమ్మన్నపేట అడవుల్లో మిలిటరీ క్యాంపు జరుగుతున్న విషయం తెలిసిన పోలీస్ బలగాలు దాడికి పాల్పడ్డారు. ఈ విషయం తెలిసిన గెరిల్లాలు ముందే ఆంబూష్ కూర్చున్నారు. ఆ ఆంబూష్ లో కామ్రేడ్ భాస్కర్ పాల్గొన్నాడు. పోలీసులు కౌంటర్ ఆంబూష్ కు గురై తిరిగి వెనక్కి పోయారు. ఈ దాడిలో ఒక గెరిల్లా కామ్రేడ్ అమరుడయ్యాడు. ఇద్దరు పోలీసులు తీవ్రంగా గాయపడ్డారు.

ఆదిలాబాద్, మహారాష్ట్ర బార్డర్ లో (2020) కోసాయి రైల్వే స్టేషన్ ప్రాంతంలో దాడి చేసి 4 రైఫిల్స్, 450 తూటాలు స్వాధీనం చేసుకున్న ఘటనలో కామ్రేడ్ భాస్కర్ కమాండర్ గా వ్యవహరించాడు. కడెం, ఖానాపూర్, భీమారం ఫారెస్టు క్యాంపులు ఎత్తివేయాలని దాడి చేసి కమ్యూనికేషన్ సెట్స్, లేస్ సెట్స్ స్వాధీనం చేసుకున్నారు.

ఎత్తుగడల ఎదురుదాడుల క్యాంపెయిన్ లలో జిల్లా గెరిల్లా బలగాలకు నాయకత్వం వహించాడు. ఇంద్రవెల్లి, మంగి, సిర్పూర్, చెన్నూర్ ప్రాంతంలో ఇన్ఫార్మర్ నెట్ వర్క్ ను ధ్వంసం చేసి పార్టీ, ప్రజా సంఘాలను కాపాడుకోవడంలో కామ్రేడ్ భాస్కర్ కృషి చేసాడు.

కడెం బడా భూస్వామి (రెడ్డి) ఇంటి గడీలు కూల్చి భూస్వామిని హతమార్చడం జరిగింది. ఇంద్రవెల్లి, బోథ్, చెన్నూర్ ఏరియాలలో భూస్వాములపై దాడి చేసి, ఆస్తులు జప్తు చేసి పేద ప్రజలకు పంచిపెట్టిన చర్యలలో నాయకత్వం వహించాడు. 2009లో జోడేన్ ఘాట్ అడవి ప్రాంతంలో పక్కా సమాచారంతో పోలీసులు ఆంబూష్ వుండి కాల్పులు జరిపినారు. ఆ ఘటనలో కామ్రేడ్ భాస్కర్ కాల్పులు చేస్తూ రిట్రీట్ అయినాడు. ఈ సంఘటనలో కామ్రేడ్ పున్నెం, కామ్రేడ్ సురేష్ లు అమరులైనారు. మిగతా కామ్రేడ్స్ క్షేమంగా రిట్రీట్ అయ్యారు.

2014 ఆగస్టులో మంగీ ఏరియాలో కుర్రేగడి గ్రామం పరిసరాలోని కోమటిబండ (కమ్యూనిస్టు బండ) వద్ద సమాచారంతో వచ్చిన పోలీసులు దళంపై కాల్పులు జరపడంతో ఎదురు కాల్పులు చేస్తూ క్షేమంగా రిట్రీట్ అయినారు. అదే సంవత్సరం భీమన్నలోద్ది వద్ద చుట్టుముట్టిన పోలీసులపై కాల్పులు చేస్తూ రిట్రీట్ అయ్యారు. ఈ ఘటనలలో ఎవరికి ఏమి కాలేదు.

2021 ఫిబ్రవరి ప్రాంతంలో ఆదిలాబాద్ జిల్లా ఆర్గనైజర్ కొరకు ఒక టీమును తీసుకొని ప్రాణహిత నది దాటి సిర్పూర్ ఏరియా నుండి మంగీ ప్రాంతానికి, అక్కడి నుండి ఇంద్రవెల్లి ఏరియాకు వెళ్లారు. దళం సమాచారం శత్రువుకు తెలిసి పోలీసు బలగాలను మోహరించి వెంబడించాయి. ప్రజల సహకారంతో బోథ్ ప్రాంతానికి పోయి అక్కడి గ్రామాలను కాంటాక్టు చేసారు. డేగ్ర (మే నెలలో) గ్రామ పరిసరాలకు వెళ్తున్నప్పుడు పోలీసులు తారసపడ్డడంతో వారిని తప్పుకుంటూ రిట్రీట్ అయినారు. ప్రాణహిత నుండి మహారాష్ట్ర బార్డర్ (నాందేడ్ జిల్లా) గ్రామాల నుండి కలుసుకుంటూ ఇంద్రవెల్లి నుండి మంగీ ప్రాంతానికి వర్షకాలం వరకు వచ్చారు. మంగీ ప్రాంతంలో టోక్కిగూడెం, మంగీ గ్రామ పరిసరాలలో పోలీసులు ఆంబూష్ పెట్టి దళాన్ని నిర్మూలించాలని తీవ్ర ప్రయత్నాలు చేసినప్పటికీ అక్కడి నుండి క్షేమంగా తప్పించుకొని రిట్రీట్ అయ్యారు. ఆగస్టు నెలలో మంగీ నుండి మామడ ప్రాంతానికి వస్తున్న క్రమంలో చిల్లేటిగూడెం గ్రామ పరిసరాలలో గ్రామానికి పోయిన ముగ్గురు దళ సభ్యులను శత్రువు పట్టుకొని చిత్రహింసలు పెట్టి, హత్య చేసి కదంబ అడవుల్లో ఎన్కౌంటర్ అని ప్రకటించాడు. మిగిలిన దళ కామ్రేడ్స్ మంగీ నుండి క్షేమంగా అనేక ఇబ్బందులతో పెద్దవాగు, ప్రాణహితను దాటి ప్రజల సహకారంతో కామ్రేడ్ భాస్కర్ నేషనల్ పార్క్ ఏరియాకు చేరుకున్నాడు.

''ఆపరేషన్ భాస్కర్'' పేరుతో గ్రేహౌండ్స్ పోలీసులు పెద్ద ఎత్తున ప్రచారం చేస్తూ ఆదివాసీ ప్రజలను, దుకాణ దారులను భయభ్రాంతులు గావించారు. వీటి మధ్యనే ఆదిలాబాద్ జిల్లా ఉద్యమం పునర్నిర్మాణం కొరకు కామ్రేడ్ భాస్కర్ ఎనలేని రాజకీయ, నిర్మాణ కృషిని కొనసాగించాడు.

**తెలంగాణ ఉద్యమ పునర్నిర్మాణ కృషిలో కామ్రేడ్ భాస్కర్ :**

ఉత్తర తెలంగాణ ఉద్యమం 2003 నాటికి తాత్కాలిక సెట్ బ్యాక్ కు గురి అయిందని 2003 అక్టోబర్ ప్లీనంలో నిర్ణయం జరిగింది. ఈ ఉద్యమాన్ని శత్రు దాడుల నుండి రక్షించుకుంటూ మళ్ళీ అభివృద్ధి చేయడం కొరకు తెలంగాణ రాష్ట్ర కమిటీ ముఖ్య కర్తవ్యంగా చేపట్టింది. 2006 మార్చి నుండి ఆదిలాబాద్-నిజామాబాద్ డివిజన్స్ కలిపి ఏర్పాటు చేసిన సంయుక్త డివిజన్ కమిటీలో సభ్యుడుగా వున్నాడు.

2007లో ఎన్.టీ.ఎస్.జెడ్.సీ. కాన్ఫరెన్స్, 2011 లో యన్.టీ. ప్లీనం, 2015 యన్.టీ. ప్లీనలు జరిగాయి. ఈ ప్లీనాలకు కామ్రేడ్ భాస్కర్ గెలిగేట్ గా హజరయినాడు. ఆదిలాబాద్ జిల్లా ప్లీనం (2015)లో డివిజన్ కమిటీ కార్యదర్శిగా ఎన్నుకోబడినాడు. ఈ ప్లీనాలలో డెలిగేట్ గా తెలంగాణ పునర్ నిర్మాణం కొరకు చర్చలు కొనసాగించాడు. ఈ కర్తవ్యం కోసం అహర్నిశలు రాజకీయ కృషి కొనసాగించాడు. 2015 ప్లీనంలోనే తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యుడుగా ఎన్నుకోబడినాడు. తిరిగి 2019 ప్లీనంలో కూడా ఎన్నుకోబడ్డాడు. అమరుడు అయ్యే నాటికి రాష్ట్ర కమిటీ సభ్యుడుగా కొనసాగుతున్నాడు.

పార్టీలో పని చేస్తున్న క్రమంలో పార్టీ నిర్ణయం ప్రకారం కామ్రేడ్ అనితను ఇష్టపడడంతో 2000 మార్చి 12వ తేదీన పెండ్లి చేసుకున్నాడు. కామ్రేడ్ అనిత 2022 డిసెంబర్ 23 నాడు నేషనల్ పార్క్ ఏరియాలో టేకమెట్ట గ్రామంలో అమరురాలైంది. ఒకరునొకరు సహకరించుకుంటూ అమరుల ఆదర్శాలను ఆచరిస్తూ విప్లవ జీవితాన్ని కొనసాగించారు.

ఉద్యమం తీవ్ర శత్రుదాడిని ఎదుర్కొంటున్నప్పుడే అత్యంత కఠిన పరిస్థితులలో ప్రజలను, కేడర్లను ఉత్సేహపరుస్తూ వాస్తవ పరిస్థితుల పైన, ఆదిలాబాద్ జిల్లా ప్రజల మీద, వారి సంస్కృతి మీద మంచి పట్టు వుండేది. ప్రజలను అంటి పెట్టుకొని ఉండడంతో వారి సాధక బాధకాలను తెలుసుకుంటూ వారిని పోరాటాలలో కదిలించడం కోసం కృషి చేశాడు. రాష్ట్ర కమిటీ సభ్యుడుగా తెలంగాణ సామాజిక, రాజకీయ, ఆర్థిక విషయాలపై అవగాహన పెంచుకున్నాడు.

దీని మూలంగా ఎత్తుగడలను ఆచరణలో అన్వయించడంలో, అభివృద్ధి చేయడంలో క్రియాశీల పాత్ర పోషించాడు. ఎప్పటికప్పుడు ఉద్యమంలో నిరంతరం జరుగుతున్న మార్పులపై, ఆయా సమయాల్లో ఎలాంటి పోరాట నిర్మాణాలు చేపట్టాలనే విషయంలో ఎంతో స్పష్టంగా అనర్గళంగా కేడర్లకు బోధించే వాడు. గత 10 సంవత్సరాల కాలంలో సిద్ధాంత, రాజకీయ జ్ఞానాన్ని పెంపొందించుకొని రాష్ట్ర కమిటీ నాయకునిగా అభివృద్ధి చెందాడు. తెలంగాణ ఉద్యమాన్ని, ఆదిలాబాద్ జిల్లా ఉద్యమాన్ని రివైవ్ చేసే కర్తవ్యాన్ని భుజానికెత్తుకొని పని చేసాడు.

తెలంగాణ ఉద్యమంలో తోటి సహచరులు ఎందరో అమరులైనారు. మరకొంత మంది దిగజారిపోయి శత్రువు ముందు సరెండర్ అయినారు. అయినప్పటికీ మనోనిబ్బరంగా వుంటూ అమర వీరుల ఆశయాల వెలుగులో తెలంగాణ ఉద్యమాన్ని, ఆదిలాబాద్ జిల్లా ఉద్యమాన్ని నడిపించాలనే దీక్షను కలిగి వున్నాడు.

దండకారణ్యం-తెలంగాణ ఉద్యమాల వారధిగా ఈ రెండు ప్రాంతాల సరిహద్దుల్లో, రెండు ప్రాంతాల ప్రజలు, కేడర్ల మనోభావాలను, ఆచరనాత్మక సమస్యలను దృష్టిలో పెట్టుకొని గైడ్ చేసేవాడు. కొమరం భీం, గడ్చిరోలి , నేషనల్ పార్క్ సమన్వయ కమిటీలో సభ్యుడుగా వుండి పరస్పర సహకారాన్ని అందించాడు.

దీర్ఘకాల ప్రజా యుద్ధాన్ని పురోగమింప చేయడంలో పార్టీ పొందిన అనుభవం తదనంతర కాలంలో సంసదవంతమైంది. భారత దళారీ నిరంకుశ పాలకులు దఫదఫాలుగా నిరంతరాయంగా కొనసాగించిన వ్యూహాత్మక ఆపరేషన్ గ్రీన్ హంట్, సమాధాన్, కగార్ వంటి దీర్ఘకాలిక దాడి పథకాలను ఎదుర్కొంటూ పని చేసే అనుభవం మన పార్టీకి సాధ్యం అయింది. కామ్రేడ్ భాస్కర్ కూడా ఇందులో రాటుదేలినాడు.

అర్ధవలస, అర్ధ భూస్వామ్య వ్యవస్థలో ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక సంక్షోభం దుర్భరమయ్యే కొలది ప్రజలు తమ ప్రజాస్వామిక, ప్రజా ఉద్యమాలను పురోగమింపజేసెందుకు మరింతగా పోరాడుతారు. అయితే పార్టీ ప్రజలను విప్లవోద్యమంలోకి సమీకరించి కదిలించకుండా ప్రత్యేకించి సాయుధ పోరాటంలోకి దించకుండా, నిజమైన జాతీయ స్వతంత్ర ప్రజాస్వామ్యం కోసం ప్రజలను నూతన ప్రజాస్వామిక విప్లవం వైపు పురోగమింప చేయకుండా ఇది సాధ్యం కాదు. ప్రజల ప్రజాస్వామిక విప్లవం ద్వారా మాత్రమే పీడిత జాతులు, పీడిత ప్రజలు దోపిడీ, పీడనలో నుంచి పూర్తిగా విముక్తి చెందగలరు. సామ్రాజ్యవాదాన్ని, దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ విధానాన్ని, భూస్వామ్య విధానాన్ని ఓడించడంలో వారి శక్తి నిర్ణయాత్మకమైంది. కామ్రేడ్ భాస్కర్ ఈ ప్రజాశక్తిని వెలికి తీయడం కోసం జీవితమంతా (35 సంవత్సరాలు) విప్లవంలో కష్టించి పని చేసాడు.

**ఉద్యమ అవసరాలకు కవిగా, పాటల రచయతగా, సాంస్కృతిక కళాకారుడు :**

విప్లవోద్యమ అవసరాల కొరకు ఆదివాసీ ప్రజలలోకి చొచ్చుకుపోవడానికి ఆదివాసీ భాషను నేర్చుకున్నాడు. తెలుగు పాటలను ఆదిలాబాద్ కోయ భాషలోకి అనువాదం చేసి స్వయంగా పాటలు పాడి విప్లవ రాజకీయాలను చెప్పేవాడు. మన పార్టీ క్యాంపులలో పాటలు పాడుతూ కేడర్లను ఉత్తేజపర్చేవాడు.

ఉద్యమంలో అమరులైన వారి మీద కవితలు రాయడం, పాటలు రాయడం చేసాడు. ''మడావి దాద'' కలం పేరుతో రాసేవాడు. పత్రికలకు వ్యాసాలు కూడా రాసేవాడు. ఇతర కేడర్లను కథలు, కవితలు, పాటలు రాయాలని ప్రోత్సహిస్తూ రాయించే వాడు.

ప్రజలల్లోకి పోయినప్పుడు ప్రత్యక్షంగా పాటలు పాడుతూ రాజకీయాలను చెబుతూ పీడిత ప్రజలను ఆర్గనైజ్ చేసేవాడు. ఒక కళాకారుడుగా కేడర్ ను, ప్రజలను ఉత్సాహపరిచేవాడు. వాస్తవానికి ప్రజలు, వర్గ పోరాటం సాయుధ విప్లవోద్యమమే ఒక సామాన్యమైన అడెల్లును ఒక గొప్ప కమ్యూనిస్టుగా తీర్చిదిద్దాయి.

పొచ్చెర గ్రామంలో కామ్రేడ్ భాస్కర్ అంతిమ యాత్రలో దాదాపు 3 వేల మంది ప్రజలు హజరై విప్లవ సంప్రదాయాలతో శ్రద్ధాంజలి ఘటించారు. కఠినమైన వర్గ పోరాటంలోనే కామ్రేడ్ భాస్కర్ రాటుదేలి రాష్ట్ర కమిటీ స్థాయికి ఎదిగినాడు. విప్లవోద్యమంలో ఈ విధంగానే ప్రజల నాయకులు పుడుతారు. ప్రపంచ చరిత్రలో ఇది పదేపదే రుజువైన సత్యం.

విశాల ప్రజారాశులను రాజ్యాధికారం కోసం సామ్రాజ్యవాదులను, దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ, భూస్వామ్య వర్గాలను అన్ని రకాల అభివృద్ధి నిరోధకులను ఓడించేందుకు, ఆపరేషన్ కగార్ కు వ్యతిరేకంగా ప్రతిఘటనలోకి దిగేవిధంగా తయారు చేయాలి. అకుంఠిత దీక్షతో భారత ప్రజాయుద్ధం కోసం మన యావత్తు శక్తిని వెచ్చించి పని చేయడం, విప్లవాన్ని పురోగమింప చేయడమే. కామ్రేడ్ భాస్కర్ కు నిజమైన నివాళి అర్పిస్తాం. పార్టీ పంథాకు కట్టుబడి, మన అమరులు మార్గదర్శక శక్తితో నిర్ణయాత్మకంగా, ఆత్మవిశ్వాసంతో పనిని కొనసాగిస్తాం. కావున నేడు కామ్రేడ్ భాస్కర్ ఆశయాలను కొనసాగించడం మన కర్తవ్యం.

**కామ్రేడ్ భాస్కర్ అమర్ రహే!**

**కామ్రేడ్ భాస్కర్ ఆశయాలను ముందుకు తీసుకుపోదాం!**

# కష్టజీవి, టెక్నికల్ రంగంలో గెరిల్లా యోధుడు

# కామ్రేడ్ సోడి నరసింహరావు కు విప్లవ జోహార్లు

కామ్రేడ్ నరసింహరావు బీజాపూర్ జిల్లా, ఉసూర్ బ్లాక్, పూజారి కాంకేర్ పంచాయితీ, పెద్దూట్ల గ్రామంలో తల్లి పుల్లమ్మ, తండ్రి బుచ్చయ్యలకు 35 సంవత్సరాల క్రితం జన్మించాడు. కామ్రేడ్ నరసింహరావుకు ఒక చెల్లి వుంది. కామ్రేడ్ నరసింహరావు నిరుపేద ఆదివాసీ రైతాంగ కుటుంబంలో పుట్టి పెరిగాడు. తల్లి, తండ్రి రోజువారి జీవనం కోసం కూలి పనులు చేస్తూ అడవి ఉత్పత్తులపై ఆధారపడి పోడు వ్యవసాయం చేస్తూ పిల్లలను పోషించారు. కామ్రేడ్ నరసింహరావు 6-7 సంవత్సరాల వయస్సులో తల్లి, తండ్రి అనారోగ్యంతో చనిపోయారు. తల్లిదండ్రులు చనిపోయినప్పటి నుండి ఇద్దరు తన మేనమామ వద్దనే పెరిగారు. చిన్నతనం నుండి కష్టపడి పని చేసేవాడు. తన మేనమామతో కలిసి వ్యవసాయ పనులు నేర్చుకుంటూ, పశువులు మేపడం, అటవీ ఉత్పత్తులైన ఇప్పపూలు, తునికాకు పనులు చేస్తూ పెరిగాడు. ఈ విధంగా రోజు పనులు చేస్తే కానీ పొట్ట నిండని పరిస్థితిలో చదువుకు దూరమైనాడు. తన తాతయ్య, మేనమామలతో కలిసి పనులు చేస్తూ తన చెల్లిని చూసుకున్నాడు. కామ్రేడ్ నరసింహరావు చిన్నప్పటి నుండి కష్టపడి పనిని స్వభావాన్ని చూసి చిన్నవయస్సులోనే తన మేనమామ కూతురితో పెళ్ళి చేశారు.

చిన్ననాటి నుండి పార్టీ పాటలు, మాటలు, రాజకీయాలను వింటూ నరసింహరావు పెరిగాడు. పెద్దూట్ల గ్రామంలో అనేక సమస్యలు వున్నాయి. గ్రామంలో ఫారెస్టు అధికారుల దౌర్జన్యానికి వ్యతిరేకంగా గ్రామ కమిటీ నాయకత్వంలో అనేక పోరాటాలు జరిగాయి. గ్రామానికి పోలీసులు వచ్చి ప్రజలను పట్టుకొని అనేక కేసులు బనాయించి అరెస్టులు చేసేవారు. చాలా మందిని సంవత్సరాల తరబడి జైలు పాలుచేశారు. అయినప్పటికీ పార్టీ ప్రజలకు అండగా వుందని గ్రామ ప్రజలు అటవీ భూమిని సాగు చేసుకుంటూ ధైర్యంగా వ్యవసాయం చేసుకుంటూ జీవనం కొనసాగించారు. అంతేకాక అటవీ ఉత్పత్తులైన తునికాకు, వెదురు బొంగుల రేట్లు పెంచాలనే డిమాండ్ చేస్తూ పోరాటాలు కదిలాయి.

కామ్రేడ్ నరసింహరావు పోరాటాలను చూస్తూనే పెరిగాడు. కామ్రేడ్ నరసింహరావు కుటుంబం నుండి చాలా మంది వివిధ కమిటీలలో వుంటూ ప్రజలను చైతన్యం చేస్తూ పోరాటాలలో కదిలించారు. సంవత్సరాల తరబడి జైలు జీవితానికి సిద్ధపడ్డారు కానీ శత్రువుకు లొంగిపోయి పార్టీకీ, ప్రజలకు ద్రోహం చేయలేదు. దోపిడి రాజ్య నిర్బంధాలను, ఫారెస్టు అధికారుల దోపిడిని, పోలీసుల దాడులను ఎదుర్కొంటూ పార్టీకి మద్దతుగా ప్రజలే కంచు కోటగా వుండి వున్నారు. ఈ క్రమంలో కామ్రేడ్ నరసింహరావు 1998 లో శత్రువు బలగాల దాడుల నుండి ప్రజలను, పార్టీని రక్షించడంలో భాగంగా మిలీషియాలో చేరాడు. ఇంటి పనులను, పార్టీ పనులను సమన్వయం చేస్తూ మిలీషియాలో పని చేశాడు. మిలీషియాలో సభ్యుడు స్థాయి నుండి సెక్షన్ కమాండర్ వరకు చిన్న చిన్నగా ఎదుగుతూ శత్రువును చికాకుపరిచే అనేక చర్యల్లో పాల్గొనాడు. విప్లవ ద్రోహులను శిక్షించడంలో, శత్రువు యొక్క ఇన్ఫార్మర్స్ ను ఖతం చేయడం తన వంతు పాత్ర ముఖ్యమైనది. కామ్రేడ్ నరసింహరావు కుటుంబంలో తలెత్తున్న సమస్యలకు, సంఘ సభ్యుల, నాయకత్వ అరెస్టులకు, అమరత్వాలకు వెరవకుండా శత్రువును చికాకు పరిచే చిన్న చిన్న ఘటనలు చేయడానికీ ప్రయత్నం చేసేవాడు. శత్రువు నిర్బంధం పెరుగుతున్న క్రమంలో వస్తున్న ఒడిదుడుకులను ఎదుర్కొంటూ పార్టీపై, ప్రజలపై విశ్వాసంతో వెనకడుగు వేయకుండా ప్రజలకు రక్షణగా వున్నాడు. శత్రువు కండ్లు కప్పి నీటిలో చేపలాగా ప్రజల మధ్యనే వుంటూ పని చేశాడు. పీఎల్.జీ.ఏ శత్రువుపై చేసిన అనేక ఆంబూష్ దాడులలో పాల్గొని తన వంతు బాధ్యతను నెరవేర్చాడు. 2006 నుండి పంచాయితీ మిలీషియా ఇన్ చీఫ్ గా వున్నాడు. అప్పుడే భీమారం-పూజారి కాంకేర్ పోలీసులపై ఫైరింగ్ చేసి పోలీసులను గాయపర్చిన ఘటనలో కామ్రేడ్ నరసింహరావు ముందు వున్నాడు.

ప్రజలతో కలసి మెలసి వుంటూ తన తోటి మిలీషియా కామ్రేడ్స్ కు క్రమశిక్షణ నేర్పేవాడు. మిలీషియా కామ్రేడ్స్ కు మిలటరీ క్యాంపులు నడుపుతూ ప్రజలకు రక్షణ కల్పించడంలో చొరవగా పనులు చేసేవాడు. ప్రజల విశ్వాసాన్ని, నమ్మకాన్ని సంపాదించుకున్న మిలీషియా బాధ్యుడిగా కామ్రేడ్ నరసింహరావు ఎదిగాడు. పంచాయితీలో అనేక చోట్ల బూబీట్రాప్స్ పెట్టి ఏరియాలోకి వచ్చే శత్రువును రాకుండా చేస్తూ ఊసూర్, చర్ల పోలీసులకు టార్గేట్ అయ్యాడు. ప్రజలను ఐక్యం చేయడంలో ఎంతో బాధ్యతగా వారి సమస్యలను అర్థం చేసుకుంటూ అర్థం చేయించేవాడు. సమిష్టి పని తరువాత వ్యక్తిగత పని చేయాలని అంటూ ఆచరించేవాడు. ప్రతి పనిని బాధ్యతగా, సమర్థవంతంగా నిర్వర్తించడానికీ ప్రయత్నించేవాడు.

ఏరియాలో పెరుగుతున్న శత్రువు నిర్బంధాన్ని దృష్టిలో వుంచుకొని ఇంటి దగ్గర వుంటూ పని చేయలేని పరిస్థితిలో వున్న కామ్రేడ్స్ ను దళంలోకి రావాలని డీవీసీ తీర్మాణం చేసింది. ఈ తీర్మాణాన్ని గౌరవించి పార్టీ నిర్ణయం మేరకు 2015లో పూర్తికాలం కార్యకర్తగా రిక్రూట్ అయ్యాడు. తను వచ్చే ముందు మళ్లీ మిలీషియా బాధ్యుడిగా తన బావను తయారు చేసాడు. తనవంతుగా వర్కడివిజన్ లో భాగంగా అప్పుడప్పుడు వెళ్ళి కలిసి రాజకీయాలు మాట్లాడి మోటివేషన్ చేసేవాడు.

దళంలోకి వచ్చిన నాటి నుండి చదవటం, రాయటం కొంత నేర్చుకుంటూ మిలటరీ చర్యల్లో పాల్గొనేవాడు. పార్టీ డాక్యుమెంట్స్, పాలసీ పేపర్స్ చదువుతూ క్లాసులు వింటూ రాజకీయాలను మరింత అర్థం చేసుకున్నాడు. కామ్రేడ్ నరసింహరావు దళంలోకి వచ్చిన కొన్ని సంవత్సరాలకే తన భార్య వేరే వాళ్ళను పెళ్ళి చేసుకుందని తెలిసిన వెనక ముందు ఆలోచించకుండా తన లక్ష్య సాధనలో

దృఢంగా ముందుకు సాగాలని అనుకున్నాడు. ఏరియాలో ప్రజల మధ్య వచ్చే సమస్యలను పరిష్కరించేవాడు. ప్రజలను సంఘటితం చేయడంలో రాజకీయాలను బోధిస్తూ వారిని ఐక్యం చేయడానికి కృషి చేశాడు. వర్గ శత్రువుపై పీ.ఎల్.జీ.ఏ. చేసిన సింగం, ఏంపూరం, జీరగూడెం, బుర్కపాల్, సార్కేర్, గుమ్మగూడెం లాంటి అనేక మిలటరీ చర్యలలో, ఆంబుష్ దాడులలో కామ్రేడ్ నరసింహారావు తన బాధ్యతను నిర్వర్తించాడు. శత్రువంటే భయపడేవాడు కాదు ముందుండే కొట్లాడే స్వభావం గల వాడు. కామ్రేడ్ నరసింహారావు పనిని, పట్టుదలను, క్రమశిక్షణను చూసి 2016 లో ఏసీఎమ్ గా ప్రమోట్ అయ్యాడు. బాధ్యులు చేప్పే విషయాలను శ్రద్ధగా వింటూ వాటి అమలుకై కృషి చేసేవాడు.

కామ్రేడ్ నరసింహారావు ను 2020 సంవత్సరంలో తెలంగాణలో టెక్నికల్ డిపార్టుమెంట్ కు బదిలీ చేయడం జరిగింది. ఈ నిర్ణయానికి కట్టుబడి సంతోషంగా తుపాకులను రిపేర్ చేయడం నేర్చుకోవడానికీ ఒప్పుకున్నాడు. కామ్రేడ్ నరసింహారావు చదువుకోక పోయినప్పటికీ విషయాలను, టెక్నిక్ ను పట్టుకొని తొందరలోనే తుపాకుల రిపేర్ చేయడం నేర్చుకున్నాడు. కామ్రేడ్ నరసింహారావు తన బాధ్యతను నిర్వర్తిస్తూనే నాయకత్వం అప్పగించే పనులను కూడా నిర్వర్తించాడు. ఒక్కో సారి రిపేర్ పనులు చేస్తూ అలసిపోయిన రెస్టు లేకుండా అన్ని పనులను సమన్వయంగా చేసేవాడు. తుపాకులు రిపేర్ చేయడంలో పట్టు సాధించాడు. పార్టీ అవసరాల రిత్యా కొరియర్ గా పని చేస్తూ ట్రాక్టర్, బైక్ ను నడపడం నేర్చుకున్నాడు. వాటిలో వచ్చే సమస్యలను పరిష్కరించేలా వాటి రిపేరింగ్ కూడా నేర్చుకొని కొంత పట్టు సంపాదించాడు.

2023 సంవత్సరంలో కామ్రేడ్ నరసింహారావు డీవీసీఎమ్ గా ప్రమోట్ అయ్యాడు. కామ్రేడ్ నరసింహారావుకు పార్టీ నియమాలకు అనుగుణంగా కామ్రేడ్ రీణతో జులై, 2023 వివాహం జరిగింది. వివాహ జీవితంలో ఆదర్శంగా వున్నారు. కామ్రేడ్ నరసింహారావు దళ కామ్రేడ్స్ తో, నాయకత్వంతో, ప్రజలతో కలివిడి కలిసి వుండేవాడు. తన స్వయం కృషితో పార్టీ అవసరమైన డిపార్టుమెంట్ పనులలో పట్టు సాధించాడు. కామ్రేడ్ నరసింహారావు అనేక పనులలో పార్టీ ఆధారపడే కామ్రేడ్ గా ఎదిగాడు. క్యాడర్, ప్రజల అభియానాన్ని చురగొన్నాడు.

కగార్ దాడిలో భాగంగా 2025 మార్చి నెలలో కర్రెగుట్టలలో వేలాది శత్రువు బలగాలు చేసిన దాడిలో కామ్రేడ్నరసింహారావు అమరుడయ్యాడు. 1998 లో మొదలైన విప్లవ ప్రయాణం 2025 వరకు పార్టీ పట్ల, ప్రజల పట్ల విశ్వాసం శత్రువు దాడులకు వెనక ముందు కాకుండా నిలబడి పోరాడి అమరుడైనాడు.

**కామ్రేడ్ నరసింహారావు అమర్ రహే.**

# దండకారణ్య పోరు విత్తనం, తెలంగాణ విప్లవ కారుడు

# కామ్రేడ్ లాల్సు (పూనెం పొజ్జా) కు విప్లవ జోహార్లు

కామ్రేడ్ పూనెం పొజ్జా బీజాపూర్ జిల్లా, పామేడ్ ఏరియా, మారోడ్ పంచాయితీ, బుస్సపురం గ్రామంలో మధ్యతరగతి ఆదివాసీ రైతాంగ కుటుంబంలో అమ్మ అడ్మే, నాన్న బుద్రులకు 7 గురు సంతనంలో 6వ వాడుగా 28 సంవత్సరాల క్రితం జన్మించాడు. కామ్రేడ్ లాల్సు కు 4గురు అన్నలు, అక్క, చెల్లి వున్నారు. కామ్రేడ్ లాల్సు కు తల్లిదండ్రులు పెట్టిన పేరు పొజ్జాల్. కామ్రేడ్ లాల్సు 5వ తరగతి వరకు చదువుకున్నాడు. తరువాత చదువు మానేసి వ్యవసాయ పనులు చేస్తూ ఆట, పాటలు వింటూ ఉల్లాసంగా పెరిగాడు.

కామ్రేడ్ లాల్సు పుట్టేనాటికీ గ్రామాలలో గ్రామ రాజ్య కమిటీల నాయకత్వంలో ప్రభుత్వం నడుస్తుంది. చిన్ననాటి నుండి విప్లవ పాటలు, ఆటలు ఆడుతూ రాజకీయాలను వింటూ పెరిగాడు. పశువులు మేపేటప్పుడు పాటలు పాడుతూ తిరిగేవాడు. చిన్నతనం నుండి చాలా చురుకుగా వుంటూ బాలల సంఘంలో ఆట, పాటలు నేర్చేకునే వాడు. పెరుగుతున్న క్రమంలో పంచాయితీ సీ.ఎన్.ఎమ్. లో ప్రజల సమస్యలను, శత్రువు దాడులను పాట రూపంలో పాడుతూ ప్రజల ముందు ప్రదర్శించేవాడు. పాటలు, నాటికలు ప్రదర్శిస్తూ మంచి కళాకారుడుగా ప్రజలలో పేరు పొందాడు. కామ్రేడ్ లాల్సు చాలా కలివిడి మనస్తత్వం గలవాడు. పంచాయితీ సీ.ఎన్.ఎమ్. లో వుంటూ ఏరియా సీ.ఎన్.ఎమ్ సభ్యుడిగా అమరుల పాటలు రాయడం, వారి ఆదర్శాలను, ఆశయాలను, పార్టీ రాజకీయాలను ప్రచారం చేయడంలో ప్రజలకు అర్థం అయ్యేలా వివిధ కళారూపాలతో ప్రదర్శించేవాడు. శత్రువు దాడుల మధ్య పెరిగి రాజకీయాలను అర్థం చేసుకుంటూ మంచి కార్యకర్తగా పని చేశాడు.

ఈ క్రమంలో కామ్రేడ్ లాల్సు 2014 లో పూర్తికాలం కార్యకర్తగా రిక్రూట్ అయ్యాడు. 2 సంవత్సరాలు పామేడ్ ఏరియా సీ.ఎన్.ఎమ్. లో పని చేసాడు. పార్టీ అవసరాల రిత్యా 2016 సంవత్సరంలో కామ్రేడ్ లాల్సును తెలంగాణ సీసీఎమ్ కు గార్డుగా బదిలి చేయడం జరిగింది. పార్టీ నిర్ణయం మేరకు నాయకత్వ కామ్రేడ్ కు గార్డుగా వుంటూ రాజకీయాలను నేర్చుకుంటూ ఆట, పాటలతో పాటు మిలటరీ పరంగా ఎదిగాడు. రోజువారి వ్యాయాయం చేస్తూ తోటి సభ్యులకు నేర్పేవాడు. చదువు రాని కొత్త కామ్రేడ్స్ కు చదువు నేర్పుతూ పుస్తకాలను సమిష్టి చేసేవాడు. సమిష్టి పనులలో పాల్గొంటూ అందరితో కలివిడి వుండేవాడు.

2018 సంవత్సరంలో కామ్రేడ్ లాల్సును ఏసీఎమ్ గా ప్రమోట్ అయ్యాడు. గార్డు దళంలో గార్డు దళ కమాండర్ గా వుంటూ రక్షణ బాధ్యతను నిర్వర్తించాడు. కమ్యూనికేషన్ పై కొంత మక్కువ వుండడంతో దొరికిన సమయంలో దానిని నేర్చుకొని పట్టు



సాధించాడు. తెలియని విషయాలను అడిగి తెలుసుకొని పది మందికి నేర్పించేలా తయారయ్యాడు. స్నైపర్ ట్రైనింగ్ నేర్చకొని మంచి స్నైపర్ గా ఎదిగాడు. 2018 నుండి 2021 వరకు గార్డు దళ కమాండర్ గా వుంటూ తోటి సభ్యులను ఎదిగించుకోవడం, నాయకత్వ కామ్రేడ్స్ కు రక్షణ వున్నాడు.

కామ్రేడ్ లాల్సు గార్డు కమాండర్ నుండి తెలంగాణ కమ్యూనికేషన్ టీంకు 2021 సంవత్సరంలో బదిలి అయ్యాడు. 2021 నుండి తెలంగాణ కమ్యూనికేషన్ టీం లో పని చేస్తూనే కొరియర్ గా పని చేశాడు. కొరియర్ గా పని చేస్తున్న క్రమంలో తెలుగు భాష మాట్లాడటం నేర్చుకున్నాడు. 2022 సంవత్సరంలో పార్టీ పద్ధతి ప్రకారం కామ్రేడ్ లక్ష్మితో పెళ్లి జరిగింది.

కామ్రేడ్ లాల్సు పీఎల్.జీ.ఏ. 2021 జీరగూడెం అంబూష్, 2023 ధర్మారం పోలీస్ బేస్ క్యాంప్ పై దాడి, 2023 జీరగూడెం అంబూష్ లతో అనేక దాడులలో, యాక్షన్ లలో పాల్గొనాడు. శత్రువు దాడి తీవ్రత పెరుగుతున్న వెనకడుగు వేయకుండ శత్రువుతో ధైర్యంగా పోరాడేవాడు. కామ్రేడ్ లాల్సు ఏరియా, డివిజన్ మిలీషియా కామ్రేడ్స్ కు, దళంలలో వుండే యూనిట్లకు బూబీట్రాప్ ట్రైనింగ్ ఇచ్చాడు. అర్థంకాని విషయాలను అడిగితే కోపం పడకుండా ఓపికతో అర్థం చేయించేవాడు. 2025 సంవత్సరంలో కామ్రేడ్ లాల్సు ను డీవీసీఎమ్ గా ప్రమోట్ అయ్యాడు.

కామ్రేడ్ లాల్సు మాల్టీ టాలెంట్ వున్న కామ్రేడ్ గా ఉద్యమం తీర్చిద్దింది. మంచి కమాండర్ గా, స్నైపర్ గా, కొరియర్ గా, ట్రాక్టర్, బైక్ రిపేరింగ్ చేయడం, ప్రింటర్, మిషన్స్ రిపేర్ కమ్యూనికేషన్ వర్క్ లతో పాటు తుపాకుల తూటాలకు మందుగుండు నింపడం, తుపాకులు రిపేర్ చేయడం నేర్చుకున్నాడు. పార్టీ అవసరాలకు అనుగుణంగా ప్రతి పని తన స్వయం కృషితో నేర్చుకున్నాడు. ఎలక్ట్రానిక్ సంబంధించి ప్రజలకు వచ్చే చిన్న పెద్ద కమ్యూనికేషన్ సమస్యలు తీర్చేవాడు. ప్రజలలో కామ్రేడ్ లాల్సు అంటే చిన్న పిల్లల నుండి ముసలి వారి వరకు అందరితో అప్యాయంగా వుంటూ వారి కష్ట నష్టాలను తెలుసుకునేవాడు. గ్రామాలకు వెళ్లినప్పుడు నేటి యువతరానికీ అర్థమయ్యేలా రాజకీయాలను చెబుతూ మోటివేషన్ చేసేవాడు. ప్రజల ఆదరణతో పాటు అభిమానాన్ని గెలుచుకొని వారి మదిలో చిరస్థాయిగా నిలిచిపోయాడు.

కామ్రేడ్ లాల్సు 2025 మార్చి నెలలో కర్రెగుట్టలలో వేలాది పోలీసులు చేసిన దాడిలో శత్రువుపై దూకి గండి కొట్టి శత్రువుతో పోరాడుతూ వీర మరణం పొందాడు. తను అమరత్వం చెందుతూ నాయకత్వ కామ్రేడ్స్ ను కాపాడాడు. ఒక వీరుడు నేల కొరిగితే ప్రభవింతురు వేల కొలది. కామ్రేడ్ లాల్సు అమరత్వం వృద్ధా కాదు.

**కామ్రేడ్ లాల్సు అమర్ రహే**

# కళాకారుడు, గెరిల్లా యోధుడు, గార్డు కమాండర్

# కామ్రేడ్ సోడి లక్ష్మణ్ కు విప్లవ జోహార్లు

కామ్రేడ్ లక్ష్మణ్ బీజాపూర్ జిల్లా, సూర్ బ్లాక్, పూజారికాంకేర్ పంచాయితీ, కస్తూర్పాడు గ్రామంలో నిరుపేద ఆదివాసీ రైతాంగ కుటుంబంలో 20 సంవత్సరాల క్రితం జన్మించాడు. కామ్రేడ్ లక్ష్మణ్ తల్లిదండ్రులు సోడి ఐతే, సోడి ఐతాల్ లకు ముగ్గురు సంతానంలో కామ్రేడ్ లక్ష్మణ్ రెండోవాడు. అన్న, చెల్లి వున్నారు. కామ్రేడ్ లక్ష్మణ్ తల్లిదండ్రులు బతుకుదెరువు కోసం భూమి లేకపోవడంతో భూమి కోసం కస్తూర్పాడు గ్రామానికి వలస వచ్చారు. కొంత అడవి భూమిని సాగుచేసుకుంటూ అక్కడే స్థిరపడ్డారు. చిన్ననాటి నుండి తల్లిదండ్రులతో పాటు వ్యవసాయ పనులు చేస్తూ పశువులు మేపుతూ ఆట పాటలతో పని చేసేవాడు. ప్రతి పనిలో తల్లిదండ్రులకు తోడుగా వుండేవాడు. కామ్రేడ్ లక్ష్మణ్ అన్న చదువు కోసం స్కూల్ కు వెళ్తే ఇంటి బాధ్యతను తనపై వేసుకొని ముసలి వాళ్లైన తల్లిదండ్రులను చూసుకునేవాడు. తల్లిదండ్రులకు కామ్రేడ్ లక్ష్మణ్ అంటే ఎంతో ప్రేమ.



కామ్రేడ్ లక్ష్మణ్ చిన్ననాటి నుండి విప్లవ వాతావరణంలో పుట్టి పెరగడంతో గ్రామంలో జరిగే పోరాటాలను, ప్రభుత్వ, పోలీసుల దౌర్జన్యాలను చూస్తూ వాటికి వ్యతిరేకంగా పోరాడే పార్టీ రాజకీయాలను, ఆచరణను చూస్తూ ఎదిగాడు. పార్టీ నాయకత్వంలో అమాయక ప్రజలపై ఫారెస్టు అధికారుల జులుంకు వ్యతిరేకంగా, అటవీ ఉత్పత్తుల ధర పెరుదలకై ప్రజలను ఐక్యం చేస్తూ పోరాటాలను నడిపించింది. గ్రామంలో పార్టీ నేతృత్వంలో జరిగే అనేక అభివృద్ధి కార్యక్రమాలలో చిన్నతనం నుండి పాలుపంచుకున్నాడు. అందుకే చిన్నతనం నుండి బాలల సంఘంలో వుంటూ తోటి పిల్లలతో కలిసి ఆట పాటలతో ఆడుతూ గ్రామ రిపోర్టును సేకరించేవాడు. దళం గ్రామానికి చేరుకున్న తరువాత వారికి కావాల్సిన సహాయం చేస్తూ రిపోర్టు, ప్రజల సమస్యలు చెప్పేవాడు. గ్రామంలోని తోటి పిల్లలను కలుపుకునే తత్వం చూసి కామ్రేడ్ లక్ష్మణ్ ను బాలల సంఘానికి బాధ్యుడిగా ఎన్నుకున్నారు. ఆ విధంగా బాలల సంఘంలో పని చేస్తూ 2014 లో చైతన్య నాట్య మంచ్ (సీ.ఎన్.ఎమ్) లో చేరి పార్టీ కార్యక్రమాలలో తనకిచ్చిన బాధ్యతను నేరవేర్చాడు. పార్టీ పిలుపునందుకొని జరిగే మీటింగ్ లలో విప్లవ పాట,ఆట, నాటికలతో ప్రజలను చైతన్యం చేసేవాడు. వ్యవసాయ పనులకు తోడుగా ఎవరు లేరని నేపంతో కామ్రేడ్ లక్ష్మణ్ ను తల్లిదండ్రులు చదువుకు పంపలేదు. అయినప్పటికీ కష్టమైన ఇష్టంతో పాటలను చూడకుండా పాడే వాడు. కామ్రేడ్ లక్ష్మణ్ ప్రజల మనస్సులలో నిలిచిపోయేలా అమరుల త్యాగాలను, ప్రజల సమస్యల పాటలు పాడేవాడు. పూజారికాంకేర్ పంచాయితీలో కామ్రేడ్ లక్ష్మణ్ తెలియని వారు లేరు. చిన్న పిల్లల నుండి చనిపోయే ముసలి వరకు అందరికీ కామ్రేడ్ లక్ష్మణ్ పరిచయం. అందరితో కలివిడిగా వుండేవాడు. గ్రామంలో సీ.ఎన్.ఎమ్. కమాండర్ గా వున్నాడు. పార్టీ పనులను, ఇంటి పనులను సమన్వయంతో చేసేవాడు.

కామ్రేడ్ లక్ష్మణ్ మావోయిస్టు పార్టీ ఆవిర్భవించిన దినం సందర్భంగా జరిగిన మీటింగ్ లో ఆర్.పీ.సీ., సీ.ఎన్.ఎమ్, ఏరియా కమిటీ కామ్రేడ్స్ ముందు తన పార్టీలో పూర్తికాలం పని చేయాలనుకుంటున్నానే ప్రతిపాదనను చెప్పాడు. కామ్రేడ్ లక్ష్మణ్ ప్రతిపాదనను అంగీకరించి 2019 సెప్టెంబర్ 21న పూర్తికాలం కార్యకర్తగా భర్తీ అయ్యాడు. కామ్రేడ్ లక్ష్మణ్ రిక్రూట్ అయిన తరువాత పార్టీ అవసరాల రిత్యా నాయకత్వ కామ్రేడ్ కు రక్షణగా గార్డు బాధ్యతను ఇవ్వాలని డివిజన్ కమిటీ తీర్మాణం చేసింది. ఈ తీర్మాణాన్ని ఆమోదిస్తూ కామ్రేడ్ లక్ష్మణ్ గార్డుగా తన బాధ్యతను చాలా క్రమశిక్షణగా చేసాడు. ఎప్పుడు ఏ పని చెప్పిన కోపం లేకుండా విసుకోకుండా ఓపికగా చేసేవాడు. ఏ పని చెప్పిన నేను చెయ్యను అనే వాడు కాదు. గార్డుగా వుంటేనే సమిష్టి పనులను కూడా చేసేవాడు.

కామ్రేడ్ లక్ష్మణ్ ఇంటి వద్ద చదువుకోలేదు కనుక పార్టీలో రోజు వారిగా చదువటం, రాయటం నేర్చుకున్నాడు. తెలుగు భాష, కోయ భాషలను నేర్చుకోవడం కోసం కృషి చేసేవాడు. మిలటరీ పరంగా కూడా బలంగా వుండేవాడు. సమయం దొరినప్పుడు ఉదయం పీటీ చేసేవాడు. తుపాకులను ఉపయోగించే టెక్నిక్ పై పట్టు సాధించడం కోసం ప్రాక్టీస్ చేసేవాడు. కామ్రేడ్ లక్ష్మణ్ కు తెలిసిన విషయాలను తోటి కామ్రేడ్స్ కు నేర్పించేవాడు. కామ్రేడ్ లక్ష్మణ్ కు దొరికిన టైమ్ లో పార్టీ పుస్తకాలు, పత్రికలు చదివేవాడు. కామ్రేడ్ లక్ష్మణ్ గార్డుగా, కొరియర్ గా పని చేస్తూ తెలుగు భాష మాట్లాడటం, రాయడం, చదవటం నేర్చుకున్నాడు. తనకు తెలియని పదాలను తెలిసిన వారిని అడిగి తెలుసుకొని విషయాలను చర్చించేవాడు.

కామ్రేడ్ లక్ష్మణ్ దళంలోని అందరి అభిమానాన్ని చురగొన్నాడు.

2023 లో కామ్రేడ్ లక్ష్మణ్ ఏసీ గా ప్రమోట్ అయ్యాడు. తనకు తెలియని ఎన్నో పనులను నేర్చుకున్నాడు. బైక్ నడపడం రాకపోవటంతో ఇతరుల సహాయంతో నేర్చుకున్నాడు. రిపేర్ చేయడం కూడా నేర్చుకొని తోటి కామ్రేడ్స్ కు నేర్పించాడు. చిన్ననాటి నుండి పాటలు పాడటం ఇష్టమైన పార్టీ ఇచ్చిన బాధ్యతకు కట్టుబడి గార్డుగా, కొరియర్ గా తన వంతు బాధ్యతను నెరవేర్చాడు.

పీ.ఎల్.జీ.ఏ చేపట్టిన జీరగూడెం దాడిలో, బెజ్జి ఆంబుష్, పామేడ్, ధర్మారం పోలీస్ క్యాంపు పై చేసిన దాడిలో పాల్గొని తనవంతు పాత్ర నిర్వర్తిస్తూ టీ.సీ.ఓ.సీ లలో పాల్గొన్నాడు.

కామ్రేడ్ లక్ష్మణ్ తో వున్న ఎంతో మంది శత్రువు దాడికి భయపడి సరెండర్ అయినప్పటికీ కామ్రేడ్ లక్ష్మణ్ పార్టీపై, ప్రజలపై విశ్వాసాన్ని కోల్పోకుండా ఊగిసలాట లేకుండా పని చేసాడు. తెలంగాణలో జరుగుతున్న నష్టాలకు, శత్రువు దాడులకు భయపడకుండా నిబ్బరంగా పని చేసేవాడు. చిన్న, పెద్ద తేడా లేకుండా అందరి మెప్పు పొందాడు. 2025 మార్చి నెలలో పార్టీ అవసరాల రిత్యా కామ్రేడ్ లక్ష్మణ్ ను మణుగూర్-పాల్వంచ ఏరియాకు బదిలీ చేస్తూ జిల్లా కమిటీ ప్రతిపాదన తీర్మాణం చేసింది. ఆ తీర్మాణానికి కట్టుబడి కామ్రేడ్ లక్ష్మణ్ సంతోషంగా ఒప్పుకున్నాడు. నేను తెలంగాణ కు వెళ్ళి అక్కడ ప్రజలతో కలిసిపోయి వారి భాష నేర్చుకుంటాను. మణుగూరు-

పాల్వంచ ఏరియా కామ్రేడ్స్ డీవీసీ, ఏసీలు అమరులైనారు, వారి బాధ్యత మనపై వుందని మాట్లాడి ఎంతో ఉత్సాహంతో పని చేస్తానని అన్నాడు.

కామ్రేడ్ లక్ష్మణ్ బూబీట్రాప్ పేలి కాలుకు గాయం అయిన కారణంగా కర్రెగుట్టపై ట్రీట్మెంట్ తీసుకుంటున్న సమయంలో కగార్ దాడిలో భాగంగా 2025 మార్చి నెలలో వేలాది బలగాలు కర్రెగుట్టలను చుట్టిముట్టి డ్రోన్, హెలికాప్టర్లతో నిరంతరం బాంబింగ్ చేస్తూ దాడిని మొదలు పెట్టాయి. ద్రోహి ఇచ్చిన సమాచారంతో పేషెంట్లు వున్న డేరాను చుట్టుముట్టి 22 మందిని పట్టుకొని బూటకపు ఎన్కౌంటర్ చేశారు. అందులో కామ్రేడ్ లక్ష్మణ్ అమరుడయినాడు.

**కామ్రేడ్ లక్ష్మణ్ అమర్ రహే**

# సాహసిక గెరిల్లా యోధుడు, విశ్వాసనీయమైన కమాండర్

# కామ్రేడ్ మాడవి సోమాల్ (ఉంగాల్) కు విప్లవ జోహార్లు

కామ్రేడ్ సోమాల్ సుక్మా జిల్లా, కుంట ఏరియా, పోలెంపల్లి పంచాయితీ, పోలెం గ్రామంలో పేద ఆదివాసీ విప్లవ రైతాంగ కుటుంబంలో 30 సంవత్సరాల క్రితం జన్మించాడు. తల్లి నందే, తండ్రి జోగాల్ లకు నాలుగురు సంతనంలో కామ్రేడ్ సోమాల్ మూడోవాడు. కామ్రేడ్ సోమాల్ చిన్ననాటి నుండి తల్లిదండ్రులతో పాటు వ్యవసాయ పనులు నేర్చుకుంటూ అన్ని పనులలో చేదోడు వాదోడుగా పని చేస్తూ పెరిగాడు. కామ్రేడ్ సోమాల్ చిన్నతనంలోనే తల్లిదండ్రులు అనారోగ్య కారణంగా చనిపోయారు.



కామ్రేడ్ సోమాల్ చిన్ననాటి నుండి విప్లవ రాజకీయాల పాటలు, మాటలు వింటూ పెరిగాడు. చిన్నతనం నుండి బాలల సంఘంలో పని చేస్తూ తోటి పిల్లలతో పార్టీ చేపట్టే మీటింగ్ లలో పాల్గొంటూ ప్రజల బాధలను, కష్టాలను తీర్చే మార్గాన్ని అర్థం చేసుకున్నాడు. 15 సంవత్సరాల తరువాత బాలల సంఘం నుండి మిలీషియాలో చేరాడు. మిలీషియా లో వుంటూ ప్రజలకు రక్షణ గా సెంట్రీలు చేస్తూ శత్రువు వచ్చే దిశలో బూబీట్రాప్ పెట్టి శత్రువును చికాకు పరిచే దాడులలో కామ్రేడ్ సోమాల్ తన వంతు బాధ్యతను నిర్వర్తించాడు. బియ్యం, కూరగాయాలు, రేషన్ లాంటి శత్రువు సప్లై దాడి చేసి వాటిని జప్తు చేసుకొని ప్రజలకు, పీ.ఎల్.జీ.ఏ కు అందించడంలో తనవంతు పాత్ర వుంది. ఈ క్రమంలో 2005న కేంద్ర, రాష్ట్ర రాష్ట్ర ప్రభుత్వాలు తలపెట్టిన సల్వాజుడుం పేరుతో ప్రజలను హింసిస్తూ మహిళలపై అత్యాచారాలు చేస్తు పాశవికంగా హత్యలు చేసి నరహంతక పాలన కొనసాగిస్తూ దాడులు చేసింది. ఈ దాడులను చూస్తూ కామ్రేడ్ సోమాల్ శత్రువు నిర్మూలనకై జల్-జంగల్-జమీన్- ఇజ్జత్ అధికారంకై, నూతన ప్రజాస్వామిక విప్లవ విజయాని కాంక్షిస్తూ కామ్రేడ్ సోమాల్ 2008 సంవత్సరంలో కుంట దళంలో పూర్తికాలం కార్యకర్తగా రిక్రూట్ అయ్యాడు.

కామ్రేడ్ సోమాల్ 2008 నుండి 2 సంవత్సరాల కాలం కుంట దళంలో పని చేసాడు. ప్రజలతో కలిసిపోయి వారి సమస్యలను అర్థం చేయించేవాడు. కామ్రేడ్ సోమాల్ ఇంటి దగ్గర చదువుకోలేదు కావున పార్టీలో హింది, కోయ చదవటం, రాయటం నేర్చుకున్నాడు. పార్టీ అవసరాల రీత్యా 2010 సంవత్సరంలో సెంట్రల్ రిజినల్ కంపెనీ కామ్రేడ్ సోమాల్ బదిలీ అయ్యాడు. కామ్రేడ్ సోమాల్ కంపెనీలో వుంటూ పార్టీ క్రమశిక్షణ పాటిస్తూ అందరితో కలిసి పని చేసేవాడు. కామ్రేడ్ సోమాల్ మిలటరీ పరంగా దృఢంగా వుంటూ శత్రువుతో పోరాడంలో ముందుండేవాడు. సెంట్రల్ రిజినల్ కంపెనీ అనేక రాష్ట్రాలకు వెళ్లు అక్కడి ప్రజలతో కలిసి వారి భాషను నేర్చుకోవడం, వారికి పార్టీ రాజకీయాలను బోధించేవాడు. కామ్రేడ్ సోమాల్ ఓపికగా వుంటూ అన్ని పనులను సమన్వయం చేసేవాడు. ప్రజల మద్దతుతో బాధ్యులు అప్పగించిన పనిని చేయడానికి ప్రయత్నించేవాడు.

కామ్రేడ్ సోమాల్ 2016 సంవత్సరంలో పీ.పీ.సీ.ఎమ్. గా ప్రమోట్ అయ్యాడు. కామ్రేడ్ సోమాల్ సెక్షన్ డిప్యూటీ కమాండర్ గా వుంటూ

సభ్యులకు రాజకీయాలతో పాటు పీటీ, డిల్స్ రిహారసల్ చేయిస్తూ మిలటరీ విషయాలు నేర్పించేవాడు. తనకు అప్పగించిన చిన్న, పెద్ద పనులను చేస్తూ తోటి సభ్యులకు నేర్పించేవాడు. శత్రువు పీ.ఎల్.జీ.ఏ. పై చేసిన అనేక దాడులలో కామ్రేడ్ సోమాల్ సాహసికంగా పోరాడుతూ నాయకత్వాని కాపాడడంలో ముందుండే వాడు.

**మిలటరీరంగంలో కామ్రేడ్ సోమాల్ పాత్ర :**

శత్రువు పై పీ.ఎల్.జీ.ఏ చేసిన 2010 ముక్రామ్ దాడి, 2012 కోటీగూడ శ్రీరాంపూర్ (ఒడిషా రాష్ట్రం), 2013 జీరంఘాటీ దాడి, కుర్నపల్లి (తెలంగాణ రాష్ట్రం) దాడి, 2015 జప్పూర్ దాడి, 2018 బూర్కపాల్ దాడిలో, 2020 ఎర్రంపల్లి దాడి, టోండమ్ దాడి, కసాల్పాడు దాడి, మినప దాడి, 2021 లో జీరగూడెం, పాలచెలిమ దాడి, 2022 సంవత్సరంలో పోత్కేల్ దాడి, 2023 లో కొండ సావల్ దాడి (అరన్ పూర్), 2024 ధర్మారం క్యాంపుపై దాడి సాహసిక దాడిలో, జీరగూడెం దాడిలో పాల్గొనాడు. 2024 సంవత్సరంలో కొత్తగా వచ్చిన పోలీస్ క్యాంపులపై చేసిన దాడులలో కామ్రేడ్ సోమాల్ తన వంతు బాధ్యతను నిర్వర్తించాడు. కామ్రేడ్ సోమాల్ శత్రువును చికాకు పరిచే చిన్న, పెద్ద చర్యలను నిర్వహించేవాడు. కామ్రేడ్ సోమాల్ మిలటరీ సాహసిక యోధ.

కామ్రేడ్ సోమాల్ 2024 సంవత్సరంలో తెలంగాణ రాష్ట్ర కమిటీ సప్లై దళం కమాండర్ గా బదిలీ అయ్యాడు. కామ్రేడ్ సోమాల్ శత్రువు దాడి మధ్యలోనే తప్పుకుంటూ సప్లై పనులు చేసేవాడు. కంపెనీ కమాండర్ అమరుడైనప్పటికీ ధైర్యంగా వుంటూ కష్ట నష్టాలను ఓర్చుకుంటూ పార్టీలోకి చివరి వరకు పని చేసాడు. కామ్రేడ్ సోమాల్ శత్రువు చేసే దాడులకు, దుష్ ప్రచారాలను లోనుకాకుండా ప్రజలపై విశ్వాసంతో 16 సంవత్సరాలు రాజకీయంగా, మిలటరీ పరంగా ఎదుగుతున్న కామ్రేడ్.

కామ్రేడ్ సోమాల్ 2025, మే 6న బీజాపూర్ జిల్లా, ఊసూర్ బ్లాక్, పూజారికాంకేర్ కర్రెగుట్టలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేసిన దాడిలో అమరుడయ్యాడు. కామ్రేడ్ సోమాల్ అమరత్వం నష్టాన్ని కలిగించినప్పటికీ ప్రజా ఉద్యమంలో వీరులు మళ్ళీ పుడుతారని ఆశిస్తూ అమరుడు కామ్రేడ్ సోమాల్ ఆశయాలను కొనసాగిద్దాం.

## దండకారణ్య పోరుబిడ్డ కామ్రేడ్ వీణ (కుంజం భీమే) కు విప్లవ జోహార్లు

కామ్రేడ్ వీణ బీజాపూర్ జిల్లా, పామేడ్ ఏరియా, కొమట్ పల్లి పంచాయితీ, తుండెం గ్రామంలో పేద ఆదివాసీ కుటుంబంలో తల్లిదండ్రులు మొదటి సంతనంగా కామ్రేడ్ కుంజం భీమే 22 సంవత్సరాల క్రితం జన్మించింది. చిన్నప్పుడే అనారోగ్యంతో అమ్మ చనిపోవడంతో కామ్రేడ్ భీమే అమ్మలాగా కుటుంబ బాధ్యతను నేరవేర్చడం కోసం బాగా కష్టపడింది. నాన్నకు మద్దతుగా వ్యవసాయ పనులు, ఇంటి పనులు, పశువులు మేపడం, తోటి చెల్లెలను, తమ్ముళ్ళను చూసుకోవడం తన వయస్సుకు మించి పని చేసింది. కామ్రేడ్ భీమే విప్లవ ప్రజల మధ్య కష్టాలను, నష్టాలను చూస్తూ పెరిగింది. చిన్ననాటి నుండి ఇంటి పనులు చేస్తూనే బాలల సంఘంలో పని చేసింది. గ్రామంలో కుంటలు పోయడం, రోడ్లు వేయడం, భూమి సమతలీకరణ లాంటి సమిష్టి పనులలో పాల్గొనేది. అలా పని చేస్తూ ప్రజల పాటలు, మాటలు, రాజకీయాలు వింటూ పెరిగింది.

తన తల్లి చావుకు కారణం ప్రభుత్వమే అని అర్థం చేసుకుంది. సరైన వైద్యం లేక తన తల్లి దూరం అయ్యిందని తన లాంటి వాళ్ళు ఎంతో మంది దేశంలో వున్నారు. దేశంలో జరిగే దోపిడిని అర్థం చేసుకుంది. 2022 సంవత్సరంలో పూర్తికాలం కార్యకర్తగా తెలంగాణ రాష్ట్రం వెంకటపురం–వాజేడు ఏరియా కమిటీ దళంలో రిక్రూట్ అయ్యింది. కామ్రేడ్ కుంజం భీమే, వీణగా పేరు మార్చుకుంది.



కామ్రేడ్ వీణ ఇంటి వద్ద చదువుకోలేదు. దళంలో తెలుగు రాయడం, చదవడం నేర్చుకోవడానికీ ప్రయత్నం చేసేది. తొందరగానే తెలుగు రాయడం, చదవటం నేర్చుకొని కొత్తగా వచ్చిన తోటి కామ్రేడ్స్ కు నేర్పించేది. మిలటరీ పరంగా పీటీ చేస్తూ తుపాకులను ఎలా వుపయోగించాలో నేర్చుకుంది. పార్టీలో వయస్సు పైబడిన వారికి మద్దతునిస్తూ గౌరవించేది.

కామ్రేడ్ వీణ తన తోటి అనారోగ్య కామ్రేడ్స్ మద్దతుగా సేవలు చేసింది. అలా సేవలందిస్తున్న సమయంలో కగార్ దాడిలో భాగంగా 2025, మే 6న బీజాపూర్ జిల్లా, ఊసూర్ బ్లాక్, పూజారికాంకేర్ కర్రెగుట్టలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వేలాది బలగాలతో కర్రెగుట్టలను చుట్టిముట్టి డ్రోన్, హెలికాప్టర్లతో నిరంతరం బాంబింగ్ చేస్తూ దాడిని మొదలు పెట్టాయి. ద్రోహి ఇచ్చిన సమాచారంతో పేషెంట్లు వున్న డేరాను చుట్టుముట్టి 22 మందిని పట్టుకొని హత్య చేశారు. అందులో కామ్రేడ్ వీణ అమరురాలైంది.

**కామ్రేడ్ వీణ అమర్ రహే.**

# కామ్రేడ్ కమల్ కు విప్లవ జోహార్లు

కామ్రేడ్ కార్టం కమల్ ఛత్తీస్ ఘడ్ రాష్ట్రం, బీజాపూర్ జిల్లా, పామేడ్ ఏరియా, దామరాం గ్రామంలో నిరుపేద ఆదివాసీ కుటుంబంలో తల్లి ఉంగీ, తండ్రి అడ్మాల్ లకు 3వ సంతనంగా 23 సంవత్సరాల క్రితం పుట్టాడు. కామ్రేడ్ కమల్ చిన్ననాటి నుండి క్రాంతికారీ పార్టీ ప్రభావం వున్న ప్రాంతంలో పార్టీ చేపట్టే మీటింగ్ లలో పాల్గొంటూ విప్లవ మాటలు, పాటలు వింటూ నాటికలు చూస్తు పెరిగాడు. చిన్ననాటి నుండి తోటి పిల్లలతో పాటు కామ్రేడ్ కమల్ బాలల సంఘంలో వుంటూ ఆడుతూ పాడుతుండేవాడు. తల్లిదండ్రులతో పాటు పశువులు మేపడం, వ్యవసాయ పనులలో పాల్గొంటూ వారికి చేదోడు వాదోడుగా వుంటూ పనులను నేర్చుకున్నాడు.

కామ్రేడ్ కమల్ 15 సంవత్సరాల వయస్సులో మిలిషీయా పని చేయాలని నిర్ణయించుకున్నాడు. మిలిషీయాలో వుంటూ పార్టీ పిలుపునందుకొని విప్లవ దినాలను పోస్టర్స్, బ్యానర్స్ ను కూడలి రోడ్ల వద్ద వేసి ప్రచారం చేసే కార్యక్రమంలో కామ్రేడ్ కమల్ పాల్గొనాడు. విప్లవ ప్రాంతంలో పార్టీ చేపట్టే మీటింగ్స్ కు, భూమి సమతలీకరణ ప్రోగామ్స్ చేసేటప్పుడు ప్రజలకు రక్షణగా సెంట్రీ, పెట్రోలింగ్ బాధ్యతగా చేసేవాడు. పోలీస్ బలగాలు గ్రామాలపై పడి ప్రజలను, వారి సంపదను నష్టం పరిచేవారు. శత్రువును దెబ్బతీయడంలో భాగంగా చిన్న చిన్న ఘటనలలో తన వంతుగా పాల్గొనాడు. పార్టీ చేప్పే రాజకీయాలను, ప్రజల సమస్యలను, శత్రువు చేసే దాడులను అర్థం చేసుకున్నాడు. ఈ సకల సమస్యలకు కారణం దోపిడి అని దీనిని అంతం చేయాలంటే ప్రతి ఇంటి నుండి సాయుధ పోరాటంలో భాగం కావాలని ఆలోచించి 2024 సంవత్సరంలో తెలంగాణ రిజినల్ కంపెనీ లో పూర్తికాలం కార్యకర్తగా భర్తీ అయ్యాడు.

కామ్రేడ్ కమల్ చదువుకోలేదు. పార్టీలోనే చదవటం, రాయడం పట్టుదలతో నేర్చకోవడానికీ ప్రయత్నించేవాడు. పార్టీలోని తోటి కామ్రేడ్స్ తో కలిసి మెలిసి వుంటూ అన్ని పనులలో పాల్గొనేవాడు. తనకు అర్థంకాని విషయాలను అడిగి తెలుసుకునేవాడు. కమాండర్ చెప్పిన విషయాలు అమలు చేసేవాడు. మిలటరీ పరంగా రోజు ట్రైనింగ్ అవుతూ పీటీ చేసేవాడు.

కామ్రేడ్ కమల్ ను పార్టీ అవసరాల రీత్యా తెలంగాణ వెళ్ళి అక్కడి ప్రజలతో కలిసి తెలుగు, దొర్ల నేర్చుకుంటూ పని చేస్తున్న క్రమంలో దోపిడీ ప్రభుత్వాలు కగార్ దాడిలో భాగంగా 2024 డిసెంబర్, 1న ములుగు జిల్లా ఏటూరునాగారం ఏరియాలో చల్పాక అడవి ప్రాంతంలో జరిగిన బూటకపు ఎన్కౌంటర్ లో కామ్రేడ్ కమల్ అమరుడయ్యాడు. చాలా తక్కువ సమయంలోనే కామ్రేడ్ కమల్ అమరుడు కావడం బాధకరం. లేలేత ప్రయంలో ప్రజల కోసం తన ప్రాణాలు అర్పించాడు.

**కామ్రేడ్ కమల్ అమర్ రహే**

**2025 ఎప్రిల్ 21 నుండి మే 11 వరకు కర్రెగుట్టలను ఛత్తీస్ఘడ్, తెలంగాణ, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, ఒడిస్సా, జార్ఖండ్ రాష్ట్రాల పోలీసులతో పాటు కేంద్ర పోలీస్ బలగాలు, కమాండో ఫోర్స్, భారత సైన్యం, భారత వైమానిక సైన్యం కలిసి 50-60 వేల సంఖ్యలో బలగాలు చుట్టుముట్టాయి. ఈ చుట్టివేత దాడిలో శత్రువుతో పోరాడుతూ 35 మంది కామ్రేడ్స్ అమరులయ్యారు.**

**కర్రెగుట్ట అమరులకు విప్లవ జోహార్లు**


కామ్రేడ్ లాల్సు (డీవీసీఎమ్)


కామ్రేడ్ సోమాల్ (ఏసీఎమ్)


కామ్రేడ్ మంజుల (ఏసీఎమ్)


కామ్రేడ్ లక్ష్మణ్ (ఏసీఎమ్)


కామ్రేడ్ రాధ (పీఎమ్)


కామ్రేడ్ రామే (పీఎమ్)


కామ్రేడ్ జ్యోతి (పీఎమ్)


కామ్రేడ్ రవి (పీఎమ్)


కామ్రేడ్ ఉంగీ (పీఎమ్)


కామ్రేడ్ భారతి (పీఎమ్)


కామ్రేడ్ వీణ (పీఎమ్)


కామ్రేడ్ భీమ (పీఎమ్)


కామ్రేడ్ సన్నీ (పీఎమ్)


కామ్రేడ్ సరిత (పీఎమ్)


కామ్రేడ్ వాసు (పీఎమ్)


కామ్రేడ్ జోగి (పీఎమ్)

నోట్ : మిగతా 29 కామ్రేడ్స్ ఫోటోలు వారి వివరాలు మాకు దొరకనందు వలన ఇందులో అచ్చువేయటం లేదు.

# జోవో నెం. 49 శాశ్వత రద్దుకై ఐక్యంగా పోరాడండి

దేశీ విదేశీ కార్పొరేట్ ప్రయోజనాల కోసం బ్రాహ్మణీయ హిందుత్వ ఫాసిస్టు బీజేపీ కేంద్ర ప్రభుత్వం, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కలిసి ఆదివాసీ ప్రజల అస్తిత్వాన్ని దెబ్బతిస్తున్నాయి. జాతీయ పులుల సంరక్షణ పేరుతో తెలంగాణ ప్రభుత్వం, పులుల సంరక్షణ ముసుగులో కార్పొరేట్ మరియు పెట్టుబడిదారుల ప్రయోగజనాల కోసం అటవీ ప్రాంతాల నుండి స్థానిక ప్రజలను తరలించి అక్కడి భూములను, ఖనిజాలను, అటవీ సంపదను దోపిడి దారులకు అప్పగించడానికి ప్రయత్నిస్తోంది. అందులో భాగంగానే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అధికారంలోకి వచ్చిన నాటి నుండి దేశంలోని అడవులను దేశీ విదేశీ కార్పొరేట్లకు ధారదత్తం చేయడానికి ఆదివాసీ చట్టాల సవరణకు పూనుకుంటుంది. అందులో భాగంగానే తెలంగాణ రాష్ట్రం, కొమరం భీం-అసిఫాబాద్ జిల్లాలోని ప్రజల జీవితాలను అస్తవ్యవస్తం చేసే జీవో నెం. 49ను మే 2025న ప్రవేశ పెట్టింది.



భారతదేశంలోని మైదాన ప్రాంతాలు, చెరువులు, నదులు, కొండలు, గుట్టలు మొదలగు వాటిని సర్వనాశనం చేసిన దోపిడీదారులు అప్పగించడానికి కంకణం కట్టుకున్నాయి. వేల సంవత్సరాలుగా అడవిని, అడవిలోని అన్ని రకాల జంతువులను కాపాడుతూ సహజీవనం చేస్తున్న మూలవాసులను అడవికి దూరం చేసి, వారి జీవనానికీ మరియు ముఖ్యంగా అటవీ సంపదను కొల్లగొట్టడానికి ప్రయత్నం చేస్తున్నాయి. తెలంగాణలో ప్రస్తుతం వున్న 33 జిల్లాలలో 3 జిల్లాలు పూర్తిగా కనుమరుగువుతాయి. 119 నియోజకవర్గాల్లో సుమారు 10 నియోజకవర్గాలు రానున్న రోజుల్లో వాటి ఊసే తెలంగాణ చిత్రపటంలో కనపడవు.

టైగర్ ఫారెస్టు కారిడార్ పేరుతో ఆసిఫాబాద్, సిర్పూర్ నియోజకవర్గాల్లోని సిర్పూర్ (యు), వాంకిడి, జైనూర్, కెరమేరి, ఆసిఫాబాద్, రెబ్బన, కాగజ్ నగర్, నార్నూర్, సిర్పూర్ (టీ), చింతల మానపల్లి, గాజుగూడ, బెజ్జూర్, లింగాపూర్, పెంచికలపేట మొదలగు మండలాల లక్షలాది మంది ప్రజలను ఖాళీ చేయాలని ఒత్తిడి చేస్తున్నారు. ఇప్పటికే ప్రభుత్వం అనాలోచిత నిర్ణయాల వలన ఐక్య రాజ్యసమితి నిపుణులు మరియు మానవహక్కుల విభాగం భారత ప్రభుత్వానికి ఈ ప్రయత్నాలు మానుకోవాలని విజ్ఞప్తి చేసింది. అడవిలోని సంపదకు, మొత్తం భూభాగానికి హక్కుదారులు మూలవాసులైన ఆదివాసులేనని భారత రాజ్యాంగం, ఐక్యరాజ్య సమితి పదే పదే గుర్తు చేస్తున్న పాలకులు వారి విధానాలను మార్చుకోవటం లేదు. మోడీ, అమిత్ షా మానసపుత్రులైన అదాని, అంబాని మరియు కార్పొరేట్ సంస్థల కోసమే ప్రభుత్వాలు పని చేస్తున్నాయి.

మూడు లక్షల 65 వేల ఎకరాల పంట భూములు, చెరువులు, కుంటలు, ఇండ్లు వున్నాయి. అసిఫాబాద్, కాగజ్ నగర్ నియోజకవర్గాల పరిధిలోని ఆదివాసీ తెగలను తుడిచివేయడానికి, కొమరం భీమ్ పోరాట పటిమను తప్పుదోవ పట్టిస్తూ ప్రజలను భ్రమలో ముంచడానికి పోరాట యోధుడైన కొమరం భీమ్ పేరును పులుల సంరక్షణ కేంద్రానికి పెట్టారు. చట్టాల సవరణ చేస్తూ జీవోలను ప్రవేశపెట్టడంలో దోపిడీ దారుల ప్రయోజనం వుందని స్పష్టంగా అర్థమవుతుంది.

అభయారణ్యం పేరుతో తెలంగాణలో మంచిర్యాల జిల్లాలోని కవ్వాల టైగర్ రిజర్వ్, మహబూబ్ నగర్ జిల్లా అమ్రాబాద్ లో రెండవ టైగర్ రిజర్వ్ స్థాపించబడ్డాయి. ఆదివాసుల నివాసాల నుండి, భూముల నుండి, జీవన వైవిధ్యం నుండి, జీవిక నుండి ఆదివాసులను బలవంతంగా గెంటివేసి దుశ్చర్యకు పాల్పడుతున్నారు. ప్రభుత్వాలు గ్రామ పంచాయితీ ఆదివాసీ ప్రజల అభిప్రాయాలు తీసుకోకుండా బూటకపు గ్రామసభ తీర్మాణాలు చేసి టైగర్ జోన్ లను ఏర్పాటు చేస్తున్నారు. ఆదివాసులు పోరాడి సాధించుకున్న 1/70, పెసా, అటవీ హక్కుల చట్టం 2006, రాజ్యాంగంలోని షెడ్యూల్ 5, 6 చట్టాలకు వ్యతిరేకంగా జీవో నెం. 49ని ప్రవేశ పెట్టింది. అడవినే నమ్ముకున్న ఆదివాసీ, ఆదివాసేతర ప్రజల జీవించే హక్కును హరించి వేస్తుంది. దేశ జీవవైవిధ్యాన్ని నాశనం చేస్తూ విధ్వంసం చేస్తుంది.

స్వాతంత్రం వచ్చి 78 సంవత్సరాలు అయినప్పటికీ అటవీ ప్రాంతంలో నివసిస్తున్న గిరిజనులకు, గిరిజనేతర ప్రజలకు జీవించే భద్రత లేదు. అటవీ హక్కు పత్రాలు లేవు, పోడు భూములను పట్టాలు ఇవ్వడం లేదు. పోడు వ్యవసాయం చేసి బ్రతికే ఆదివాసీ, ఆదివాసేతరులపై ఫారెస్టు అధికారులు చిత్ర హింసలకు, దాడులకు పాల్పడుతున్నారు. ఆదివాసీ ప్రజల గురించి పట్టించుకోని ప్రభుత్వాలు పులుల సంరక్షణ గురించి మాట్లాడుతూ సంరక్షణ కేంద్రాలు ఏర్పాటు చేయడం ఎండమావి లాంటిదే.

జీవో 49 వల్ల ఆదివాసీ సమాజం ఎదుర్కొంటున్న తీవ్ర సమస్యలు, ఆదివాసీల సంస్కృతి, సంప్రదాయాలపై, అటవీ హక్కులు, భూములపై జీవో 49 చూపుతున్న ప్రతికూల ప్రభావాలకు వ్యతిరేకంగా ప్రజలు పోరాటాలను చేపట్టారు. గత 4 నెలల కాలం నుండి ఆదివాసీ ప్రజలు వారికి మద్దతు అనేక ప్రజా సంఘాలు, ఆదివాసీ సంఘాలు, విద్యార్థి సంఘాలు, మహిళా సంఘాలు, హక్కుల సంఘాలు కలిసి ఐక్య కార్యాచరణ చేపడుతూ అనేక రూపాలలో పోరాటాలు చేపడుతున్నాయి. అయినప్పటికీ ప్రభుత్వం స్పదించక పోవడంతో జీవో 49 రద్దు చేసే వరకు సర్పంచ్, ఎమ్.పీ.టీ.సీ, జెడ్.పీ.టీ.సీ ఎన్నికల్లో ఓట్లు అడగవద్దని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ, జీవో రద్దు చేసిన తదుపరి ఓట్లకు రావాలని డిమాండ్ చేశారు. దీంతో తాత్కాలికంగా జీవో అమలును నిలిపి వేశారు.

రాష్ట్ర ప్రభుత్వం అధికారిక లెక్కల ప్రకారం సుమారు 12 లక్షల ఎకరాలలో పోడు వ్యవసాయం చేస్తున్న ఆదివాసులకు భూమి హక్కు పత్రాలు కల్పిస్తామని హామీలు ఇచ్చినప్పటికీ దానిని అమలు చేయడం లేదు. కాబట్టి ప్రభుత్వం వెంటనే ఫీల్డ్ సర్వే చేసి పోడు వ్యవసాయం చేస్తున్న ఆదివాసులకు పట్టా సర్టిఫికెట్స్ ఇచ్చి భూమాతలో నమోదు చేయాలి. ఆదివాసీలకు రైతు భరోసాతో పాటు న్యాయ సమ్మతమైన, రాజ్యాంగబద్ధమైన చట్టబద్ధమైన డిమాండ్ల అమలుకై ఐక్యంగా పోరాడండి. ఆదివాసీ అస్థిత్వానికే ప్రమాదం తెచ్చే పెట్టే జీవో 49 ను పూర్తిగా రద్దు చేసే వరకు రాజీలేని పోరాటాలు చేపట్టాలి.

## పోరాట వార్తలు

**అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల ధర్నా**

రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల శాఖల్లో లక్షలాది మంది ఉద్యోగులు 20–25 సంవత్సరాల నుంచి కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులుగా ఉద్యోగ భద్రత, సరైన వేతనాలు లేక పని చేస్తున్నారు. నెలా నెల సక్రమంగా వేతనాలు చెల్లించడం లేదనంటూ తన సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ హైదరాబాద్ ఇందిరాపార్క్ ధర్నాచౌక్ వద్ద అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు ధర్నా నిర్వహించారు.

రాష్ట్ర ప్రభుత్వంలో వివిధ శాఖల్లో 2 లక్షల 50 వేల మంది అవుట్ సోర్సింగ్ ఉద్యోగులుగా ఏళ్ల తరబడి పని చేస్తున్నా తక్కువ వేతనం ఇస్తున్నారని, అవి కూడా సక్రమంగా చెల్లించడం లేదు. సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని సుప్రీంకోర్టు చెప్పింది. 240 రోజుల రెగ్యులర్ గా పని చేసిన వారిని పర్మినెంట్ చేయాలని రాజస్థాన్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల కేసుల్లో సుప్రీంకోర్టు తీర్పులు చెప్పింది. అయినప్పటికీ అమలు కావడం లేదని ఉద్యోగులు ఆవేదనను వ్యక్తం చేశారు పక్క రాష్ట్రాలైన కర్ణాటక, తమిళనాడు, కేరళ, ఒరిషా, పశ్చిమ బెంగాల్, పంజాబ్ రాష్ట్రాలు కాంట్రాక్టు ఉద్యోగులను పర్మినెంట్ చేశాయని కానీ తెలంగాణ రాష్ట్రంలో అమలు కావడం లేదని తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని వ్యక్తం చేసారు.



**వైద్యశాఖలో కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ నర్సుల నిరసన**

తెలంగాణ వైద్యశాఖలో కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ నర్సులు గత 10 సంవత్సరాలుగా సేవలందిస్తున్నారు. వారిని శాశ్వత ప్రాతిపదికన నర్సులను నియమించుకున్నామని హామీ ఇచ్చిన ప్రభుత్వం ప్రస్తుతం వారిన తొలగింపుకు పూనుకున్నది. రాష్ట్రంలో వివిధ ప్రభుత్వ ఆసుపత్రుల్లో వందలాది మంది కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ నర్సులు చాలా సంవత్సరాలుగా పని చేస్తున్నారు. కోవిడ్–19 మహమ్మారి సమయంలో కీలక పాత్ర పోషించారు. ఇప్పటికీ సేవలందిస్తూ పని చేస్తున్న నర్సులను పర్మినెంట్ చేయకుండా వారి తొలగించడం సిగ్గుచేటు. రాష్ట్ర వ్యాప్తంగా కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ నర్సులందర్నీ రోడ్డున పడేసి, వారి పొట్ట చేసింది. వారి కుటుంబ పోషణ భారమై దుర్భరమైన జీవితాలు వెళ్లదీస్తున్నారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం స్పందించి తొలగించిన కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ నర్సులను విధుల్లోకి తీసుకోవాలని, వారిని పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేస్తూ ప్లకార్డులు పట్టుకుని పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ డిహెచ్ఏంఎస్ కార్యాలయం ఎదుట నర్సులు నిరసన వ్యక్తం చేశారు. తమ బాధలను పరిష్కరించాలంటూ వచ్చిన నర్సులను పోలీసులు అడ్డుకుని బలవంతంగా అరెస్టు చేసి వివిధ పోలీస్ స్టేషన్లకు తరలించారు. అయినప్పటికీ తమను విధుల్లోకి తీసుకునే వరకు పోరాటం కొనసాగిస్తామని అన్నారు.

**ఫార్మాసిటీ బాధిత రైతుల హెచ్చరిక**

రంగారెడ్డి జిల్లా ఫార్మాసిటీ భూములను ఫ్యూచర్ సిటీకి ఉపయోగిస్తామని రైతులకు భూములు తిరిగి ఇచ్చేది లేదని ఎమ్మెల్యే మాట్లాడటంతో రైతులు ఆవేదనను వ్యక్తపరిచారు. గతంలో ఎన్నికల్లో గెలవడం కోసం రైతుల వెంట వుండి ఫార్మాసిటీకి వ్యతిరేకంగా ఉద్యమం చేసిన రాజకీయ నాయకులు నేడు పదవులు చేపట్టగానే ఫార్మా రైతులకు అన్యాయం చేస్తున్నారు.

ఫార్మా గ్రామాలైన నానక్ నగర్, తాటిపర్తి, కర్మిద్ద, మేడిపల్లి గ్రామాలకు చెందిన రైతులు మేడిపల్లి లో ఫార్మా వ్యతిరేక పోరాట కమిటీ ఆధ్వర్యంలో ఫార్మాకు ఇవ్వని భూముల జోలికి రాకుండా ప్రభుత్వం ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని రైతులు ముక్త కంఠంతో నినదించారు. మా భూములు మాకే కావాలి. హైకోర్టు ఆర్డర్ ను వెంటనే అమలు చేయాలి. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించకపోతే ఉద్యమానికి సిద్ధంగా వున్నామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

**నిరుద్యోగుల పోరు ఘర్జన**

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చింది. రాష్ట్రంలో 2 లక్షల ఉద్యోగాలను వెంటనే భర్తీ చేస్తామని ఎన్నికల్లో గెలిచిన తరువాత ఉద్యోగ అవకాశాలు కల్పించడం లేదు. పీజీలు, పీహెచ్డీలు చేసి



ఉద్యోగాలు లేక ఆటోలు నడుపుకుంటున్న యువకులు ప్రభుత్వానికి కన్పించడం లేదా అంటూ ప్రశ్నించారు. జాబ్ క్యాలెండర్ ఏమైందని, రాష్ట్రంలో నిరుద్యోగులు చనిపోతున్నారు ఇంకెంత మంది చనిపోయాలని ప్రభుత్వాన్ని నిలదీశారు. ప్రభుత్వం నిరుద్యోగులకు వెంటనే ఉద్యోగ అవకాశాలు కల్పించకపోతే పోరాటాలను చేపడతామని హెచ్చరించారు.

**ప్రయివేటు మెడికల్ కాలేజీలో స్టైఫండ్ కోసం ఎంబీబీఎస్ విద్యార్థుల నిరసన**

ప్రయివేటు మెడికల్ కాలేజీ వైద్య విద్యార్థులకు నేషనల్ మెడికల్ కమిషన్ నిర్దేశించిన ప్రకారం ప్రభుత్వ, ప్రైవేటు మెడికల్ కాలేజీల్లో స్టైఫండ్ చెల్లించాలి. కానీ ప్రైవేటు కాలేజీల్లో మాత్రం విద్యార్థుల నుండి అడ్వాన్స్ గా డబ్బులు వసూలు చేసి వాటినే ఇన్ స్టాల్మెంట్స్ రూపంలో చెల్లిస్తూ స్టైఫండ్ అంటూ మోసం చేస్తున్నారు. ఇదేమిటని అడిగిన విద్యార్థులపై మెడికల్ కాలేజీలు దౌర్జన్యంగా భయపెడుతున్నారు. ఇంటర్నల్స్, ఇతర పరీక్షలు, అటెండెన్స్ తో సహా అనేక అంశాల్లో కోర్సు పూర్తి చేయకుండా అడ్డుకుంటామని బెదిరిస్తున్నారు. చిన్న చిన్న కారణాలలతో విద్యార్థులను సస్పెండ్ చేస్తుండటంతో చాలా మంది విద్యార్థులు ప్రశ్నించడం మానేశారు. ఎవరైనా డిమాండ్ల పరిష్కారం కోసం ఆందోళన చేసే పరిస్థితి లేకుండా పోయిందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్ఎంసీ తనిఖీలకు వచ్చేప్పుడు ముందస్తుగా అకౌంట్లలో స్టైఫండ్ వేసి తర్వాత నగదు రూపంలో తీసేసుకుంటున్నారు.

కరీంనగర్ చల్మెడ మెడికల్ విద్యార్థులు తమ డిమాండ్ల పరిష్కారం కోసం శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తుండగా పోలీసులు వారిపై దౌర్జన్యంగా లాఠీచార్జీకి యాజమాన్యం ఉసిగొల్పింది. విద్యార్థుల హక్కులను అణచివేయడానికి వ్యతిరేకంగా, న్యాయంగా దక్కాల్సిన స్టైఫండ్ కోసం పోరాటం చేస్తున్నారు. ఎంత పోరాడిన స్పందన రావడం లేదని ప్రభుత్వాధికారులు నిర్లక్ష్యం వలన మాకు అన్యాయం జరుగుతుందని ఆవేదనను వ్యక్తం చేశారు. ప్రభుత్వాధికారులు, డీఎంఈ, కాళోజీ హెల్త్ యూనివర్సిటీ, ఎన్ఎంసీలు బాధ్యత రహితంగా వుంటూ తప్పుకుంటున్నాయి. విద్యార్థుల సమస్యలను పరిష్కారించాలని డిమాండ్ చేస్తూ మెడికల్ విద్యార్థులు నిరసన చేపట్టారు.

**రైల్వే ప్రాజెక్టు పనులను అడ్డుకున్న రైతులు**

సిద్ధిపేట జిల్లా, చిన్న కోడూరు మండలం, గంగాపూర్ గ్రామ ప్రజలైన రేణుక, కనకమ్మ, ఐరేనీ, బాలవ్వ, మల్లయ్య, భూపతి తదితరుల భూములు రైల్వే ప్రాజెక్టు కింద పోయాయని, గ్రామ పంచాయితీ లిస్టులో తన పేర్లు వున్నాయి. అయినప్పటికీ రైల్వే అధికారులు తనకు పరిహారం అందజేయలేదని ఆవేదనతో నిరసన చేపట్టారు. తమకు పరిహారం చెల్లించెంత వరకు పనులను జరగనివ్వమని ప్రజలు తేల్చి చెప్పారు. దీంతో తహల్దార్ చేరుకొని రైతులతో మాట్లాడి వారం రోజుల్లో మీ సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

**త్రిబుల్ ఆర్ అలైన్మెంట్ను మార్చాలని రైతుల రాస్తారోకో**

యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలంలోని దేవిరెడ్డి గూడెం ప్రస్తుతం వున్న ఔటర్ రింగ్ రోడ్డుకు 40 కిలోమీటర్ల దూరంలో నిర్మించాల్సిన త్రిబుల్ ఆర్ ను చౌటుప్పల్ లోని దివిస్ కంపెనీ, కొంతమంది పెట్టుబడిదారుల ప్రయోజనం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం 28, 30 కిలోమీటర్లలోపు నిర్మించేందుకు తీసుకొచ్చిందన్నారు. ఆ అలైన్మెంట్ ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ వద్ద పుట్టపాక, సర్వేలు, లింగారెడ్డిగూడెం గ్రామాల రైతులు రోడ్డుపై రాస్తారోకో నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, స్థానిక మంత్రి, ఎమ్మెల్యే దివిస్ కంపెనీ యాజమాన్యం పెట్టే ఎంగిలి మెతుకుల కోసం త్రిపుల్ ఆర్ అలైన్మెంట్ మార్చారంటూ ఆరోపించారు.

పుట్టపాక, సర్వేలు, లింగవారిగూడెం గ్రామాలకు చెందిన వందలాది ఎకరాల రైతుల పట్టా భూములు పోతున్నాయని వాపోయారు. ఎన్నికల ముందు దివిస్ ను పారదోల్తామని చెప్పిన ఎమ్మెల్యే గెలిచిన తరువాత రైతులను పారద్రోలుతున్నారు. ప్రాణం పోయినా తమ భూములను వదుకోమని కలిసికట్టుగా ఐక్య ఉద్యమాలతో అడ్డుకుంటామని రైతులు హెచ్చరించారు.

42వ పేజీ తరువాయి.....

**ప్రియమైన కామ్రేడ్స్, ప్రజలారా!**

1972లో ఆనాటి మన పార్టీ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ చారుమజుందార్ ను పోలీసులు పట్టుకుని హత్యచేసిన 53 ఏళ్ల తర్వాత మనపార్టీ ప్రధాన కార్యదర్శి శత్రు దాడిలో అమరుడు కావడం ఇదే మొదటిసారి. నక్సల్బరీ, శ్రీకాకుళ పోరాటాల అనంతరం ఒక సంవత్సర కాలంలోనే ప్రధాన కార్యదర్శి సహా నలుగురు కేంద్రకమిటీ సభ్యులు, 17 మంది రాష్ట్రకమిటీ సభ్యులు అమరులు కావడం ఇదే మొదటిసారి. ఈ నష్టాలు భారత విప్లవోద్యమాన్ని సాపేక్షికంగా దీర్ఘకాలం పాటు నకారాత్మకంగా ప్రభావితం చేస్తాయి. ఈ ప్రభావాన్ని అధిగమించడం కోసం కృషి చేయడమే మన కర్తవ్యం. కగార్ యుద్ధంతో విప్లవోద్యమం తీవ్రమైన నష్టాల పాలవుతున్న స్థితిలో విప్లవోద్యమ భవిష్యత్తు పట్ల విప్లవ శిబిరంలో తలెత్తుతున్న ప్రశ్నలకు జవాబునిస్తూ, భయాందోళనలకు గురయిన వారికి ధైర్యాన్ని కల్పిస్తూ, వారిలో ఆత్మవిశ్వాన్ని నింపుతూ, దృఢ సంకల్పంతో, అసమాన ధైర్యసాహసాలతో యావత్తు విప్లవ శిబిరాన్ని ముందుకు నడపడమే పార్టీ కర్తవ్యం. ఈ కర్తవ్య సాధన కోసం జరుగుతున్న నష్టాలకు కారణాల్ని గుర్తించి, వాటిని సరిదిద్దుకోవడం అవసరం; భౌతిక పరిస్థితి (అబ్జెక్టివ్ కండిషన్), స్వీయాత్మక పరిస్థితి (సబ్జెక్టివ్ కండిషన్)లో విప్లవోద్యమ పురోగమనానికి అనుకూలంగా పెంపొందుతున్న అంశాలను గుర్తించి వాటి ఆధారంగా పార్టీని, పీ.ఎల్.జీ.ఏ.ను, ఐక్యసంఘటనను సంఘటితం చేసుకోవడం అవసరం.

ప్రపంచ విప్లవోద్యమ చరిత్రలో అనేక దేశాల్లో ముఖ్యంగా రష్యా, చైనాలో విప్లవోద్యమాలు తాత్కాలిక వెనకంజకు, ఓటమికి గురయినప్పటికీ ఆ విప్లవోద్యమాలు ఆ స్థితిని అధిగమించి విజయవంతమయ్యాయి. అక్కడి విప్లవ పార్టీలు ఆనాడు ఆ వెనకంజకు, ఆ ఓటమికి దారితీసిన కారణాలను, తమ దేశాల్లోని వస్తుగత, స్వీయాత్మక పరిస్థితులను మార్క్సిస్టు పద్ధతిని అనుసరించి సరిగా విశ్లేషించి, సరైన రాజకీయ, సైనిక ఎత్తుగడలను చేపట్టి, వాటిని దృఢ సంకల్పంతో ఆచరించిన ఫలితంగానే ఆ విప్లవోద్యమాలు విజయవంతమయ్యాయి. మనపార్టీ చరిత్రలో కూడా నక్సల్బరీ, శ్రీకాకుళ విప్లవోద్యమాల ఓటమి అనంతరం ఆ ఓటమికి దారితీసిన కారణాలను సరిగా విశ్లేషించుకుని సరైన రాజకీయ, సైనిక ఎత్తుగడలను చేపట్టి, వాటిని దృఢ సంకల్పంతో ఆచరించిన ఫలితంగానే ఆంధ్రప్రదేశ్, బిహార్ రాష్ట్రాల్లో విప్లవోద్యమ వెల్లువను సృష్టించాం. నక్సల్బరీ, శ్రీకాకుళ పోరాటాల అనంతరం 1972 నుండి ఇప్పటివరకు గడిచిన 53 ఏళ్లల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భారత విప్లవోద్యమ నిర్మూలనకు అనేక విప్లవ ప్రతిఘాతక పథకాల్ని రూపొందించి విప్లవోద్యమంపై ఫాసిస్టు దాడుల్ని కొనసాగిస్తూ కొన్నిసార్లు కొన్ని రాష్ట్రాల్లో విప్లవోద్యమాన్ని నష్టాల పాల్జేశాయి. సీపీఐ (మావోయిస్టు) ఏర్పాటు అనంతరం 2005 నుండి సల్వాజుడుం తదితర పేర్లతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏర్పాటు చేసిన శ్వేత మిలిషియాల దాడి, గ్రీన్ హంట్, సమాధాన్, సూరజ్ కుండ్ పథకం కొనసాగుతూ వచ్చినప్పటికీ వాటన్నింటిని ప్రతిఘటిస్తూ, ఓడిస్తూ, విఫలం చేస్తూ వస్తున్నాం. దీనికి కారణం మనం సరైన రాజకీయ, సైనిక ఎత్తుగడలతో, ధైర్య సాహసాలతో వర్గపోరాటాన్ని-ప్రజాయుద్ధాన్ని కొనసాగించడమే. నేటి కగార్ యుద్ధాన్ని విఫలం చేయడానికి ఇదే విప్లవకర పద్ధతిని అనుసరిద్దాం.

కగార్ యుద్ధ ప్రారంభం నుండి మనపార్టీ, పీ.ఎల్.జీ.ఏ. బలగాలు, స్థానిక ప్రజా నిర్మాణ బలగాలు తీవ్రంగా నష్టపోవడానికి కారణం మన బలగాలు రహస్య పనివిధానాన్ని, గెరిల్లాయుద్ధ నియమాలను, కేంద్రకమిటీ రూపొందించిన ఎత్తుగడలను సరిగా అమలు చేయకపోవడంలో ఉంది. మన కేంద్రకమిటీ, పొలిట్ బ్యూరోలు రూపొందించిన ఎత్తుగడల ప్రకారం మన బలగాలు చిన్న ప్రాంతాలకు పరిమితం కాకుండా, విశాల ప్రాంతాల్లో పనిచేయాలి; కేంద్రీకృతమయి ఉండకుండా వికేంద్రీకృత బలగాలుగా ఉండాలి. చట్టబద్ధ-చట్టవ్యతిరేక, బహిరంగ-రహస్య పోరాట, నిర్మాణ రూపాల్ని సమన్వయించి వర్గపోరాటాన్ని నడపాలి. పట్టణ, మైదాన, అటవీ ప్రాంతాల్లో నాలుగు వర్గాల ప్రజలను విప్లవోద్యమంలో సమీకరించాలి. వీటితోపాటు మరిన్ని రాజకీయ, సైనిక ఎత్తుగడల్ని మన కేంద్రకమిటీ రూపొందించింది. ఆ ఎత్తుగడల్ని మనం సరిగా ఆచరించని ఫలితంగా తీవ్రంగా నష్టాల పాలవుతున్నాం. అన్ని రాష్ట్ర, జిల్లా కమిటీల్లో ఈ నష్టాలను సమీక్షించుకుని, కేంద్రకమిటీ రూపొందించిన సరైన రాజకీయ, సైనిక ఎత్తుగడలతో వర్గపోరాటాన్ని, గెరిల్లాయుద్ధాన్ని కొనసాగిద్దాం. తద్వారా నష్టాలను తగ్గించుకుందాం.

కేంద్రకమిటీ, పొలిట్ బ్యూరో రూపొందించిన ఎత్తుగడలను ఆచరించి పార్టీని, పీ.ఎల్.జీ.ఏ.ను, ఐక్యసంఘటనను, విప్లవోద్యమాన్ని కాపాడుకోవడం ద్వారా మార్చి 31, 2026కు ముందే విప్లవోద్యమాన్ని నిర్మూలించాలనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దుష్టపథకాన్ని విఫలం చేద్దాం.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కగార్ యుద్ధంలో మనకు తీవ్రమైన నష్టాలు కలిగిస్తున్నప్పటికీ మన ప్రతిఘటనలో శత్రు సాయుధ బలగాలు గణనీయంగా నష్టపోతున్నాయి. ఈ నష్టాల్ని శత్రువు ప్రకటించడం లేదు. మన పక్షానికి జరుగుతున్న నష్టాలను ఎక్కువ చేసి ప్రకటించడం, తన పక్షానికి జరుగుతున్న నష్టాలను ప్రకటించకపోవడం, కొన్ని సందర్భాల్లో పాక్షికంగా ప్రకటించడం అనేది మానసిక యుద్ధంలో భాగం. ఈ మానసిక యుద్ధ ప్రభావానికి విప్లవ శిబిరం గురికాకూడదు. కర్రెగుట్ట ఆపరేషన్ సమయంలో మనం వేలాది

బూబీట్రాపుల్ని అమర్చడంతో శత్రు సాయుధ బలగాలు 16 రోజుల పాటు అడ్వాన్స్ కాలేదు, చివరికి మననుండి మూకాల్ అనేవాడు పారిపోయి శత్రువుకు సరెండరయి ద్రోహిగా మారి పోలీసులకు గైడ్ గా వ్యవహరించి మన బలగాలపై దాడి చేయించిన ఫలితంగానే మనకు నష్టాలు జరిగాయి. శత్రువు మనకు జరిగిన నష్టాల్ని ప్రకటించాడు కానీ తనకు జరిగిన నష్టాల్ని ప్రకటించలేదు. ఈ ఆపరేషన్ సమయంలో 110 చోట్ల బూబీట్రాపులు పేలి శత్రు సాయుధ బలగాలు 45-50 మంది చనిపోయి, 70-80 మంది గాయపడ్డారు. అలాగే మే 8 నాడు శత్రు సాయుధ బలగాలు మన బలగాల్ని చుట్టుముట్టి దాడి చేసినప్పటికీ ఆ దాడిని మన బలగాలు ధైర్యసాహసాలతో తిప్పికొట్టాయి. ఈ ప్రతిఘటనలో మన బలగాలు 5 గురు గ్రేహౌండ్స్ కమాండోలను నిర్మూలించి, 4 గురు కమాండోలను గాయపర్చి వారినుండి ఒక ఏకే, ఒక ఎస్ఎల్ఆర్ ను, 150 తూటాలను ఇతరత్ర సామాన్లను స్వాధీనం చేసుకున్నాయి. ఈ వాస్తవాన్ని కప్పిపుచ్చి తమ బలగాల క్రాస్ ఫైరింగ్ లో గ్రేహౌండ్స్ పోలీసులు చనిపోయారని ప్రకటించారు. ముర్ధొండ వద్ద జూలై 8 నాడు మన పీ.ఎల్.జీ.ఏ. బలగాలు సాహసిక ఆంబుష్ చేసి 11 మందిని నిర్మూలించి, 5 గురిని గాయపరిస్తే, శత్రువు తమవైపు ముగ్గురు సీ.ఆర్.పీ.ఎఫ్. పోలీసులు మాత్రమే గాయపడ్డారని ప్రకటించాడు. ఇలాగే ఝార్ఖండ్, ఒడిశా తదితర రాష్ట్రాల్లో మన ప్రతిఘటనలో తనవైపు జరుగుతున్న నష్టాలను శత్రువు ప్రకటించడం లేదు. ఇది బలహీనమైన శత్రు మోరేల్ కు నిదర్శనం. అందుకే శత్రువు ఒక పార్టీ కార్యకర్త/ప్రజా గెరిల్లా వెనక 30 నుండి 100 సాయుధ బలగాలను మోహరిస్తున్నాడు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యమ ప్రాంతాల్లో లక్షలాది సాయుధ బలగాల్ని మోహరించి, వాటికి ఆధునిక ఆయుధాల్ని, ఆధునిక టెక్నాలజీని అందించినా అవి మన బలగాల సంఖ్యకు సమాన సంఖ్యలో వచ్చి దాడి చేయడానికి సాహసించక పోవడానికి కారణం ఆ బలగాలు కిరాయి బలగాలు కావడమే. ఇది శత్రు సాయుధ బలగాల వ్యూహాత్మక బలహీనత. ఈ బలహీనతే అంతిమంగా శత్రు ఓటమికి దారితీస్తుంది.

కగార్ యుద్ధం ఫలితంగా మన స్వీయాత్మక శక్తులు నష్టపోయినప్పటికీ మనకు అనేక రాష్ట్రాల్లో పార్టీ, ప్రజాసంఘాలున్నాయి. వాటి నాయకత్వంలో వేర్వేరు ప్రాంతాల్లో వేలాదిమంది ప్రజలు విప్లవోద్యమంలో పాల్గొంటున్నారు. ఇప్పటికీ మనకు కొన్ని రాష్ట్రాల్లో గెరిల్లా దళాలున్నాయి, అవి శక్తి మేరకు గెరిల్లాయుద్ధాన్ని కొనసాగిస్తున్నాయి.

ప్రపంచంలోని అన్ని దేశాల వర్గపోరాటాల అనుభవ సారమే శాస్త్రీయ సోషలిస్టు సిద్ధాంతం. విప్లవోద్యమంలో అనుకూలతలు ప్రధానంగా ఉన్న సమయాల్లో కూడా ప్రతికూలతలు ఉంటాయనీ, ప్రతికూలతలు ప్రధానంగా ఉన్న సమయాల్లో కూడా అనుకూలతలు ఉంటాయని విప్లవ సిద్ధాంతం చెపుతుంది. అలాగే శత్రువును/దోపిడీ వర్గాలను వ్యూహాత్మకంగా, ఎత్తుగడల పరంగా అంచనా వేయాలనీ, దోపిడీ వర్గాలను వ్యూహాత్మకంగా కాగితపు పులిగానే అంచనా వేయాలని మన సిద్ధాంతం చెపుతుంది. అందుకే ఎత్తుగడలపరంగా నేడు శత్రువు ఆధిక్యతలో వున్న వ్యూహాత్మకంగా బలహీనుడే. మనం వస్తుగత స్థితిని, స్వీయాత్మక స్థితిని గతితార్కికంగా విశ్లేషించాలి. అంటే మనం వాటి గురించి ఏకపక్ష, స్వీయాత్మక అంచనాలు వేయకూడదు. అందుకే మనం వస్తుగత స్థితి విప్లవానికి అనుకూలంగా మారుతుందని, స్వీయాత్మక స్థితి బలహీనంగా ఉందని, విప్లవోద్యమం తాత్కాలిక వెనకంజలో వుందని, ప్రస్తుతం శత్రువు ఆధిక్యతలో ఉన్నాడని అంచనా వేస్తున్నాం. అయితే ఈ స్థితిని తప్పనిసరిగా మార్చగలుగుతాం, మార్చడం కోసం కృషి చేయడం మన కర్తవ్యం. విప్లవోద్యమం తాత్కాలిక వెనకంజలో ఉన్నా, ఓటమి పాలయినా వర్గాలు ఉన్నంతకాలం వర్గపోరాటం కొనసాగుతూనే ఉంటుంది. ఆ వర్గపోరాటాన్ని సరైన ఎత్తుగడలతో నడిపితే విప్లవ పార్టీ తిరిగి బలపడి, విప్లవోద్యమం పురోగమిస్తుంది.

అందుకే నేటిస్థితిలో, కేవలం శత్రు ఆధిక్యతను, మనకు జరుగుతున్న నష్టాలను మాత్రమే చూసి అవిశ్వాసానికి గురికావద్దు, అధైర్యపడొద్దు, నిష్క్రియపరత్వానికి గురికావద్దు. శత్రు ఆధిక్యతతో పాటు వాడికున్న బలహీనతలనూ, ఉద్యమ ప్రాంతాలంతటా, దేశవ్యాప్తంగా మన పార్టీ తమకు అండగా ఉండాలని కోరుకుంటున్న కోట్లాది ప్రజల ఆకాంక్షల్ని, విప్లవోద్యమంలో వేర్వేరు రూపాల్లో కదులుతున్న వారి భాగస్వామ్యాన్ని, వారి మద్దతును గమనంలో ఉంచుకుని మనం నిండైన విశ్వాసంతో, ధైర్యంగా, క్రియాశీలంగా, చొరవగా పనిచేయాలి. మారిన పరిస్థితికి తగినట్టుగా వర్గపోరాటాన్ని, గెరిల్లాయుద్ధాన్ని నడపాలి.

విప్లవోద్యమంలోని అనుకూలతలను వెన్నంటి రహస్య పనివిధానాన్ని అమలు చేయడంలో కొన్ని లోపాలు జరిగాయి. ఆ లోపాలను సరిదిద్దుకోవడం ద్వారా మనపార్టీని శత్రువుకు అభేద్యంగా తయారు చేసుకోవాలి. అలాగే సరెండర్లను నివారించాలి. మారిన సామాజిక పరిస్థితికి తగినట్టుగా, తాత్కాలిక వెనకంజను అధిగమించేలా వర్గపోరాటాన్ని, గెరిల్లాయుద్ధాన్ని నడపడం ద్వారానే పార్టీ శక్తి, సమర్థతలు పెరుగుతాయి. అందుకోసం 'భారతదేశంలో ఉత్పత్తి సంబంధాల్లో మార్పులు-మన రాజకీయ కార్యక్రమం', 'కులసమస్య-మన దృక్పథం', 'జాతుల సమస్య-మన దృక్పథం' డాక్యుమెంట్ల గైడెన్స్ లో సామ్రాజ్యవాదానికీ, దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ వర్గానికీ, భూస్వామ్య వర్గానికి వ్యతిరేకంగా వర్గపోరాటాన్ని కొనసాగిద్దాం. చిన్న, వికేంద్రీకృత చర్యల ద్వారా గెరిల్లా యుద్ధాన్ని కొనసాగిద్దాం.

కగార్ యుద్ధాన్ని ఆపివేయాలని, మావోయిస్టులతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు శాంతిచర్చలు జరపాలని దేశంలో ప్రజలు కొనసాగిస్తున్న ఉద్యమానికి మద్దతునిద్దాం. ప్రజల ప్రయోజనాల రీత్యా మా పార్టీ ఎప్పుడైనా శాంతిచర్చలకు సిద్ధమేనని మరోసారి తెలియజేస్తున్నాం.

అయితే అందుకోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కగార్ యుద్ధాన్ని ఆపివేయాలని, ఉద్యమ ప్రాంతాల్లో సాయుధ బలగాల క్యాంపుల ఏర్పాటును ఆపివేయాలని మరోసారి డిమాండ్ చేస్తున్నాం.

**ప్రియమైన కామ్రేడ్స్, ప్రజలారా!**

అంతర్జాతీయంగా ఈ మధ్యకాలంలో జరిగిన/జరుగుతున్న పరిణామాలన్నీ 2008 నుండి కొనసాగుతున్న సామ్రాజ్యవాద ఆర్థిక సంక్షోభపు పర్యవసానాలే. దాదాపు గత 12-13 ఏళ్లుగా కొనసాగుతున్న బహుధృవ ప్రపంచపు అస్థిరత, అల్లకల్లోలం, గందరగోళపు వ్యక్తీకరణలే. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రపంచ దేశాలపై విధిస్తున్న సుంకాలతో (టారిఫ్ లతో), ప్రతీకార సుంకాలతో నష్టాల పాలవుతున్న వెనకబడిన దేశాలు చైనా, రష్యాలతో వ్యాపార ఒప్పందాలు చేసుకుంటున్నాయి. దీంతో అమెరికా ఆర్థిక సంక్షోభం మరింత తీవ్రతరమయి అక్కడి ప్రజలు ట్రంప్ ఆర్థిక విధానాల్ని వ్యతిరేకిస్తూ వీధుల్లోకి వస్తున్నారు. చైనా, ఒకవైపు అమెరికాతో తాత్కాలికంగా సుంకాల తగ్గింపు ఒప్పందం చేసుకుని, మరోవైపు వెనకబడిన దేశాలతో (గ్లోబల్ సౌత్) వ్యాపార ఒప్పందాలు చేసుకుని తన ఆర్థిక స్థితిని మెరుగుపర్చుకోవడానికి ప్రయత్నాలు చేస్తోంది. వెనకబడిన దేశాలతో రష్యా వ్యాపార ఒప్పందాలు చేసుకుంటూ యుక్రెయిన్ యుద్ధాన్ని కొనసాగించగలుగుతోంది.

ప్రపంచవ్యాప్తంగా ఈరోజు సెమికండక్టర్స్, విద్యుత్ వాహనాలు (ఎలక్ట్రిక్ వెహికిల్స్), కీలక ఖనిజాలు (రేర్ ఎర్త్ మినరల్స్), అంతరిక్ష రంగాల్లో సామ్రాజ్యవాద దేశాల మధ్య తీవ్రమైన పోటీ కొనసాగుతోంది. ఈ పోటీలో భాగంగానే అమెరికా నాయకత్వంలోని నాటో కూటమికి రష్యా మధ్య ఉక్రెయిన్ లో పరోక్ష యుద్ధం కొనసాగుతోంది, ఇందులో భాగంగానే పశ్చిమాసియాలో అమెరికా ఇజ్రాయిల్ ను ముందుంచి పాలస్తీనా జాతిని నిర్మూలించి గాజా సహ మొత్తం పాలస్తీనా భూభాగాన్ని ఆక్రమించే దురాక్రమణ యుద్ధాన్ని కొనసాగిస్తోంది. ఇందులో భాగంగానే అమెరికా-చైనాల మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. ఆర్థిక సంక్షోభం నుండి గట్టెక్కడానికి సామ్రాజ్యవాదం అనుసరిస్తున్న ఆర్థిక, రాజకీయ, సైనిక, సాంకేతిక విధానాల ఫలితంగా, అవి వెనకబడిన దేశాలపై దురాక్రమణ యుద్ధాలకు పాల్పడుతున్నందున, ఫాసిజాన్ని అమలు చేస్తున్నందునా వాటితో వెనకబడిన దేశాల్లోని పీడిత జాతులకు, ప్రజలకు; సామ్రాజ్యవాదానికీ మధ్య వైరుధ్యం మరింత తీవ్రతరమవుతున్నాయి, పెట్టుబడిదారీ దేశాల్లో పెట్టుబడిదారీ వర్గానికీ కార్మిక వర్గానికీ నడుమ వైరుధ్యం మరింత తీవ్రతరం అవుతోంది. దాని ఫలితంగా ప్రపంచవ్యాప్తంగా విప్లవానుకూల పరిస్థితి మరింత పెరుగుతోంది.

బ్రాహ్మణీయ హిందుత్వ ఫాసిస్టు ఆర్ఎస్ఎస్-బీజేపీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 2047 నాటికి దేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా (వికసిత్ భారత్) అభివృద్ధి చేస్తామనే ప్రచార హోరును ప్రజలు అర్థం చేసుకోవడం అవసరం. 'వికసిత్ భారత్' అంటే కార్పొరేట్ హిందూదేశమే తప్ప మరేమి కాదు. అంటే దేశం ఆర్థిక, రాజకీయ, సామాజిక, సాంస్కృతిక రంగాలన్నింటా దేశ, విదేశీ కార్పొరేట్ల (సామ్రాజ్యవాద, దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ వర్గం) దోపిడీ పీడనలు మరింత పెరిగి చట్టబద్ధతను సంతరించుకుంటున్నాయి. ఆ కార్పొరేట్లతో భూస్వామ్య వర్గాల కుమ్మక్కు పెరిగి ఈ మూడింటి కూటమి పీడిత ప్రజలను, పీడిత సాంఘిక సముదాయాలను, పీడిత జాతులను తీవ్రమైన దోపిడీ, పీడనలకు గురిచేస్తాయి. అందుకే 'వికసిత్ భారత్' అంటే సామ్రాజ్యవాద, దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ వర్గ, భూస్వామ్య వర్గాల సంపదలు పెరగడమే, అశేష ప్రజానీకపు (పీడిత ప్రజల, పీడిత సాంఘిక సముదాయాల, పీడిత జాతుల) సంపదలు, ఉపాధి అవకాశాలు, అధికారాలు తగ్గిపోవడమే. అందుకే 'వికసిత్ భారత్' అంటే దేశంలో అశేష ప్రజానీకపు బతుకులు వినాశనం కావడమే. అందుకే 'వికసిత్ భారత్' లోని మోసాన్ని అర్థం చేసుకుని దానికి వ్యతిరేకంగా పోరాడడమే ఈరోజు దేశ ప్రజల కర్తవ్యం.

ఈ మధ్యకాలంలో భారతదేశం నుండి అమెరికాకు ఎగుమతయ్యే సరుకులపై సుంకాలు పెరగడంతో ప్రధాని మోదీ, కేంద్ర మంత్రులు ఆత్మ నిర్భరతా (స్వావలంబన), స్థానిక ఉత్పత్తుల్ని కొనుగోలు చేయాలనే (వోకల్ ఫర్ లోకల్) ప్రచారాన్ని తీవ్రతరం చేసారు. సామ్రాజ్యవాద దేశాలతో కుదుర్చుకున్న అసమాన ఆర్థిక, వ్యాపార, వాణిజ్య ఒప్పందాల్ని రద్దు చేసుకోనంతకాలం, సామ్రాజ్యవాదానికి తలొగ్గని స్వతంత్ర ఆర్థిక విధానాలను ఆచరించనంతకాలం ఆత్మ నిర్భర్ భారత్, వోకల్ ఫర్ లోకల్ అనే నినాదాలు మనదేశ ప్రజల్ని మోసగించే బూటకపు విధానాలే/నినాదాలే తప్ప వాటితో దేశ ఆర్థిక వ్యవస్థలో ఎలాంటి మార్పురాదు. అమెరికా ప్రతీకార సుంకాలకు ప్రతిగా ప్రతీకార సుంకాలు విధించలేని భారత ప్రభుత్వం ఒకవైపు అమెరికా నుండి దిగుమతయ్యే చక్కెరపై సుంకాల తగ్గింపు కాలాన్ని డిసెంబర్ వరకు పొడిగిస్తానని ప్రకటించింది. ఈ ఒక్క పాలసీ ద్వారా, 'భారతదేశ మార్కెట్లోకి చొరబడనున్న బహుళజాతి సంస్థలను అడ్డుకుని దేశ రైతాంగాన్ని, పాల ఉత్పత్తిదార్లను, మత్స్యకారులను కాపాడుతాననని' మోదీ చేసిన/చేస్తున్న ప్రకటనలు బూటకం అని తేలిపోయాయి. ఒకవైపు రష్యా, చైనాలతో వ్యాపార ఒప్పందాలు కుదుర్చుకుంటూనే అమెరికాకు కంటగింపు కాకూడదని 'భారత-అమెరికా దేశాల మధ్యనున్న సంబంధాలు ప్రత్యేకమైనవనీ, వ్యూహాత్మకమైనవనీ, ఇరుదేశాల ప్రయోజనాలకు భంగం కలగని విధంగా వ్యవహరిస్తామని ఈ మధ్య భారతదేశ విదేశాంగ మంత్రిత్వశాఖ చేసిన ప్రకటన భారతదేశపు లొంగుబాటును ప్రదర్శించేదే తప్ప స్వతంత్రతను, స్వావలంబనను ప్రదర్శించేది కాదు. అందుకే మోదీ, బీజేపీల మోసాల్ని తిప్పికొట్టి సామ్రాజ్యవాద, దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ వర్గాలకు, భూస్వామ్య వర్గాలకు వ్యతిరేకంగా సాగుతున్న పోరాటాన్ని తీవ్రతరం చేయడం ఈనాడు దేశప్రజల కర్తవ్యం.

మోదీ గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్న రోజుల నుండి బీజేపీ అసెంబ్లీ ఎన్నికల్లో, పార్లమెంటరీ ఎన్నికల్లో ఓట్ల దొంగతనం (ఓట్ చోరీ)తో సహా అనేక ఎన్నికల అక్రమాలకు పాల్పడుతూ ఆ ఎన్నికలను గెలుస్తూ వస్తోంది. ఇందులో భాగంగానే 2024 ఏప్రిల్ అసెంబ్లీ, పార్లమెంటరీ ఎన్నికల్లో, తదనంతరం జరిగిన మహారాష్ట్ర తదితర రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో ఆ పార్టీ అధికారం హస్తగతం చేసుకోగలిగింది. 'ఓట్ చోరీ' అక్రమాల్ని కాంగ్రెస్ పార్టీ చాలా ఆలస్యంగా వెలుగులోకి తేగలిగింది. దీంతో మరోసారి పార్లమెంటరీ ఎన్నికల వ్యవస్థ ఎంతటి బూటకమో ప్రజలకు తెలిసివచ్చింది. అందుకే నిజమైన ప్రజాస్వామ్యం నూతన ప్రజాస్వామిక విప్లవ విజయం ద్వారానే సాధ్యం. అందుకే మావోయిస్టు పార్టీ నాయకత్వంలో సాగుతున్న నూతన ప్రజాస్వామిక విప్లవంలో భాగస్వాములు కావాల్సిందిగా దేశంలోని అశేష ప్రజానీకానికి పిలుపునిస్తున్నాం. సామ్రాజ్యవాదాన్ని, దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ వర్గాన్ని, భూస్వామ్య వర్గాన్ని అధికారం నుండి కూలదోయడం ద్వారా దేశంలో దోపిడి, పీడనలు లేని నూతన ప్రజాస్వామిక వ్యవస్థను, సోషలిజాన్ని నెలకొల్పడం కోసం సాగుతున్న నూతన ప్రజాస్వామిక విప్లవంలో భాగస్వాములు కావాల్సిందిగా అశేష ప్రజానీకానికి పిలుపునిస్తున్నాం.

## నినాదాలు

- ★ మన పార్టీని, విప్లవోద్యమాన్ని నిర్మూలించే దుష్టలక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొనసాగిస్తున్న 'ఆపరేషన్ కగార్' విప్లవ ప్రతిఘాతక యుద్ధాన్ని తిప్పికొడుదాం.
- ★ ప్రజాపునాదిని, స్వీయాత్మక శక్తులను పెంచుకుంటూ పార్టీని, పీ.ఎల్.జీ.ఏ.ను, ప్రజా నిర్మాణాలను/ఐక్యసంఘటనను, విప్లవోద్యమాన్ని కాపాడుకుందాం.
- ★ నష్టాలను నివారించుకుందాం.
- ★ లొంగుబాట్లను, విప్లవ ద్రోహాన్ని వ్యతిరేకిద్దాం. పీడిత ప్రజల ప్రయోజనాలను కాపాడేందుకు దృఢంగా పోరాడుదాం.
- ★ శత్రువుకు అభేద్యంగా పార్టీని తీర్చిదిద్దుకుందాం.
- ★ నిరంతరం పెంపొందే ప్రజాపునాదిపై ఆధారపడి శక్తిమేరకు గెరిల్లాయుద్ధాన్ని కొనసాగిద్దాం.
- ★ సామ్రాజ్యవాద, దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ, భూస్వామ్య వ్యతిరేక వర్గపోరాటాన్ని తీవ్రతరం చేద్దాం.
- ★ బ్రాహ్మణీయ హిందుత్వ ఫాసిజానికి వ్యతిరేకంగా పోరాడుదాం.
- ★ మార్క్సిజం-లెనినిజం-మావోయిజం వర్ధిల్లాలి.
- ★ భారత నూతన ప్రజాస్వామిక విప్లవం వర్ధిల్లాలి.
- ★ ప్రజా విముక్తి గెరిల్లా సైన్యం (పీ.ఎల్.జీ.ఏ.) వర్ధిల్లాలి.
- ★ భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) వర్ధిల్లాలి.

**విప్లవాభినందనలతో,**

**కేంద్రకమిటీ, భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)**

# సీపీఐ (మావోయిస్టు) 21వ స్థాపనా వార్షికోత్సవాలను సెప్టెంబర్ 21 నుండి 27 వరకు దేశవ్యాప్తంగా విప్లవ స్ఫూర్తితో నిర్వహించండి.

## పార్టీని, పీ.ఎల్.జీ.ఏ.ను, ఐక్యసంఘటనను, విప్లవోద్యమాన్ని కాపాడుకుందాం. విప్లవ ప్రతిఘాతక 'కగార్' యుద్ధాన్ని విఫలం చేసేందుకు విశాల ప్రజారాశులను వర్గపోరాటంలో, గెరిల్లాయుద్ధంలో సమీకరిద్దాం.

## శత్రువుకు అభేద్యంగా పార్టీని తీర్చిదిద్దుకుందాం. విప్లవోద్యమ వెనకంజ స్థితిని అధిగమించే సమర్థతలను పెంచుకుందాం.

ప్రియమైన కామ్రేడ్స్, ప్రజలారా!

గత సంవత్సరం మనం విప్లవ ప్రతిఘాతక 'కగార్' యుద్ధాన్ని ప్రతిఘటిస్తూనే మనపార్టీ 20వ వార్షికోత్సవాలను ఉత్సాహంగా జరుపుకున్నాం. ఆ వార్షికోత్సవాల సందర్భంగా యావత్తు పార్టీకి, విప్లవోద్యమానికి మన కేంద్రకమిటీ నిర్దేశించిన కర్తవ్యాల సాధనకు గత సంవత్సర కాలంగా కగార్ యుద్ధాన్ని విఫలం చేసేందుకు మనపార్టీ, పీ.ఎల్.జీ.ఏ., స్థానిక నిర్మాణాలు అత్యంత సాహసోపేతంగా, దృఢసంకల్పంతో కృషి చేస్తున్నాయి. ఈ కృషిలో పాల్గొన్న పార్టీ శ్రేణులకు, పీ.ఎల్.జీ.ఏ. బలగాలకు, ప్రజా నిర్మాణాల కార్యకర్తలకు, అన్ని రంగాల నాయకులకు, విప్లవ ప్రజానీకానికి, విప్లవ శ్రేయోభిలాషులకు మన కేంద్రకమిటీ విప్లవాభినందనలు తెలియజేస్తోంది.

పార్టీని, పీ.ఎల్.జీ.ఏ.ను, ఐక్యసంఘటనను, విప్లవోద్యమాన్ని కాపాడుకుందామనీ, విప్లవ ప్రతిఘాతక 'కగార్' యుద్ధాన్ని విఫలం చేసేందుకు విశాల ప్రజారాశులను వర్గపోరాటంలో, గెరిల్లాయుద్ధంలో సమీకరిద్దామనీ, శత్రువుకు అభేద్యంగా పార్టీని తీర్చిదిద్దుకుందామని, విప్లవోద్యమ వెనకంజ స్థితిని అధిగమించేలా పార్టీ శక్తి, సమర్థతల్ని పెంచుకుందామని 21వ పార్టీ స్థాపన వార్షికోత్సవాల సందర్భంగా యావత్తు పార్టీ శ్రేణులకు, విప్లవ ప్రజానీకానికి మన కేంద్రకమిటీ పిలుపునిస్తోంది.

ఈ సంవత్సరకాలంలో నూతన ప్రజాస్వామిక విప్లవ లక్ష్య సాధన కోసం కృషి చేస్తూ, కగార్ యుద్ధాన్ని ప్రతిఘటిస్తూ మనపార్టీ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ బసవరాజు (నంబాల కేశవరావు), కేంద్రకమిటీ సభ్యులు కామ్రేడ్స్ చలపతి, వివేక్, ఉదయ్ లు, రాష్ట్రకమిటీ కామ్రేడ్స్ శర్మ (జగ్జీత్ సింగ్ సోహల్), గౌతం, మధు (సజ్జా వెంకట నాగేశ్వరరావు), జయ, రూపేష్, నీతి, కార్తిక్, చైతే, గుడ్డు, సత్యం, అలోక్, పాపన్న, మధు (ఏగోళపు మల్లయ్య), భాస్కర్, జగన్, అరుణ, విజయ్ లు అమరులయ్యారు. ఇదే కాలంలో జిల్లాకమిటీ/కంపెనీ పార్టీ కమిటీ కామ్రేడ్స్ 26 మంది, ఏరియా కమిటీ/ప్లాటూన్ పార్టీ కమిటీ కామ్రేడ్స్ 86 మంది, పార్టీ, పీఎల్.జీ.ఏ. సభ్యులు 152 మంది, స్థానిక నిర్మాణాల సభ్యులు, విప్లవ ప్రజలు 38 మంది, వివరాలు తెలియని కామ్రేడ్స్ 43 మంది వున్నారు. మొత్తం 366 మంది కామ్రేడ్స్ అమరులయ్యారు. ఫిలిప్పీన్స్ కమ్యూనిస్టు పార్టీ కేంద్రకమిటీ సభ్యుడు, నేషనల్ డెమోక్రటిక్ ఫ్రంట్ ఆఫ్ ఫిలిప్పీన్స్ నాయకుడు కామ్రేడ్ లూయి జలందానీ జూన్ 7న 90 ఏళ్ల వయసులో అనారోగ్యంతో అమరుడయ్యాడు. ఈ సంవత్సరకాలంలో ప్రపంచ విప్లవంలో భాగంగా వివిధ దేశాల్లో కొద్దిమంది విప్లవ నాయకులు, సభ్యులు అమరులయ్యారు. ఈ అమరులందరికీ కేంద్రకమిటీ వినమ్రంగా శ్రద్ధాంజలి ఘటిస్తున్నది. అమరుల మహోన్నత ఆశయసాధన కోసం దృఢ సంకల్పంతో కృషి చేస్తామని శపథం చేస్తున్నది.

మిగతాది 38వ పేజీలో...